# చుక్కలలోకం చుట్టొద్దాం!

పిల్లల నాటికలు

డా॥ అమృతలత

# అభినందన చందనాలు



శ్రీపాద కుమారశర్మ
(నటుడు, దర్శకుడు, ప్రయోక్త)

ఆధునిక తెలుగు నాటక రంగానికి నూటా ముప్పై సంవత్సరా లకి పైబడిన ఘన చరిత్ర వుంది.

నాటకం ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తుంది. ఆహ్లాదపరుస్తుంది, అలరిస్తుంది, ఆనందపరుస్తుంది, కవ్విస్తుంది, నవ్విస్తుంది, ఏడిపిస్తుంది!

అందుకే - 'జనుల జీవితాల్ని ప్రతిబింబించేవి నవరసభరిత నాటికలు కాబట్టి  నాటకకర్తలే గొప్ప సామాజిక అధ్యాపకులుగా రూపాంతరం చెందుతారు' - అంటారు బళ్ళారి రాఘవ.

నాటికలు రాసేవారికుండవలసిన కొన్ని లక్షణాలు :

★ జనరంజకంగా ఉండే మంచి ఇతివృత్తానెంచుకోవడం.

★ ఎంచుకున్న ఇతివృత్తానికి ధీటుగా వుండే సన్నివేశాలు సమకూర్చుకుని, కథానుగుణంగా పాత్రలను తీర్చిదిద్దడం.

★ సన్నివేశాలకి అనుగుణంగా చెప్పదలచుకున్న విషయాన్ని సుస్పష్టంగా, ఇతివృత్తానికి భంగం కలగకుండా- ప్రేక్షకుల మన్ననలు పొందే రీతిలో - వాడిగా, వేడిగా సహజత్వం ఉట్టిపడేలా సంభాషణలు వ్రాయడం.

★ సమకూర్చిన సన్నివేశాలూ, సంఘటనలూ ఆకర్షణీయంగా ఉండడం.

ఇవన్నీ కలబోసి నాటక రచన చేసే రచయితలూ, రచయిత్రులు మాత్రమే నాటక రంగంలో సుస్థిర స్థానాన్ని సముపార్జించుకుంటారు!

పై లక్షణాలను పుణికిపుచ్చుకున్నవారిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ వ్యక్తి ఇందూరు ఆణిముత్యం డా॥ అమృతలతగారు. ఆమె ఎన్నోనాటికలు, పాటలు, నవలలు, కథానికలు రాస్తూ తెలుగు సాహితీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సముపార్జించుకున్న విదుషీమణి.

"స్కూల్‌డే వస్తున్నా స్కూల్లో మరోఫంక్షన్ ఏది వచ్చినా ఏం నాటిక వేయాలి అనే ప్రశ్న అందర్నీ వేధిస్తూ ఉంటుంది. ఇలాంటి సమస్యకి పరిష్కారమే ఈ 'చుక్కల లోకం చుట్టొద్దాం!' నాటికల సంపుటి!" అని ఆ పుస్తక ప్రాముఖ్యతను వివరించారు. అమృతలత.

'చుక్కల లోకం చుట్టొద్దాం!' పిల్లల నాటికల సంపుటిలో - నాటికలన్నీ ఒకదాన్నిమించి మరోటి వున్నట్లనిపిస్తుంది. సంభాషణల పరంగా 'స్టడీ అవర్స్', 'పవర్ కట్', 'బస్టాండ్' నాటికలు బావున్నాయి.

డీఈవో స్కూలుకు ఇన్స్‌పెక్షన్‌కు వస్తున్నారంటే, హెడ్ మాస్టర్లూ, టీచర్లు విద్యార్థులూ పడే అవస్థల్ని 'ఇన్‌స్పెక్షన్' నాటికలో కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు రచయిత్రి.

హాస్టల్లో వుండే వివిధ మనస్తత్వాలు గల పిల్లలు స్టడీ అవర్స్ సమయంలో తమ చేష్టలతో వార్డెన్లను ఎలా విసిగిస్తారో - 'స్టడీ అవర్స్' నాటికలో చక్కగా పొందుపరిచారు రచయిత్రి.

ఇరుగు పొరుగు వాళ్ళ ఇళ్ళలో టీ.వీ.లు లేకపోతే టి.వీ. వున్న పక్కింటి వాళ్ళ ఇంటికి టీ.వీ.లో వచ్చే కార్యక్రమాల కోసం ఎగబడివచ్చి ఏ విధంగా సతాయిస్తారో అత్యంత సహజంగా విశదీకరించారు 'టీవీ న్యూసెన్స్' నాటికలో రచయిత్రి.

వివిధ ఫంక్షన్లలో అతిథులు తెచ్చిచ్చే బహుమతుల తీరుతెన్నుల్ని, అత్యంత సునిశితంగా విమర్శనాత్మకంగా 'ప్రెజెంటేషన్స్' నాటికలో వివరించారు రచయిత్రి. ఈ నాటిక బర్త్‌డేని వ్యాపార

దృష్టితో సెలబ్రేట్ చేసే కొందరికి చెంపపెట్టు.

పిల్లల అల్లరి భరించలేక మూడో ఏట నించే వారిని బడికి పంపే రోజులివి. పిల్లలు స్కూల్‌కి వెళితే పేరెంట్స్‌కి సెలవులు.... స్కూల్‌కి సెలవులొచ్చి పిల్లలు ఎవరిళ్ళలో వాళ్ళుంటే, అవి టీచర్స్‌కి సెలవులన్న విషయాన్ని చెప్పే 'హాలిడేస్' నాటికలో చాలా మంది తల్లిదండ్రులు తమని చూసుకోగలుగుతారు. ఈ నాటికలో సెలవుల్లో పిల్లలు చేసే అల్లరి ఏయే రూపాల్లో వుంటుందో, కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించారు రచయిత్రి.

పరీక్షల వేళల్లో ఇన్విజిలేషన్ చేసేటప్పుడు ఎదురయ్యే విద్యార్థుల విన్యాసాల్ని ఎంతో వ్యంగ్యంగా చిత్రీకరించారు 'ఇన్విజిలేషన్' నాటికలో.

'స్కూల్‌డే' నాటిక గురించి చెప్తూ - ఈ నాటిక అందరికీ వంకలు పెట్టే ఆకతాయికి సరైన గుణపాఠం అని మొదట్లోనే చెప్పారు రచయిత్రి. ఇది ఒక మంచి హాస్య నాటిక. స్కూల్‌డే నాటికలోని ప్రేక్షకులని మనం అనేకసార్లు చూసివుంటాం.

'బస్టాండ్' నాటికలో బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, ప్రయాణీకులు పడే కష్టాలు, కండక్టర్స్ ప్రదర్శించే కోపతాపాలు, తొక్కిసలాటలు, రుసరుసలు, బిచ్చగాళ్ళ బెడద తదితర సంఘటనలను ఆయా పాత్రలకు సరిపడే రీతిలో చిత్రించారు రచయిత్రి. ముఖ్యంగా ఉర్దూ, తెలంగాణ మాండలికంలో రాసిన సంభాషణలు చాలా చక్కగా ఉన్నాయి.

అడ్వర్‌టైజ్‌మెంట్లతో, పెళ్ళిళ్లలో పురోహితులు మైకు చేత పట్టుకుని పలికే మంత్రోచ్చారణలతో, సినిమాలకు సంబంధించి 'నేడే చూడండి' లాంటి అనౌన్స్‌మెంట్లతో, రాజకీయ మైకాసురులు మైకుల్లో విసిరే వాగ్బాణాల హోర్లతో ప్రజలు ఎలా సతమతమౌతుంటారో అర్థమయ్యేలా - 'బివేరాఫ్‌మైక్స్' నాటికలో చక్కటి సంఘటనలను సమకూర్చారు రచయిత్రి.

నిరంతర పవర్‌కట్‌తో సతమతమయ్యే గృహిణుల, విద్యార్థుల,

పిల్లల, పెద్దల అవస్థలనీ; పవర్‌కట్ వల్ల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల్లో కలిగే అంతరాయాలనీ చక్కటి ఛలోక్తులతో కొనసాగించారు 'పవర్‌కట్' నాటికలో రచయిత్రి.

ధ్వనికాలుష్యం సమస్యని 'బివేరాఫ్ మైక్స్'లో, విద్యుత్ కోత సమస్యని 'పవర్‌కట్'లో చక్కగా స్పృశించారు.

'ట్యూషన్స్' నాటికలో - స్కూళ్ళలో టీచర్లూ, ట్యూషన్ మాస్టార్లిచ్చే హోం వర్కు చేయలేక, విద్యార్థులు పడే అవస్థలూ, ట్యూషన్ మాస్టర్స్‌చేసే వివిధ గిమ్మిక్కులూ చక్కగా విశదీకరించారు రచయిత్రి.

ఈ సంపుటిలోని చాలా నాటికలు 'ఆంధ్రభూమి' వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించబడి, పాఠకుల ప్రశంసలను అందుకున్నాయి.

ఇంత మంచి నాటికలను రాసి - వాటిని పుస్తకరూపంలో మనకందించిన డా॥ అమృతలతని మనసారా అభినందిస్తూ - వారు మున్ముందు మరెన్నో మంచి నాటికలను పాఠకులకు అందిస్తారని ఆశిస్తూ.....

***- శ్రీపాద కుమారశర్మ***

# కృతజ్ఞతలు

రంగస్థల నటుడిగానూ, నాటక ప్రయోక్తగానూ, నాటక కళాపోషకులు గానూ ప్రఖ్యాతి గడించి, నిజామాబాదు జిల్లా కీర్తిని నలుదిశలా ఇనుమడింప చేస్తోన్న శ్రీపాద కుమారశర్మగారు నా పుస్తకానికి సముచిత వ్యాఖ్యానాలతో 'ముందుమాట' రాసారు. వారికి నా ధన్యవాదాలు.

బాలి గీసిన ముఖచిత్రం, వివిధ నాటికలకి సుభాని, బెన్హర్, నటరాజ్, న్యూట్రాన్, బెన్ని, త్రిగుణ్ మరియు కె. బాబు గీసిన చిత్రాలు ఈ పుస్తకానికి మరింత నిండుదనం చేకూర్చాయి. వారికి నా కృతజ్ఞతలు.

విజయ్ విద్యాసంస్థల నిర్వహణలో.... రెండు దశాబ్దాల పాటు మరుగున పడిపోయిన నా రచనా వ్యాసంగం మీద మక్కువతో - నాతో పోరి - నన్ను ఒప్పించి, ఈ 'చుక్కల లోకం చుట్టొద్దాం!' నాటికల సంపుటికి శ్రీకారం చుట్టింది - ఇది అందంగా రూపుదిద్దుకునేదాకా అహర్నిశలూ కృషిచేసింది - మాటవరుసకైనా పరుల గురించి నెగెటివ్‌గా మాట్లాడని మిత్రులు, నిష్కల్మష హృదయులు ఎ. శంకర్ గారు. వారికి నా కృతజ్ఞతలు.

పుస్తక ప్రచురణలో అన్నిటికన్నా కష్టమైందీ... పంటికింద రాయిలా బాధించేదీ... ఆయా పుస్తకాల్లో అనుకోకుండా దర్శనమిచ్చే అచ్చుతప్పులు! ప్రూఫ్ రీడింగ్ ద్వారా నా పుస్తకాన్ని జల్లెడపట్టి - అచ్చుతప్పుల్ని ఏరిపారేసే కార్యక్రమాన్ని ఓపిగ్గా నిర్వహించింది నా ఫ్రెండ్స్ తుర్లపాటి లక్ష్మి, ఎ. శంకర్, కిరణ్‌బాల, నెల్లుట్ల రమాదేవి, కె.విజయలక్ష్మి సహాయం వెలకట్టలేనిది.

రాత్రింబవళ్ళూ కృషిచేసి - ఎంతో ఓపికగా డీ.టీ.పీ చేసి పెట్టి - దీనికో అందమైన ఆకృతినిచ్చిన కృష్ణ, మదన్ ల సహకారం మరువలేనిది!

నా నాటికలు ప్రచురించిన ఆంధ్రభూమి వీక్లీ ప్రచురణ కర్తలకు నా నమోవాకాలు!

ఈ నాటికలు ఆంధ్రభూమి వీక్లీలో సీరియల్‌గా వస్తున్నప్పుడు - స్పందించి- 'ముఖాముఖి' శీర్షికలో సమధికోత్సాహంతో పాల్గొని - తమ అమూల్య అభిప్రాయాల్ని వెలిబుచ్చిన పాఠకులకి నా ప్రత్యేక ధన్యవాదాలు.

ఇంకెందరో మహానుభావులు ! అందరికీ వందనాలు !!



01-09-2017



డా.అమృతలత

# సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఇన్‌స్పెక్షన్ | (ఆంధ్రభూమి - వీక్లీ - 17-1-1991) .........1-12 | |
| 2. | స్టడీ అవర్స్ | (ఆంధ్రభూమి - వీక్లీ - 10-1-1991) ......13-23 | |
| 3. | టీవీ న్యూసెన్స్ | (ఆంధ్రభూమి - వీక్లీ - 3-1-1991) .......24-31 | |
| 4. | ప్రెజెంటేషన్స్ | (ఆంధ్రభూమి - వీక్లీ - 27-12-1990)...32-43 | |
| 5. | హాలిడేస్ | (ఆంధ్రభూమి - వీక్లీ - 22-11-1990) ..44-62 | |
| 6. | ఇన్విజిలేషన్ | (ఆంధ్రభూమి - వీక్లీ - 15-11-1990) ....63-71 | |
| 7. | స్కూల్ డే | (ఆంధ్రభూమి - మంత్లీ 1989).............72-80 | |
| 8. | బస్టాండ్ | (ఆంధ్రభూమి - మంత్లీ 1989)..............81-90 | |
| 9. | బివేరాఫ్ మైక్స్ | ....................................1988..............91-98 | |
| 10. | పవర్‌కట్ | ..................................1988............99-109 | |
| 11. | ట్యూషన్స్ | ...................................1988...........110-120 | |
| ★ | పాఠకుల స్పందన | ...........................................................121-127 | |

# ఇన్‌స్పెక్షన్




(అదో క్లాసురూం, అప్పుడే ఫస్ట్ పీరియడ్ అయిపోయి, మాస్టారు వెళ్ళిపోవడంతో - పిల్లలు అల్లరి చేస్తూ వుంటారు.)

క్లాస్‌లీడర్ : సైలెన్స్ ! సైలెన్స్ !

(పిల్లలు ఇంకా అల్లరి చేస్తూనే వుంటారు)

లీడర్ : బెల్ అయి పది నిముషాలైంది ! సోషల్ టీచర్ ఇంకా రావట్లేదు! మీరేమో నా దుంపతెంచి గంపకెత్తుతున్నారు!

(రవి అనే అబ్బాయి మరో అబ్బాయితో ముష్టి యుద్ధం చేస్తూ వుంటాడు.)

లీడర్ : ఏయ్ ! రవీ ! నీ కెన్నిసార్లు చెప్పాలి.... మాట్లాడవద్దనీ ? నీ పేరు రాస్తున్నాను ! టీచర్ వచ్చాక చూపిస్తాను! నీ ఇష్టం !

రవి : నీ కెప్పుడూ నామీదే కన్ను! నీ ఫ్రెండ్స్ ఎంత మాట్లాడినా వాళ్ళనేమీ అనవ్! ఒక్కసారి కూడా వాళ్ళ పేర్లు బోర్డుమీద రాయవ్ ! మాష్టారుకి చూపించవ్ ! నేను నోరు విప్పితే చాలు.... కస్సుమంటావ్ ! నువ్వేం లీడర్వి ! బోడి లీడర్వి!

లీడర్ : ఏయ్ మాటలు జాగ్రత్తగా రానీ ! బోడి లీడరేమిటీ... బోడి లీడర్! అసలు ఎరక్కపోయి లీడర్నయ్యాను! నాకీ లీడర్షిప్ వద్దూ - నీలాంటి అడ్డమైన వాళ్లతో తిట్లూ వొద్దు! (బయటికి వెళ్ళబోతూ) ఏయ్ వినీతా ! నువ్వు సెకండ్ లీడర్వి కదా ! ఇలా వచ్చి నించో- నేనీలోగా స్టాఫ్రూం దాకా వెళ్ళి - మన సోషల్ స్టడీస్ టీచర్ని పిలుచుకొస్తాను!

వినీత : సరే ! (సర్దుకుని తనే ఓ టీచర్లా పోజుపెట్టి) ఇదిగో పిల్లలూ ! సోషల్ స్టడీస్ టీచర్ ఆఫీస్లో పనివుందంటూ - ఇప్పట్లో ఎలాగూ

క్లాస్‌కి రారు గానీ - అందాకా - నేను ఎంచక్కా మీకో సోషల్ లెసన్ చెప్తాను... వింటారా ?

పిల్లలు : ఓ....

వినీత : ఏయ్ సునీతా! నువ్వు డీయీవోగా వుండాలి!

సునీత : (ముఖం వెలిగిపోతూ) ఏమిటీ ? నేను... డీయీవోనా ? ఎంత అదృష్టం !

రవి : సునీత ఉత్త అల్లరిది ! ఆమె డీయీవోనా ? నో! మేమొప్పుకోం!

సునీత : ప్లీజ్ రవీ ! నీకు పుణ్యముంటుంది ! ఈ ఒక్కసారికి నన్ను డీయీవోగా వుండనీండి ! మన సోషల్ టీచర్ రోజూ లేట్‌గానే వస్తారుకదా ! కావాలంటే - రేపటి నుండి రోజూ ఈ ఇన్స్‌పెక్షన్ ఆట ఆడుకుందాం! అపుడు మీలో అందరికీ తలా ఓ రోజు డీయీవోగా ఛాన్స్ వస్తుంది!

పిల్లలు : ఒకే ! అగ్రీడ్ ! ఊ - కమాన్ ? ప్రొసీడ్ !

రవి : మరి హెడ్‌మాష్టర్లా ఎవరుంటారు ?

వినీత : థర్డ్ లీడర్ విక్రమ్ వున్నాడు కదా !

రవి : అవునూ.... విక్రమ్ ఏడీ ? ఎక్కడా ?

విక్రమ్ : (కాలర్ సర్దుకొంటూ) ఇదిగో ఇక్కడ !

(విక్రమ్ దర్జాగా లేచి బోర్డ్ ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చోవడానికి వెళ్తుంటే - పిల్లలు

చప్పట్లతో - కేరింతలు కొడ్తారు)

సునీత : చూడండి పిల్లలూ ! ఈ రోజు 'అక్షాంశాలూ రేఖాంశాలూ' గురించి చెప్పుకుందాం ! ఇదిగో బోర్డ్ మీద ఒక వృత్తం గీస్తున్నాను! ఇదేమిటై వుంటుందో చెప్పండి చూద్దాం?

పిల్లలు : గోళం... భూగోళం !

వినీత : కరెక్ట్ ! దీన్ని రెండుగా విభజిస్తూ ఒక రేఖ గీస్తున్నాను.

(వినీత బోర్డుమీద ఆ వృత్తాన్ని రెండు భాగాలుగా చేస్తూ నిలువుగా ఒక గీత గీస్తుంది!)

వినీత : మధ్యలో గీశానే - ఈ గీత - దీనిని భూమధ్య రేఖ అంటారు! దీన్నేమంటారు చెప్పండీ ?

పిల్లలు : భూమధ్యరేఖ !

వినీత : గుడ్ !

రవి : (బెంచీమీద నుండి లేచి) టీచర్, భూమధ్యరేఖ అలా వుండదండీ! ఇలా వుంటుంది ! (రవి బోర్డు దగ్గరికి వెళ్ళి - వృత్తంలో టీచర్ నిలువుగా గీసిన గీతని తుడిపేసి - అడ్డంగా మరో గీత గీస్తాడు)

వినీత : ఎవర్రా నీకు చెప్పింది ? నాకే పాఠాలు చెప్తావట్రా ! ఎమ్మేబిఎడ్‌ని- నీకు తెలుసా -

నాకు తెలుసా? గెటౌట్ !

సునీత ఉరఫ్ డీయివో: (లేచి వెళ్ళబోతూ విక్రమ్ ఉరఫ్ హెడ్ మాస్టర్‌తో) ఇలాంటి టీచర్స్‌ని అపాయింట్ చేసి - దేశం మీద వదిలిన వాళ్ళననాలి!

ఫస్ట్‌లీడర్ : (పరుగెత్తుకుంటూ వచ్చి, రొప్పుతూ) డీయీవో జీప్ వచ్చింది ! మన డీయీవో గారు సర్‌ప్రైజ్ విజిట్‌కి వచ్చారట!

(విద్యార్థులంతా ఎక్కడివాళ్ళక్కడ గప్‌చుప్‌గా బెంచీలమీద సర్దుక్కూర్చుంటారు)

రవి : (బయటికి తొంగిచూసి) మన సోషల్ స్టడీస్ టీచర్.... అదిగో... అల్లుతోన్న స్వెటర్ అవతల పారేసి - ఎంచక్కా మ్యాప్ తీసుకుని మన క్లాస్‌కి వచ్చేస్తున్నారోచ్!

సునీత : అవునా ? మ్యాప్‌తోనా ? అబ్బ ! ఎన్నాళ్ళయిందో మ్యాప్ చూసి! ఓహ్ ! ఈరోజు మన టీచర్సంతా కుర్చీలమీద కూర్చోకుండా- నించునే లెసన్స్ చెప్తారు ! మ్యాప్స్, టీచింగ్ ఎయిడ్స్.... ఒకటేమిటీ... ఎన్నెన్నో... అంతకు ముందు మనం ఎప్పుడూ చూడనివి చూపించి - మనకి పాఠాలు చెప్తారు ! ఈ రోజు లెసన్సన్నీ భలే ఇంటరెస్టింగ్‌గా వుంటాయి !

వినీత : అవును సునీ ! డీయీవోగారు రోజూ ఇలాగే ఇన్స్‌పెక్షన్‌కి వస్తే- ఎంత బావుణ్ణు !

(సోషల్ టీచర్ హడావిడిగా ప్రవేశిస్తారు)

పిల్లలు : (లేచి నిలబడి) గుడ్ మార్నింగ్ మేడం !

సోషల్ టీచర్ : (విసుగ్గా - కంగారుగా) ఊఁ గుడ్ మార్నింగ్! కూర్చోండి ! కూర్చోండి! డీయీవో వచ్చారు ! నేనిపుడు పాఠం చెప్తాను ! డీయీవోగారు క్లాస్‌కి వస్తే - వారేది అడిగినా జవాబులు చెప్పాలి... తెల్సిందా ?

పిల్లలు : ఓ... చెప్తామండీ !

(ఇంతలో డీయీవో క్లాస్ రూంకి వస్తారు. పిల్లలు లేచి)

పిల్లలు : గుడ్‌మాణింగ్ ! సార్ !

డీయివో : గుడ్‌మాణింగ్ ! కూర్చోండి ! (టీచర్‌ని చూస్తూ) ప్లీజ్ ప్రొసీడ్!

సోషల్ టీచర్ : నిన్న మనం నేర్చుకున్న పాఠం 'భారతదేశం - విమానమార్గాలు' (టాపిక్ బోర్డుమీద రాసి) ఆ - ఇపుడు నేను కొన్ని ప్రశ్నలడుగుతూ లెసన్ చెప్తాను ! మీరు జవాబులు చెప్పాలి ! మన దేశంలో ముఖ్యమైన నగరాలు ఏవేవి? ఫస్ట్ బెంచీ అమ్మాయి... సునీతా... నువ్వు!

సునీత : ఢిల్లీ !

సోషల్ టీచర్ : గుడ్ ! కమాన్, సెకండ్ బెంచీ అబ్బాయి - విక్రమ్... నువ్వు!

విక్రమ్ : కలకత్తా !

సోషల్ టీచర్: గుడ్ ! ఇపుడు - థర్డ్ బెంచీ అబ్బాయి - రవీ!

రవి : బాంబే !

సోషల్ టీచర్: వెరీ గుడ్ ! నౌ ఫోర్త్ బెంచ్ గర్ల్ - వినీత !

వినీత : మద్రాస్ !

సోషల్ టీచర్: గుడ్ ! మన దేశంలో విమాన మార్గాలు ముఖ్యంగా ఈ నాలుగు నగరాలనూ కలుపుతాయి ! ఈ పటంలో మీరు ఢిల్లీని చూపించండి! సునీతా... నువ్వు!

(సునీత - వచ్చి చూస్తుంది ! కన్పించదు ! కళ్ళు మిటకరిస్తూ వుంటుంది)

సోషల్ టీచర్: వినీతా... నువ్వు !
(వినీతక్కూడా కన్పించదు)

సోషల్ టీచర్: విక్రమ్.... నువ్వు ?
(విక్రమ్‌కి కూడా కన్పించదు ! నీళ్ల నములుతూ వుంటాడు)

సోషల్ టీచర్: అరే - చవటల్లారా! మీరు మ్యాప్ పాయింటింగ్‌లో ఇంత పూర్ అనుకోలేదు ! ఎవర్రా మీకు సోషల్ చెప్పింది ? భారతీయులైవుండీ- భారత రాజధాని ఎక్కడుందో చెప్పలేక పోతున్నారంటే ఎంత అవమానం ? ఇదిగో - ఢిల్లీ ఇక్కడ వుంటుంది!

(అంటూ పటం దగ్గరికి వెళ్ళి పటంలో ఢిల్లీకోసం వెదుకుతాడు? అతడికి ఎక్కడా ఢిల్లీ కన్పించదు! తత్తరపడి - గుటకలు మింగి - తమాయించుకుని.... ఏదో... ఒకటి చూపించి:)

సోషల్ టీచర్: ఇదిగో - ఇక్కడ వుంటుంది ఢిల్లీ ! ఇప్పుడు చెప్పండి ఢిల్లీ ఎక్కడుందో?

రవి : ఇక్కడ వుంది సార్ !

సోషల్ టీచర్: ఇక్కడంటే ఎక్కడా ? నీ బెంచీ దగ్గరా ? వచ్చి ఈ పటంలో చూపించు!

రవి : ఇక్కడ అంటే ఆ పటంలో కాదుసార్ ! (తన దగ్గర వున్న వేరే పటం చూపిస్తూ) ఢిల్లీ ఈ పటంలో వుంది ! మీరు చూపిస్తోంది ఆఫ్రికా పటం ! అందులో ఢిల్లీ ఎలా వుంటుంది ? ఇదిగో - ఈ ఇండియా పటంలో ఇక్కడ వుంటుంది ఢిల్లీ!
(అంటూ ఆ పటం తీసికెళ్ళి బోర్డు పక్కన తగిలిస్తాడు)

హెడ్‌మాష్టర్ : (వ్యంగ్యంగా) అమ్మయ్య ! ఇందాకట్నుంచీ పిల్లలు ఢిల్లీ ఆఫ్రికాలోనే వుందని ఎక్కడ నేర్చుకుంటారో అని తెగ బాధపడిపోయాను సార్!

డీయివో : ష్ ! పిల్లల ముందు - మనం ఈ విషయాలు మాట్లాడుకుంటే బావుండదు! తర్వాత

మీటింగ్ లో ఈ విషయం ఆమెతో చెప్దాం లెండి!

హెడ్‌మాస్టర్ : (తగ్గు స్వరంతో మాట్లాడుతూ) పాపం ! వారు సైన్స్ టీచరండీ ! సోషల్ తెలీదు ! మాకు సైన్స్ టీచర్స్ అనవసరంగా ముగ్గురున్నారు! రెండు నెలల నుండీ - మాకు సోషల్ స్టడీస్ టీచర్ కావాలని అడుగుతోంది ఇందుకే !
(గంట కొడ్తారు ! రెండో పీరియడ్ అయిపో తుంది - డీయీవో, ఆయన్తో పాటు హెడ్ మాస్టర్, సోషల్ టీచర్ వెళ్ళిపోతారు. ఆ తర్వాత కాస్సేపటికి డీయీవో వెళ్ళిపోయినట్టు జీప్ శబ్దం విన్పిస్తుంది!)

ఫస్ట్‌లీడర్ : డీయీవో వెళ్ళిపోయినట్టున్నారు ! ఇప్పుడు తెలుగు పీరియడ్ కదా! ఇక మళ్ళీ మన తెలుగు టీచర్ లేటుగా వస్తారు!

రవి : అయితే తెలుగు టీచర్ వచ్చేదాకా - మళ్ళీ మనందరం ఎంచక్కా మరోసారి ఇన్స్‌పెక్షన్ ఆటాడుకుందాం ! అప్పుడు నాకు డీయీవో ఛాన్స్ మీరివ్వలేదు కాబట్టి - ఇప్పుడు డీయీవో నేను! పోతే... ఇపుడు డీయీవోగా నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతాను! మీరు జవాబులు చెప్పాలి! ఫస్ట్ బెంచీ అమ్మాయీ.... నేను తెలుగులో డిక్టేషన్ చెప్తాను! ఏదీ - 'సంస్కృతం' అనే పదం

బోర్డుమీద రాయమ్మా!

(ఆమె వెళ్ళి బోర్డుమీద రాస్తుంది!)

రవి : గుడ్ ! సెకండ్ బెంచీ అమ్మాయీ - ఏదీ నువ్వెళ్లి 'దుర్యోధనుడు' రాయి తల్లీ !
(ఆమె వెళ్ళి 'ధుర్యోధనుడు' అని రాస్తుంది)

రవి : ఏం తల్లీ ! దుర్యోధనుడు ఎంత దుర్మార్గుడైతే మాత్రం మరీ రెండు వొత్తులా? ఒకటి చాలు! అయ్యో ! ఇప్పట్లో ఈ దేశం బాగుపడదు... ఈ విద్యార్థులు అంతకన్నా బాగుపడరు!
(ఇంతలో వినోద్ అనే మరో అబ్బాయి లేచి)

వినోద్ : ఎప్పుడూ సోషల్, తెలుగు పాఠాలేనా ? నేనిప్పుడు ఇంగ్లీష్ గ్రామర్... 'నెగెటివ్ సెంటెన్స్' చెప్తాను వినండీ!

(బోర్డు మీద 'షి ఈజ్ దేర్' అని వ్రాసి:)

వినోద్ : షి అంటే ఆమె ! ఈజ్ అంటే వున్నది ! దేర్ అంటే అక్కడ ! షీ ఈజ్ దేర్ ! షి ఈజ్ దేర్ అంటే - ఆమె అక్కడ వున్నది ! దీనికి నెగిటివ్ సెంటెన్స్ షి ఈజ్ నాట్ దేర్ ! ఇపుడు చెప్పండి షి ఈజ్ దేర్ కి నెగిటివ్ సెంటెన్స్ ఏమిటో ?

పిల్లలు : షి ఈజ్ నాట్ దేర్ !

రాము : సర్ ! నాదో డౌట్ !

వినోద్ : ప్రొసీడ్ !

రాము : షి అంటే 'ఆమె' కదా !

వినోద్ : అవునూ....

రాము : ఈజ్ అంటే 'వున్నది' కదా !

వినోద్ : అవునూ....

రాము : నాట్ అంటే 'లేదు' కదా !

వినోద్ : అవునూ....

రాము : దేర్ అంటే 'అక్కడ' కదా !

వినోద్ : (విసుగ్గా) అవునూ... అయితే ఏమిటంట?

రాము : మరి... షి ఈజ్ నాట్ దేర్ అంటే - మీరు ఇందాక చెప్పారు కదా...ఈజ్ అంటే వున్నదీ - నాట్ అంటే లేదూ అనీ - మరి 'షి ఈజ్ నాట్ దేర్' అంటే - ఇంతకీ అమె అక్కడ వున్నట్టా - లేనట్టా !?

(వినోద్ - తల గిర్రున తిరిగి - బుర్ర గోక్కుంటాడు - ఎలా చెప్పాలో అర్థంగాక - తికమకపడ్తూంటే - అప్పుడే అ గదిలో కాలెట్టిన ఇంగ్లీష్ టీచర్.... రామూ డౌట్ విని:)

ఇంగ్లీష్ టీచర్: చూడు వినోద్ ! ఇంగ్లీష్‌ని ఇంగ్లీష్‌లో కాకుండా తెలుగులో టీచ్ చేస్తే - ఇలాంటి డౌట్స్ రావడం సహజం ! చూడమ్మా ! నీ పేరేమిటీ?

వినీత : వినీత !

ఇంగ్లీష్ టీచర్: షి ఈజ్ వినీత ! నౌ టెల్మీ చిల్డ్రన్ ! ఈజ్ షి సునీతా ?

పిల్లలు : నో - షి ఈజ్ నాట్ సునీత !

ఇంగ్లీష్ టీచర్: షి ఈజ్ వినీత. షీ ఈజ్ నాట్ సునీత !

(ఆ రెండు వాక్యాలూ ఆయన బోర్డుమీద రాసి 'ఈజ్' కిందా 'ఈజ్ నాట్' కిందా అండర్‌లైన్ చేసి)

ఇంగ్లీష్ టీచర్: చూడండి పిల్లలూ.. మొదటి వాక్యంలో 'ఈజ్' - రెండో వాక్యంలో 'ఈజ్ నాట్' కన్పిస్తున్నాయి కదా ! ఈజ్‌కి నెగిటివ్ 'నాట్' కాదు! 'ఈజ్'కీ నెగిటివ్... 'ఈజ్ నాట్' అర్థమైందా!?

పిల్లలు : అర్థమైంది సార్ ! థ్యాంక్యూ వెరీమచ్!

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*

***తేదీ: 17-1-1991***

# స్టడీ అవర్స్




(అదో హాస్టల్ రూం! తెర తీయగానే పిల్లలంతా ఆడుకుంటూ కన్పిస్తారు! ఉన్నట్టుండి ప్యూన్ గంటకొట్టిన శబ్దం విన్పిస్తుంది ! ఆడుకుంటోన్న పిల్లలు బెల్ వినగానే - పొలోమంటూ ఎక్కడివా ళ్ళక్కడ పుస్తకాలు పట్టుకుని - చదవడానికి కూర్చుం టారు. కొంతమంది స్టడీఅవర్స్‌లో కూర్చుంటారే గానీ - వాళ్ళ దగ్గర పుస్తకాలు వుండవ్! కొంతమంది వద్ద పలకలు వుంటాయి గానీ - బలపాలు వుండవ్ !

కొంతమంది దిక్కులు చూస్తూ, మరి కొంతమంది తలలు గోక్కుంటూ వుంటారు. ఇంతలో వార్డెన్ వచ్చి:)

వార్డెన్ : ఎందుకలా కూర్చున్నావ్ ?పలక మీద 'అఆ'లు రాయి !

రాము : (భయపడ్తూ... తత్తరపడ్తూ...) బ...బ... బలపం లేదండీ !

వార్డెన్ : నిన్నెప్పుడు అడిగినా బలపం లేదంటావేం ? ఏం చేస్తున్నావ్ బలపాల్ని ?

గోపి : వాడు... ఎవరూ చూడకుండా తినేస్తున్నాడు మేడమ్ ! మీతో చెప్తానంటే... కొడ్తానని బెదిరిస్తున్నాడు.

వార్డెన్ : (కళ్ళెర్రజేసి) అవునా రామూ ?

రాము : కా... కా... కాదు మేడమ్ ?

వార్డెన్ : (గద్దించి) నిజం చెప్పు !

రాము : ఆ... అవును మేడమ్ !

వార్డెన్ : రంగన్నా !

రంగన్న : (ప్రవేశిస్తూ) మేడమ్ !

వార్డెన్ : రేపటినుండి ఈ అబ్బాయికి టిఫిన్లో పూరీ ఇవ్వకు! బలపాల్ని ఇవ్వు ! తిక్క కుదుర్తుంది!

రాము : (లెంపలు వేసుకుంటూ) తప్పయింది మేడమ్! ఇంకోసారిలా చేయను. క్షమించండి.

వార్డెన్ : సర్లే... వెళ్లు! ఇదిగో బలపం! మళ్ళీ

పోగొట్టుకున్నావంటే వూర్కోను! ఆ బలపానికో దారం కట్టి నీ మెడకి కట్టేస్తాను! అర్థమైందా ?

(రాము బుద్ధిగా తలూపుతాడు)

రంగన్న : అమ్మా - ఎవరో పేరెంట్సుట! మీతో మాట్లాడ్తా మంటున్నారు!

(పేరెంట్స్‌తో మాట్లాడటానికి వార్డెన్ అక్కడి నుండి వెళ్ళిపోగానే అందాకా బుద్ధిమంతుల్లా ఉన్న పిల్లలంతా - పుస్తకాల్ని గిరాటేస్తారు! జాన్, ఇస్మాయిల్ ఒకరికెదురుగా మరొకరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుంటారు! సీతా - దీప్తి గచ్చకాయలు ఆడుతూ వుంటారు. విక్రమ్ ట్విస్ట్ చేస్తూవుంటాడు.)

లీడర్ : (విక్రమ్‌ని చూసి) ఏయ్ కూర్చో.... ఏమిటా అల్లరి? ఇవి స్టడీఅవర్స్!

విక్రమ్ : పోబే పో! నువ్వు ఎంత లీడర్వి అయితే మాత్రం.... నువ్వు పుస్తకాల్లో కామిక్స్ పెట్టి చదువుకోవచ్చుగానీ... నేను ట్విస్ట్ చేయకూడదా? నా డాన్స్...నా ఇష్టం ! మధ్య నీ పెత్తనమేమిటీ?.. కావాలంటే.... ఇదిగో నావద్ద -'చందమామ' ఉంది ! ఇదీ ఇస్తాను! నోర్మూసుకో!

విజయ్ : ఒరేయ్.... మీరు అల్లరి చెయ్యకండిరా - మీకు పుణ్యం వుంటుంది ! నేను అసలే లెక్కలు చేస్తున్నాను! ఒక్కటీ అర్థమై చావట్లేదు! - ఒక్క క్షణం మేడం కన్పించకపోతే చాలు - వీళ్ళ

కోతి వేషాలకి పట్టపగ్గాలుండవ్!

దీప్తి : సీతా... ఏమిటే అది ?

సీత : నెయిల్ పాలిష్ ? నిన్న మా అన్నయ్య తెచ్చి చ్చాడు!

దీప్తి : అబ్బ.... ఎంత బావుందో ! నా గోళ్లకి వేసు కోనా?

సీత : ఇంద తీసుకో !

అరుణ : నాక్కూడా ఇవ్వవే !

సీత : నువ్వూ తీసుకో !

(వాళ్ళు గోళ్ళకి రంగువేసుకుంటూ వుంటారు ఇంతలో-)

జాన్ : ఏయ్.... వార్డెన్ వస్తున్నారు !

(సీత, దీప్తి, అరుణలు మేడమ్‌ని చూడగానే - గబుక్కున తమ వీపు వెనక్కి చేతులు మడిచిపెట్టి - నెయిల్ పాలిష్ దాచేసి- ఆ చేతులు తీయకుండానే చదువుతున్నట్టు పోజులు పెడ్తారు. పుస్తకాల్లోని పేరాలు చదువుతున్నట్లు పెదాలు కదిలిస్తూ..... ఎక్కడి పిల్లలక్కడ... గప్‌చిప్‌న... ఏమీ ఎరుగని వాళ్ళలా.... చదువుతూ వుంటారు)

వార్డెన్ : జాన్!... ఇలారా ! ఆ పలక మీద 'అఆ'...లు రాయి!

(జాన్ జారుతోన్న లాగు పైకి లాక్కుంటూ

వచ్చి అఆలు రాస్తూ వుంటాడు)

వార్డెన్ : ఇస్మాయిల్ ! నీ పుస్తకం ఇలా తే !

(ఇస్మాయిల్ అందిస్తాడు.)

వార్డెన్ : (పుస్తకంలోకి చూస్తూ) 'పాంచాలి'... విగ్రహ వాక్యం చెప్పు!

ఇస్మాయిల్ : పాంచాలి... పాంచాలి... (నీళ్ళు నములుతూ) పాంచాలా మేడమ్?

వార్డెన్ : ఊఁ

ఇస్మాయిల్ : పాంచాలి.... పాంచాలి అంటే.... పంచుల యొక్క ఆలి... పాంచాలి !?

వార్డెన్ : (వ్యంగ్యంగా) గుడ్... ఎలా చెప్పావ్ అంత కరెక్ట్‌గా?

ఇస్మాయిల్ : (పొంగిపోతూ) మరేనండీ... పంచ పాండవుల భార్య పేరు పాంచాలి కదండీ ! అందుకని పంచుల యొక్క ఆలి.... పాంచాలి!

వార్డెన్ : నీ మొహం ! పంచుల యొక్క ఆలి కాదు... పాంచాల దేశ రాజ కుమార్తె కాబట్టి ఆమెకి పాంచాలి అని పేరు వచ్చింది. అర్థమైందా ?

ఇస్మాయిల్ : (ముఖం చిన్నబుచ్చుకుని - గుటకలు మింగి) ఆ... ఆ... అర్థమైందండీ !

రంగన్న : (ప్రవేశిస్తూ) అమ్మా - మీకు ఫోన్!

వార్డెన్ : వస్తున్నా!

(వార్డెన్ రంగన్నతోపాటు ఆ హాల్లోంచి వెళ్ళి

పోగానే - దీప్తి అరుణలు బెంచీకి అటు ఒకరూ - ఇటు ఒకరూ నేల మీద కూర్చుని కునికిపాట్లు పడుతూ చదువుతూ వుంటారు! సీత వెళ్లి, వాళ్ళ జడల్ని ఒకర్దొకర్తో ముడేసి - ఆనందిస్తూ వుంటుంది! ఆ ముడి వాళ్ళు నిద్ర పోయినప్పుడల్లా - ముందుకు తూలి పడ్తోన్న వాళ్ల తలల్ని తిరిగి వెనక్కి వచ్చేలా చేస్తూ వుంటుంది ! చివరకు వాళ్ళకు మెలకువ వచ్చి - విషయం గ్రహించి - తమ ముళ్ళు విప్పుకో కుండానే సీతని ఒంగోబెట్టి దబాదబా బాదు తారు)

సీత : (లెంపలేసుకుంటూ) కొట్టకండే ! తప్పయిందే! ఇంకెప్పుడూ అలా చెయ్యను! ఒట్టు!

దీప్తి : (బెంచీ మీద దర్జాగా కూర్చుని) మరి మా జడలు విప్పు!?

సీత : (భయం భయంగా... వాళ్ళ జడలు విప్పి) మేడమ్‌కి చెప్పకండే- నా వీపు చీరేస్తారు!

అరుణ : చెప్పనుగానీ - మాకో పని చేసి పెట్టాలి !

సీత : ఏమిటదీ ?

అరుణ : నాకు నిద్రొస్తోంది ! నేను నిద్రపోతా ! టీచర్ వస్తే నాకు చెప్పాలి! ఒక రకంగా... నువ్వు నా నిద్రకి కాపలా అన్నమాట- అర్థమైందా....?

సీత : సరే!

దీప్తి : నేనూ పడుకుంటా ! కాని మంచంకింద పడుకుంటా ! అయితే ఒక్కటి ! నేనిక్కడ పడుకున్నానని మేడంకి చెప్పొద్దు! నా విషయం అడిగితే - బాత్‌రూంకి వెళ్లానని చెప్పాలి!

(దీప్తి మంచం కింద దూరి పడుకుంటుంది - తను కన్పించకుండా మంచం మీది దుప్పటి లాక్కుంటుంది! గోపీ చక్కిలాలు తింటూ వుంటాడు.)

విక్రమ్ : ఒరేయ్ ! నాకో చక్కిలం ఇవ్వరా !

గోపి : నేనివ్వను ! నా దగ్గర రెండే ఉన్నాయి !

విక్రమ్ : అదేం కుదర్దు ! ఇవ్వాల్సిందే ! మొన్న నేను ఇవ్వలేదా ? ఇప్పుడు నువ్వివ్వాలి !

గోపి : నేనివ్వను !

విక్రమ్ : ఇవ్వవా.... చూడు నిన్నేం చేస్తానో ?

(విక్రమ్ గోపీని రెండంటించి - వాడి చేతిలోని చక్కిలం కాస్తా లాగేసుకుంటాడు ! గోపీ కుయ్యో మొర్రో అంటాడు)

ప్రవీణ్ : విక్రమ్ ! నువ్వు గోపీని కొట్టావ్ కదూ ! మేడం రానీ - చెప్తాను!

విక్రమ్ : పోరా... నేను మేడమ్‌కి పట్టుబడ్తేగా ! వాణ్ణి నిముషంలో నవ్విస్తాను చూడూ ! ఒరేయ్ గోపీ! నేను ఒకటీ - రెండూ - మూడూ అని

లెక్కెట్టేలోగా... నువ్వు నవ్వాలి! నవ్వకపోతే - మరి రెండు అంటిస్తాను! అండర్‌స్టాండ్!

(గోపీ నవ్వడు)

విక్రమ్ : ఒకటీ....

(గోపీ ఇంకా బిగదీసుకునే వుంటాడు)

విక్రమ్ : రెండూ....

(గోపీలో ఏదో కొంచెం కదలిక...)

విక్రమ్ : మూడూ...

(గోపీ - వస్తోన్న ఏడ్పునాపుకుని... అటు నవ్వలేకా... ఇటు ఏడ్వలేకా... చివరకి విక్రమ్ భయానికి 'హీ... హీ... హీ'.... అని నవ్వేస్తాడు)

జాన్ : (చిటికెన వేలు చూపించి): లీడర్ !

లీడర్ : నీకెప్పుడూ అదే పని ! నేను పంపను ! కూర్చో!

జాన్ : అబ్బ... లీడర్... ప్లీజ్ !

(పొట్ట పట్టుకుని అసహనంగా అటూ ఇటూ తిరుగుతూ వుంటాడు)

లీడర్ : (విసుగ్గా) కూర్చోమని చెప్పానా ? సిడౌన్ !

(జాన్ ఆగలేక - అక్కడే ఓ మూలన 'వన్ ఫింగర్' చేసేస్తాడు)

అందరూ : షేమ్ ! షేమ్ !

(ఇంతలో ప్రవీణ్ ఏడుస్తూ వుంటాడు!)

| | | |
|---|---|---|
| లీడర్ | : | ప్రవీణ్ ! నీకేమైందిరా ఏడుస్తున్నావ్ ? |
| రాము | : | వాడి ముక్కులో బలపం పెట్టుకున్నాడు. అదేమో రావట్లేదు! |
| గోపి | : | రంగన్నని పిలవనా - తీస్తాడేమో ? |
| ప్రవీణ్ | : | వొద్దు వొద్దు ! వార్డెన్‌కి తెలిస్తే నన్ను చంపేస్తారు! |
| విక్రమ్ | : | (గ్రీకు వీరుడి లెవెల్లో) భయం వలదు బిడ్డా ! ముక్కులో బలపం ! ఓష్ ! ఇదెంత పని ? నేను తీస్తాలేరా ? |
| లీడర్ | : | వొద్దురా ! నీకు చేతకాదు.. ప్రమాదం ! |
| విక్రమ్ | : | అరే - పిరికి వెధవా ! నా పేరేమిటో తెలుసా? విక్రమ్- అంటే - పరాక్రమవంతుణ్ణి ! అలాంటి నాకు... ముక్కులో బలపం... అదో లెక్కా ? అవమానం ! అవమానం ! |
| | | (విక్రమ్ ఆ బలపం తీయబోతూ వుంటే - అది ఇంకా - ఇంకా లోపలికి పోతూ వుంటుంది) |
| విక్రమ్ | : | (కంగారుగా) అయ్యో... అది ఇంకా... ఇంకా... లోపలికి పోయిందిరా ! ఇప్పుడెలా ? |
| లీడర్ | : | చావు ! నేను ముందే చెప్పానా ? ఇప్పుడు ప్రవీణ్‌గాడు వుంటాడో - హరీమంటాడో ? |
| అందరూ | : | అయ్యో.... |
| | | (అందరూ ఒక్కసారిగా రాగాలు తీస్తారు. వార్డెన్ పరుగెత్తుకుని వస్తుంది ! అరుణకి మెలకువ |

వచ్చి దిగ్గున లేచి కూర్చుంటుంది! మంచం క్రింద పడుకున్న దీప్తికయితే మెలకువే రాదు!)

వార్డెన్ : (గద్దించి) ఏమైంది ? ఏమిటా రాగాలు ? (అందరూ ఒక్కసారే రాగాలు ఆపుతారు)

వార్డెన్ : బెల్లంకొట్టిన రాయిలా నిలబడ్డారేం ? చెప్పండి ఏమైందో?

లీడర్ : (ధైర్యం తెచ్చుకొని) ప్రవీణ్... ముక్కులో బలపం పెట్టుకున్నాడండీ! విక్రమ్ - మరేమోనండి... దాన్ని తీస్తానని ట్రై చేశాడండీ! కాని - అదేమోనండీ... ఇంకాస్త లోపలికి పోయిందండీ!

వార్డెన్ : (విక్రమ్‌ని రెండంటించి) నువ్వేమైనా డాక్టర్వా? ఇంకోసారి- నీకు తెలీని విషయాల జోలికి వెళ్తావా?

విక్రమ్ : వెళ్లను మేడమ్ !

వార్డెన్ : రంగన్నా !

రంగన్న : అమ్మా !

వార్డెన్ : అర్జంట్‌గా ఈ అబ్బాయిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లు! నేను నీ వెనకాలే వస్తాను ! పద - ఊఁ క్విక్ !

రంగన్న : అలాగే అమ్మా ! (రంగన్న ప్రవీణ్‌ని తీసుకెళ్తాడు - వార్డెన్ వెళ్ళి పోతోందల్లా- మంచం కింద నుంచి కన్పిస్తోన్న దీప్తి కాళ్ళని గమనించి - ఆగి పోతుంది)

(సీత ఓ వైపు వార్డెన్‌ని చూస్తూ - మరోవైపు దీప్తిని లేపడానికి ట్రై చేస్తూ - కాలి వేళ్ళతో ఆమె కాళ్లని గీర్తూ వుంటుంది!)

దీప్తి : పోవే - నాకు నిద్రోస్తోంది !

(వార్డెన్ సీతని చూస్తూ 'నువ్వు మాట్లాడకు' అన్నట్టు సైగచేసి- మెల్లిగా మంచం దగ్గరకు వెళ్లి దీప్తి కాళ్ళు పట్టి బయటకు లాగుతుంది. అప్పటికీ దీప్తికి మెలకువ రాదు! పైగా ఆ నిద్ర మత్తులో తనను కాదన్నట్టుగా ఇంకో వైపు తిరిగి)

దీప్తి : అబ్బ ! అప్పుడేనా ? కాస్సేపు పడుకోనివే ! మేడమ్ ఇప్పుడప్పుడే రారు! ఇప్పట్లో ఆ ఫోన్ వదుల్తారా - ఏమన్నానా?

వార్డెన్ : (దీప్తిని కుదిపి) దీప్తీ... దీప్తీ...
(వార్డెన్ పిలుపుకి దీప్తి కళ్ళుతెరిచి - 'ఆ' అని నోరు తెరచుకుని - బిక్కచచ్చి పోతూ వుండగా.... తెర)

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*

***(10-1-1991)***

# టీవీ న్యూసెన్స్



(ఆదివారం ! అది టీవీ హాల్ ! ఇంటి యజమాని గోపాల్... దినపత్రిక చదువుతూ వుంటాడు. పెద్ద కొడుకు వికాస్ పరీక్ష  కోసం పుస్తకాల్తో కుస్తీ పడ్తూ వుంటాడు. చిన్న కొడుకు రవి హోం వర్క్ చేస్తూ వుంటాడు ! ఇంటి యజమానురాలు కమల ఎక్కడో వంటింట్లో వంట చేస్తూ వుంటుంది.)

గోపాల్ : కమలా ! ఎక్కడున్నావ్ ? ఇలారా ! నీ కిష్టమైన బాలచందర్ సినిమా రిలీజైంది ! ఈ రోజు ఆదివారం కదా ! ఫస్ట్‌షోకి వెళ్దామా ?

కమల : అయ్యో ! ఈ రోజు పిక్చర్ కోసం బయటకు ఎందుకండీ ! ఈరోజు టీవీలో అసలే సావిత్రి పిక్చర్ వుంది ! బాలచందర్ పిక్చర్ ఈ రోజే కదా రిలీజైంది. కావాలంటే రేపు వెళ్ళొచ్చు ! నేను మాత్రం ఈ రోజు బయటికి ఎక్కడికీ రాను బాబూ !

గోపాల్ : ఎంచక్కా పెళ్ళాం పిల్లల్తో వేడి వేడి పకోడీలు తింటూ - సరదాగా ఇంట్లో సినిమాలు చూడొచ్చని టీవీ కొన్నాం ! కాని ప్చ్.... ఏం లాభం? అటు టీవీ ఆన్ చేస్తామో లేదో - బిలబిలమంటూ - మన ఇరుగింటమ్మలూ - పొరిగింటమ్మలూ - ఠంచన్‌గా (టకటక శబ్దం) అదిగో - నూరేళ్ళాయుష్షు....! మీ ఫ్రెండ్సంతా రానే వచ్చారు ! చూస్తావేం- వెళ్ళి తలుపులు తీయ్ !

(కమల వెళ్ళి తలుపులు తీసి - నవ్వు తెచ్చి పెట్టుకుంటూ)

కమల : రండి ! రండి !

సూర్యకాంతమ్మ : (ప్రవేశిస్తూ) నమస్కారం అన్నయ్య గారూ !

గోపాల్ : (నీరసంగా) నమస్కారం.... రండి కూర్చోండి!

(సూర్యకాంతమ్మ వెనకాల మాణిక్యాలూ, ఆవిడ వెనకాల ఆండాళమ్మా ఆ వెనుక - పిల్లా పితుకూ మరో ఐదుగురు వస్తారు ! టీవీ హాల్లోవున్న కుర్చీలు సరిపోక - చేసేదిలేక గోపాల్, అతడి పెద్ద కొడుకు - టీవీ హాల్

పక్కనేవున్న బెడ్‌రూంలోకి వెళ్ళిపోతారు.)
(నోట్: బెడ్‌రూంకూడా ప్రేక్షకులకి కన్పించేట్టు- మధ్యలో పార్టీషన్‌చేసి - ఒకవైపు టీవీహాల్, మరోవైపు బెడ్‌రూం కన్పించేట్టు చేయాలి)

మనవడు : బామ్మా, దాహంగా వుందే! కాస్త నీళ్ళివ్వమని చెప్పవే?

సూర్యకాంతమ్మ : నాయనా గోపీ ! వీడికి నీళ్ళట ! నీకు పుణ్యముంటుంది ! కాస్త నీళ్ళు తెచ్చిస్తావా బాబూ?

(గోపీ వంటింట్లోకి వెళ్ళి నీళ్ళగ్లాసుతో తిరిగి వచ్చి- సూర్యకాంతమ్మ మనవడికి ఇస్తాడు. ఇంతలో పొరుగింటి జగదాంబ వస్తుంది. ఏ కుర్చీ ఖాళీగా లేకపోవడంతో ఇంటి యజమానురాలు కమల లేచి తన సీట్ ఆఫర్‌చేసి - ఆ పిక్చర్‌మీద అభిమానం చాలక గోపీతో పాటు నించునే పిక్చర్ చూస్తూ ఉంటుంది)

ఆండాళమ్మ : ఇదేమిటీ - నా కాళ్ళకు చల్లగా తగుల్తోంది ! అయ్యో ఏమండీ మాణిక్యాంబగారూ మీ కొడుకు మూత్రం పోసినట్టున్నాడు.

మాణిక్యాంబ : (కోపంతో) ఏమండీ - ఒక గుడ్డ ఉంటే ఇస్తారూ? ఈ వెధవ నేల తడిపేశాడు !

కమల : ఒరేయ్ రవీ - ఏదైనా ఒక గుడ్డ పట్రా !

(రవి లోపలినుండి గుడ్డ ఒకటి తీసుకొస్తాడు... మాణిక్యాంబ దాన్ని తీసుకుని నేల తుడుస్తూ

వుంటుంది. ఇంతలో బెడ్ రూంలో కూర్చున్న గోపాల్ లోపల్నుండి 'రవీ' అని పిలుస్తాడు. రవి బెడ్‌రూం లోకి వెళ్తాడు.)

గోపాల్ : ఏదీ నీ ప్రోగ్రెస్ కార్డు ? (రవి వెళ్ళి తీసుకొస్తాడు- గోపాల్ దాన్ని చూస్తూ:) లెక్కలూ - సైన్స్ సున్నా! సోషల్ - ఇరవై మార్కులు ! రోజూ నీకూ మీ అమ్మకీ టీవి చూట్టంతోనే సరిపోతుంది! ఇక చదవడానికి టైమెక్కడ ?

(ఇంతలో టీవీ హాల్లో ఆండాళమ్మ పిల్లాడు - నిక్కర్ కిందకు లాక్కుంటూ - వాళ్ళమ్మ చెవిలో ఏదో మెల్లిగా చెప్తాడు. ఆమె కమలని చూస్తూ)

ఆండాళమ్మ : వీడికి పొద్దట్నుంచీ లూజ్ మోషన్స్ ! కాస్త టాయిలెట్ చూపిస్తారా ?

కమల : రా బాబూ ! ఏరా రవీ ! ఇదిగో ఈ బాబుకి టాయిలెట్ చూపించరా !

(టీవీ చూట్టానికి వచ్చిన పిల్లకాయలంతా - తమతో తెచ్చుకున్న వేరు శనక్కాయల్ని తింటూ - దాని పొట్టు రూం నిండా చెల్లా చెదురుగా పడేస్తారు. టీవీలో నవ్వు వచ్చే అంశం వచ్చినప్పుడల్లా 'పే... ద్ద'...గా నవ్వ డంతో - లోపల బెడ్ రూంలో పరీక్షకి చదువు కుంటోన్న పెద్ద కొడుక్కి డిస్టర్బ్ అయి తలపట్టుకుంటాడు.)

గోపాల్ పెద్ద కొడుకు : ఏం టీవీయో ఏమిటో ! ఇది ఇల్లుకాదు ! సినిమా హాల్ అయిపోయింది!

రవి : అవున్రా అన్నయ్యా ! డాడీకి తెలీకుండా టిక్కెట్లు పెడ్దామా ? టీవీలో సినిమా వున్న రోజు ఎంచక్కా ఎంత లేదన్నా పాతిక రూపాయలు వసూలు అవుతాయి !

గోపాల్ పెద్ద కొడుకు : నోర్మూయ్ ! వెధవ జోకులూ నువ్వూ !

(ఇంతలో ఇంటి యజమానురాలి అన్నయ్య రంగనాథ్ వస్తాడు. వాళ్ళు టీవీ చూస్తూ ఇంట్లోకి ఎవరొచ్చిందీ పట్టించుకోరు! తలుపు కొట్టిన శబ్దం విని కమల విసుక్కుంటూ - టీవీ చూస్తూనే వెళ్ళి తలుపు తీసి- టీవీ చూస్తూనే మళ్ళీ యధాస్థానానికి వస్తుంది ఇంట్లోకి ఎవరు వచ్చిందీ గమనించదు! ఇంతలో టీవీ చూట్టానికి వచ్చిన వాళ్లలో ఒక చిన్న పిల్లాడు ఏడుస్తూ ఉంటాడు!

పిల్లవాడి అమ్మ : (కమలతో) ఏమండీ - ఏమైనా బిస్కెట్లు ఉంటే ఓ రెండు ఇస్తారా ? వీడు గుక్కపెట్టి ఒకటే ఏడుస్తున్నాడు! ఇంటికి వెళ్ళి తీసుకొద్దామంటే ఇప్పుడు.... సస్పెన్సంతా ఈ సీన్లోనే వుంది!

(కమల ఇంట్లోకి వెళ్ళి బిస్కట్ పాకెట్ తెస్తూ లోపలి కుర్చీలో కూర్చున్న వాళ్ళ అన్నయ్యను చూసి)

కమల : (సంతోషంతో) అరే అన్నయ్యా ! ఎప్పుడొచ్చావురా?

రంగనాథ్ : గంటయ్యింది ! టీవీ చూసుకుంటూ వచ్చి - నువ్వే తలుపు తీశావ్ ! ఎవరొచ్చిందీ చూడకుండానే వెళ్ళి - మళ్ళీ టీవీ చూస్తూ నించున్నావ్ ! నిన్నెందుకు డిస్టర్బ్ చేయాలని పలుకరించలేదు.

కమల : ప్రతి ఐదు నిముషాలకీ ఎవరో ఒకరొచ్చి తలుపు కొడ్తూనే ఉంటారు! ఎవరో పక్కింటి వాళ్ళే కాబోలనుకున్నాను! సారీ అన్నయ్యా!

(ఇంతలో ధబేలున శబ్ధం విన్పిస్తుంది ! మాణిక్యాలు చిన్న కొడుకు వెళ్ళి - టీవీ మీద పెట్టిన ఫ్లవర్ వాజ్ తీసుకుని దాంతో ఆడుకుంటూ ఢామ్మని పగులగొడ్తాడు! మాణిక్యాంబ వాణ్ణి రెండంటిస్తుంది. వాడు ఆరున్నొక్కరాగం అందుకుంటాడు. ఆ గలాభాకి అక్కడికి చేరుకున్న కమల తనకిష్టమైన ఫ్లవర్ వాజ్ పగలి పోవడం చూసి ఎవర్నీ ఏమీఅన్లేక - చేసేదేమీ లేక - చీపురు పెట్టి ఆ గాజు ముక్కలన్నీ ఊడ్చేస్తుంది)

రంగనాథ్ : (పిలుస్తూ) కమలా !

కమల : ఏంటన్నయ్యా (అంటూ బెడ్ రూంలోకి వస్తుంది)

రంగనాథ్ : ఇదంతా ఏమిటి కమలా ! ఇల్లంతా ఎలా వుందో చూశావా? ఎంత చక్కగా సర్ది

కునేదానివి - ఇప్పుడేమైంది నీకు ? ఇల్లంతా ఛండాలంగా - ఎక్కడి వస్తువులు అక్కడ - ఏదో యుద్ధ భూమిలా...

కమల : ఏం చేయనన్నయ్యా ? రోజూ వాళ్ళందరూ వెళ్ళగానే శుభ్రంగా ఊడ్చేసి నీళ్లతో నేలంతా తుడుచుకుంటాను ! మళ్ళీ మామూలే! టీవీ చూడ్డానికి రావొద్దని చెప్పడానికి మొహ మాటం అడ్డొస్తోంది.

రంగనాథ్ : నువ్వు పర్మిషన్ ఇచ్చావంటే చాలు ! వీళ్ళం దర్నీ ఉన్న ఫలాన ఇప్పుడు నిముషంలో ఇంట్లోంచి పంపించేస్తాను!

కమల : ఎలా ?

రంగనాథ్ : నువ్వు నేను చెప్పినట్టు చేయాలి మరి!

కమల : సరే!

(రంగనాథ్ బెడ్ రూం నుండి టీవీ హాల్ తలుపు దగ్గరికి వచ్చి టీవీ చూస్తోన్న వాళ్ళకి విన్పిం చేట్టుగా)

రంగనాథ్ : కమలా ! సినిమాకి అవతల టైమవుతోంది ! పిల్లల్తో త్వరగా రెడీ అవ్వు ! అసలే ఆ పిక్చర్ ఈ రోజే రిలీజైంది! టికెట్లు దొరికే నమ్మకం లేదు! బావా, మీరు కూడా !

కమల : వస్తున్నాం అన్నయ్యా !

రంగనాథ్ : (టీవీ హాల్లోకి వచ్చి) రెడీ అయ్యారా ? తాళం ఎక్కడుందో తీసుకుని త్వరగా రండి బయటికి!

టైమైపోతోంది!

(వాళ్ళంతా తాళం, తాళం చెవి గుత్తి, టార్చ్ లైట్‌తో టీవీ హాల్లోకి వస్తారు - ఇక వెళ్దామ న్నట్లుగా. కానీ టీవీ చూస్తోన్నవాళ్ళు ఎవరూ ఎంతకీ కదలరు)

రంగనాథ్ : (నీళ్ళు నమిలి) మేం పిక్చర్‌కి వెళ్తున్నాం !

సూర్యకాంతమ్మ : ఆ... ఆ... అర్థమైంది అన్నయ్యగారూ ! మీరు పిక్చర్‌కి కదా వెళ్లేది ! తప్పకుండా వెళ్ళండి ! కానీ సావిత్రి పిక్చర్ సగంలో వదిలి మేం ఎలా వెళ్లేది మీరే చెప్పండి ? మీకు అభ్యంతరం లేకపోతే- ఆ తాళంకప్పా, తాళంచెవీ ఇలా ఇవ్వండి! టీవీ చూశాక మేమే తాళంవేసి, మీరు వచ్చాక - మీకు తాళంచెవి జాగ్రత్తగా అప్పగిస్తాం, సరేనా?

(ఇంటివాళ్ళంతా తెల్లబోయి - మరో రెండు నిముషాలకి తేరుకొంటూరు. రంగనాథ్ మింగలేకా కక్కలేకా - చేసేదేంలేకా - సూర్య కాంతమ్మకి తాళంచెవీ, తాళంకప్పా - నీరసంగా అప్పగిస్తూవుండగా - తెర)

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*

***(3-1-1991)***

# ప్రెజెంటేషన్స్



(ప్రియ డ్రాయింగ్ రూంలో పేపర్ చదువుతూ వుంటుంది ! ఓ మూల టేబుల్ మీద పింక్ కాగితాల్లో చుట్టబడి - ఎన్నో ప్రెజెంటేషన్స్ కన్పిస్తూ వుంటాయి!)

కవిత : (ప్రవేశిస్తూ) ఏమ్మా ప్రియా - మీ మమ్మీ వున్నారా?

ప్రియ : ఓ కవితాంటీ ? మీరా ? రండి ! రండి ! కూర్చోండి! మమ్మీ వున్నారు! మమ్మీ! కవితాంటి వచ్చారు !

(విమల వంటింట్లోంచి 'ఆఁ వస్తున్నా' అంటూ తడిచేతుల్ని నాప్కిన్‌కి తుడుచు

కుంటూ డ్రాయింగ్ రూంలోకి వస్తుంది)

కవిత : (కుర్చీలో కూర్చుంటూ:) మీరీ వూళ్లోంచి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నారటగా ! నాకీ విషయం మీనాక్షి చెప్పింది ! అది అవునో కాదో తెలుసుకుందామని వచ్చాను !

విమల : అవును కవితా ! మా వారికి వారం రోజుల క్రిందట ట్రాన్స్‌ఫరైంది. ఈ వూళ్లోంచి వెళ్ళిపోవాలని లేదు ! కానీ - ఏం చేయనూ? గవర్నమెంట్ ఉద్యోగాలంటే, ఇంతేకదా !

కవిత : ఏమిటోనండీ ! ఇన్నాళ్లూ ఎంతగానో కలిసి మెలిసి వున్నాం - మీరిలా వెళ్లిపోతున్నారంటే నాకే అదోలావుంది !

విమల : అవునండీ ! నాకూ అంతే ! ఈ వూళ్లోంచి వెళ్ళిపోవాలన్న ఊహే భరించలేకుండా వున్నాను! ఎందుకో వెళ్ళిపోయే ముందు మీ అందరికీ డిన్నర్ ఇవ్వాలనిపించింది ! ఈలోగా మా బాబు బర్త్‌డే కూడా కలిసొచ్చింది ! ఆ వంకతో అందర్నీ డిన్నర్‌కి పిలిచాను ! మిమ్మల్నీ పిలుద్దామని మీ ఇంటికివస్తే - మీరేదో పెళ్లికి వెళ్ళారని మీ ఇంట్లోవారు చెప్పారు !

కవిత : అవునవునూ... విన్నాను ! డిన్నర్ చాలా గ్రాండ్‌గా జరిగిందట కదా! డిన్నర్ ఏర్పాట్లన్నీ బ్రహ్మాండంగా వున్నాయనీ - గెస్ట్లు చాలామంది వచ్చారనీ - ఆ డిన్నర్‌కి వచ్చిన వాళ్లంతా ఒకటే మెచ్చుకున్నారు!

విమల : ఏం చేయను కవితా ! ఇక్కడున్న మూడు సంవత్సరాలూ ఫ్రెండ్సిచ్చిన పార్టీలకు వెళ్లాను! అంతమంది దగ్గరా పార్టీలు తీసుకుని - నేనివ్వక పోతే బావుంటుందా ?

కవిత : అయినా నాకొకటి వింతగా అన్పించింది! అసలు మీరొచ్చి మూడేళ్లు అయ్యిందా ? మీరెప్పుడూ ఏ సంవత్సరం కూడా మీ బాబు బర్త్‌డే చేయలేదు ! అలాంటిది - ఇప్పుడేమిటీ... ఈసారి... ఇలా.. కొత్తగా..

ప్రియ : మీకో విషయం చెప్పనా కవితాంటీ ? ఇక్కడున్న మూడేళ్ళూ మమ్మీ ఎన్నో ఫంక్షన్స్‌కి అటెండ్ అయ్యారు ! ఎంతలేదన్నా పాతిక మందికి పైగా ప్రెజెంటేషన్స్ చదివించారు ! ఇప్పుడీ వూళ్లోంచి... అర్థాంతరంగా.... వెళ్ళిపోతున్నందుకి... మమ్మీ... ఒకటే... దిగులు పడిపోతున్నారు!

రాజేష్ : (విమల కొడుకు ప్రవేశిస్తూ...) ఓహో అర్థమైంది! బర్త్‌డేలాంటి ఏదైనా పంక్షన్ చేస్తే - వాళ్లందరికీ తనిచ్చిన - ప్రెజెంటేషన్స్ తిరిగి రాబట్టుకోవచ్చని... మమ్మీ వుద్దేశ్యం ! యామై కరెక్ట్ ?

(విమల తన కొడుకూ కూతుర్ల వంక గుడ్లురిమి చూస్తూన్న సమయంలో... హైహీల్స్ టకటక లాడిస్తూ ఆ హాల్లో రాధ ప్రవేశిస్తుంది)

రాధ : హలో విమలా !

విమల : హాయ్ ! రాధా ! రా! రా! ఇలా కూర్చో !

రాధ : ఓ, కవితా ! హాయ్ ! నువ్వూ ఇక్కడే వున్నావే!

(రాధ కూర్చోకుండా నేరుగా టేబుల్ దగ్గరకి వెళ్లి - దాని మీద వున్న- ప్రెజెంటేషన్స్ వైపు సంభ్రమంగా చూస్తూ:) ఓహ్ ! ఎన్నెన్ని ప్రెజెంటేషన్స్? ఇదేమిటీ ? ఓ - ఆల్బమ్ ! ఓపెన్‌చేస్తే - ఏదో మ్యూజిక్ వస్తోందే. ఎంత బావుందో ? ఇదేమిటీ - ఓహో - ప్లేట్ ! ఇది కూడా ప్రెజెంటేషనేనా ? - నాక్కూడా ఇలాంటి ప్లేట్స్ ఎవరన్నా ప్రెజెంట్ చేస్తే ఎంత బావుం డేదీ ?

కవిత : (వ్యంగ్యంగా) ఇదేమంత భాగ్యం ? నువ్వు కూడా మీ బాబు బర్త్‌డే సెలబ్రేట్ చేస్తే - నీకంతకన్నా మంచి ప్రెజెంటేషన్స్ బోల్డు రావొచ్చు! ట్రై యువర్ లక్ !

రాధ : (కవిత వ్యంగ్యాన్ని అర్థం చేసుకోకుండా అదే ధోరణిలో...) అదీ చూశాను! ఒకసారి మా పొరుగింటి వాళ్ళమ్మాయి పెళ్ళికి వంద రూపాయలు పెట్టి ప్రెజెంటేషన్ కొన్నాను ! తీరా - వాళ్ళవంతు వచ్చేసరికి - మా అమ్మా యి పెళ్ళికి వాళ్ళిచ్చిందేమిటో తెలుసా? ఫ్లవర్‌వాజ్ ! అయినా - ఎవరో వచ్చి నాకేదో చేస్తారని నేనేప్పుడూ అనుకోలేదు గానీ - ఏదో వుండబట్టలేక చెప్తున్నాను!

విమల : అవును రాధా - నువ్వు చెప్పింది అక్షరాలా

నిజం! కొందరింతే! చూశావా - ఆరోజు లలితాంబ మా బాబు బర్త్‌డేకి ఎంచక్కా బనారస్ చీర కట్టుకుని - డైమండ్స్ టాప్స్ పెట్టుకుని - మెళ్లో చంద్రహారం వేసుకుని - చేతులూపుకుంటూ వచ్చింది ఫంక్షన్‌కి! ఉత్తచేతుల్తో వచ్చినందుకు ఆమెని చూసి అందరూ ఒక్కటే చెవులు కొరుక్కున్నారు!

రాధ : ఇదేమిటీ - ఈ గ్లాసూ... ప్రెజెంటేషనే !?

విమల : ఆ... ఆ! చూడూ - కాస్త నొక్కితే చాలు సొట్టపడ్డట్టే! ఇంకా నయం! అల్యూమినియం గ్లాస్ కొన్లేదు! కొనడానికి బజార్లో ఏదీ - దొరకనట్టు... ఈ ముష్టి గ్లాసొకటి కొని - మా ముఖాన పడేశారు!

రాధ : అరే - ఇదేమిటి ? ప్చ్ - ప్లాస్టిక్ ఫోటో ఫ్రేం ! ఇంకా నయం ! ప్లాస్టిక్ సబ్బు డబ్బా తేలేదు! ఇంతోటి ప్రెజెంటేషన్ మీద అదేదో గొప్ప ప్రెజెంటేషన్ అయినట్టు 'ప్రెజెంటెడ్ బై' అని కూడా రాసుకున్నారు! ఎంత సిగ్గులేని మనుషులో !?

విమల : ఇదిగో - ఈ ప్రెజంటేషన్ చూడూ - బిస్కట్ డబ్బా ! ఈ బోడి బిస్కెట్ డబ్బాని - రంగు రంగుల కాగితాల్లో చుట్టి - అదేదో పెద్ద అపురూపమైన ప్రెజెంటేషన్లా - ఎంత గ్రాండ్‌గా తీసుకొచ్చారో ? తలుచుకుంటే నాకిప్పటికీ సిగ్గేస్తుంది !

రాధ : అవునూ.... అదే మీ పక్కింటి సరిత అయితే- ఎంచక్కా నాలుగు డబ్బాల టిఫిన్ క్యారియర్ ప్రెజెంట్ చేసింది ! పైగా అది మేడిన్ జపాన్ అట! ఎంత బావుందో ? బిస్కట్ డబ్బాలు - పెన్నులూ - ఇలాంటి చిన్నచిన్న ప్రెజెంటేషన్స్ నాకు బొత్తిగా ఇష్టం వుండవు!

ప్రియ : బాప్‌రే - ఎన్ని ట్రేలొచ్చాయి ! ఎన్నెన్ని ఆల్బమ్స్! మమ్మీ - నాకు తెలీక అడుగుతా - మనకో ట్రే - ఒక ఆల్బమ్ చాలు కదా ! మరి వీటన్నింటినీ ఏం చేస్తావిప్పుడు ?

రాజేష్ : మమ్మీ - మనమో స్టీల్ దుకాణమో - జనరల్ షాపో పెట్టుకుందామా? ఇప్పుడొచ్చినవీ - అంతకు ముందువీ కలిపి బోల్డు ప్రెజెంటేషన్స్ - అటకమీద - దుమ్ముపట్టిపోతున్నాయి కదా!

ప్రియ : అంతకన్నా - ఈ ప్రెజెంటేషన్సన్నీ - అవి కొన్న దుకాణంలోనే సెకండ్ హాండ్‌కి అమ్ముకుంటే బావుంటుందేమో ?

రాజేష్ : మమ్మీ - ఇంకో ఐడియా ! వీటిని వొదిలించు కునే మార్గం చెప్పనా? మనకి పనికిరాని వాటన్నింటినీ - ఏదైనా ఫంక్షన్లో మనకి పడని వాళ్ళకి ప్రెజెంట్ చేస్తే సరి !

రాధ : అన్నట్టు - నాకో విషయం గుర్తొస్తోంది. మొన్నేం జరిగిందో తెలుసా? మా శ్రీవారు వాళ్లాఫీసర్ కొడుకి పెళ్ళికి వెళ్ళారు! వొద్దం టున్నా వినకుండా - భేషజాలకి వెళ్ళి -

అప్పుచేసి మా వారు ఉంగరం కొన్నారు... అందర్లో గొప్పగా పెళ్ళి కొడుక్కు ప్రెజెంట్ చేద్దామని! తీరా నిన్న వాళ్ళ పెళ్ళి వీడియో కాసెట్ చూసాను! అందులో... అందరూ... చిన్న చిన్న ప్రెజెంటేషన్స్ ఇచ్చిన వాళ్ళుకూడా... పెద్ద పెద్ద పోజులుకొడ్తూ కన్పించారు గానీ - మా వారు బంగారు ఉంగరం తొడిగినా - ఆయనెక్కడా - కనీసం అర సెకన్ అయినా కన్పించలేదు ! ఆ విషయం గుర్తొస్తే ఇప్పటికీ నా కళ్ళలో నీళ్ళు తిరుగుతూ వుంటాయి! బొత్తిగా గుర్తింపు లేని ప్రెజెంటేషన్ అయి పోయింది!

కవిత : (అసహనంగా) సరే - విమలా ! సాయంత్ర మైంది! పిల్లలొస్తారు! టిఫినదీ చేయాలి ! ఏం రాధా - నువ్వూ వస్తావా ? వెళ్దాం!

(కవిత, రాధ నిష్క్రమిస్తారు ! విమల భర్త రామారావు ప్రవేశిస్తాడు)

విమల : ఏమిటండీ - ఇంతాలస్యం ?

రామారావు : ఏం చేయను విమలా ? రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వడానికి ఇంత టైమ్ పట్టింది !

డాలీ : (పక్కింటి పాప ప్రవేశిస్తూ) అంకుల్ ! అంకుల్!

రామారావు : ఓ నువ్వా - డాలీ !? (ఎత్తి - ముద్దాడి:) ఏంటమ్మా - ఈ మధ్య బొత్తిగా రావడం మానేశావ్ !

డాలీ : ఉత్తినే అంకుల్ ! రేపు నా బర్త్ డే అంకుల్ ! మా మమ్మీ - మిమ్మల్నీ- ఆంటీనీ లమ్మని చెప్పమన్నాలు ! వస్తాలు కదూ!

రామారావు : వైనాట్ ? ష్యూర్!

డాలీ : ఆ - తప్పకుండా లావాలీ ! వే వెళ్తున్నా అంకుల్! మమ్మీ నా కోసం ఎదులు చూస్తాలు!

(పాప నిష్క్రమిస్తుంది)

విమల : ప్చ ! ఏం బర్త్‌డేలో ఏమో ? అసలే - ఇవి నెలాఖరు రోజులు! ఇప్పుడు ఏం పెట్టి ఎలా ప్రెజెంటేషన్స్ కొనాలో అర్థం కావడంలేదు!

రామారావు : అద్గదీ ! అలా రా దార్లోకి ! మరి మనం మన బాబు బర్త్‌డే చేసినపుడు.. వాళ్ళు కూడా డబ్బు కోసం ఇలాగే ఇబ్బంది పడివుంటారు కదా! ఎప్పుడైనా ఆ విషయం ఆలోచించావా?

విమల : అయినా - మనమా ఈ వూళ్లోంచి వెళ్ళిపోయే వాళ్లం ! మనకెందుకీ గొడవ ! రేపు డాలీ బర్త్‌డే ఎగ్గొడ్తేసరి ! ఒకసారి మనం వాళ్ళ కిచ్చాం... మరోసారి వాళ్ళు మనకిచ్చారు! చెల్లుకి చెల్లు! ఇపుడు మళ్లీ మనం వాళ్ళకి ప్రెజెంటేషన్స్ ఇస్తే - అదెప్పటికీ రాబట్టు కోలేం!

రామారావు : ఛ! ఎంత పిచ్చిగా ఆలోచిస్తున్నావ్ విమలా నువ్వు? అన్నట్టు ప్రెజెంటేషన్సంటే గుర్తొచ్చింది.... మొన్న ఏం జరిగిందో తెలుసా? మా

ఆఫీసర్ వాళ్ళమ్మాయి పెళ్ళయింది! ఆయన కింద పనిచేస్తోన్న సిబ్బంది అంతా - ఆయన మెప్పుకోసం- ఆయన వొద్దంటున్నా వినకుండా - అందరూ తలా ఓ పాతిక రూపాయలు వేసి ఓ ప్రెజెంటేషన్ కొందామని - ఓ మీటింగ్ పెట్టారు! ఆ మీటింగ్‌లో కొందరు 'పాతిక ఇస్తామనీ'; మరికొందరు 'అబ్బ ! పాతికేమిటీ - ఓ పదిస్తాం చాలనీ' - ఇంకొంతమంది 'ఛ! ఆఫ్టరాల్ పాతికేమిటీ, తలా యాభై ఇద్దామనీ, నేనేమో 'ఆయన వొద్దన్నారు గాబట్టి ప్రెజెంటేషన్స్ అసలే వొద్ద'నీ - అలా ఎన్నో వాదోపవాదాలూ - తర్జన భర్జనలూ! ఎవర్దీ ఎవరూ విన్పించుకోలేదు! ఎలాగైనా చావండని నేను బయటికి వచ్చాను !

విమల : అది కాదండీ ! నాకు తెలీక అడుగుతాను ! కొందరు ప్రేమతో - మరి కొందరు అభిమానంతో - వాళ్ళ జ్ఞాపకార్థం ఏ వస్తువులైనా ప్రెజెంటేషన్‌గా ఇస్తారు! అలాటప్పుడు వాటిని మనం తీసుకుంటే తప్పేమిటీ ?

రామారావు : అది కాదు విమలా ! అప్పుడు అదే ప్రేమతో - అంతే అభిమానంతో- నీ జ్ఞాపకార్థం - నువ్వూ ఏదైనా ప్రెజెంటేషన్ వాళ్ళకీ - ఇవ్వాలిగా! 'ఇచ్చెనమ్మ వాయనం - పుచ్చుకొనెనమ్మ వాయనం' - అన్నట్టు - ఇదంతా ఎందుకు చెప్పూ?

రాజేష్ : డాడీ ! మరి మీరు ప్రియకి మొన్న టెంత్‌లో ఫస్ట్ వచ్చిందని వాచీ కొనిచ్చారు ! మరి అది కూడా ప్రెజెంటేషనే కదా ! అది తప్పు కాదా?

రామారావు : చూడు రాజేష్ ! ప్రియ నా కూతురు! నేను తన తండ్రిని ! ఒక తండ్రి కూతురుకిచ్చేది ప్రెజెంటేషన్ ఎలా అవుతుంది ? తండ్రిగా పిల్లల కనీసావసరాలు తీర్చడం నా విధి ! అయితే ఏ తండ్రీ పిల్లలకీ అన్నీ ఒక్కసారే కొనివ్వలేడు కాబట్టి - నెమ్మదిగా - వాళ్ళ వీలుని బట్టి- ఒక్కోటి ఒక్కో సందర్భంలో కొనిస్తాడు ! ప్రియ టెంత్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది ! తనని ఎంకరేజ్ చేయడానికి - తండ్రిగా- నేను ఆ సందర్భాన్ని ఉపయోగించుకుని - తనకిష్టమైన వాచీని కొనిచ్చాను! చూడూ - నీకో విషయం చెప్పనా? ఒక తండ్రి తన పిల్లలకి - ఒక భర్త తన భార్యకి - ఇచ్చేవి ప్రెజెంటేషన్స్ కావు! గిఫ్ట్! పిల్లలు తల్లిదండ్రుల నుండి - భార్యాభర్తలు ఒకరినుండి మరొకరూ గిఫ్ట్ తీసుకోవచ్చు - కానీ బంధువులనుండీ - స్నేహితుల నుండీ ప్రెజెంటేషన్స్ తీసుకోకూడదు! అది దుస్సాంప్రదాయం నా దృష్టిలో!

విమల : సర్లే - నాకు తెలిసి ఒకాయన యిలాగే - ఎంచక్కా వెడ్డింగ్ కార్డ్ మీద 'ప్రెజెంటేషన్స్ స్వీకరించబడవ్' అని గ్రాండ్‌గా ప్రింట్ చేశారు! తీసుకోరు కాబోలని - మేమంతా ఉత్తచేతుల్తో వెళ్తే - తీరా - కొంత మంది తీసుకొచ్చారు !

వాళ్ళు తీసుకున్నారు ! మేము ఉత్త చేతుల్తో వెళ్ళినందుకు... తల కొట్టేసినట్టు ఫీలయ్యాం!

రామారావు : అసలు ఆయన వొద్దని చెప్పినా విన్పించుకోకుండా వాళ్ళు ప్రెజెంటేషన్స్ తీసుకెళ్ళడమే ఒక పెద్ద తప్పు! వొద్దన్నా తీసుకొచ్చే నీలాంటి చాదస్తులు కొందరుంటారు! అంతమందిలో వొద్దువద్దని సీన్ సృష్టించడం యిష్టం లేకో - లేక వాళ్ళని నొప్పించడం యిష్టం లేకో - వాళ్ళు మిన్నకుండి వుంటారు ! అంత మాత్రానికే వాళ్ళని తప్పుబడ్తే ఎలా ?

విమల : వాళ్ళ సంగతేమోగానీ - నా బాధంతా మన పొరుగింటి వాళ్ళు రెండువేలు ఖర్చుచేసి - నాలుగు వేల విలువైన ప్రెజెంటేషన్స్ రాబట్టుకున్నారని ! పైగా వాళ్ళు పెట్టింది వెజిటేరియన్ భోజనం ! కాని మనమో ? ఐదువేల రూపాయలు ఖర్చుచేశాం ? నాన్ - వెజ్‌టేరియన్ విందుయిచ్చాం ! కాని ఇంత చేసినా- మనకు వచ్చిన ప్రెజెంటేషన్స్ విలువ అన్నీ కలిసి - వెయ్యి రూపాయలకి మించదు! అది మనకి ఎంత నష్టమో - ఆలోచించారా? అయినా దేనికైనా పెట్టిపుట్టాలి ! అదృష్టం కలిసిరావాలి ! ఇంత తక్కువ ప్రెజెంటేషన్స్ వస్తాయనుకుంటే - అంత ఖర్చుపెట్టి అసలు ఆ బర్త్‌డే చేసేదాన్ని కాదు!

రామారావు : స్టాపిట్ విమలా ! నీలో ఇలాంటి చెడు

వుద్దేశ్యాలు వున్నాయను కుంటే... నేను చచ్చినా ఆ బర్త్‌డే సెలబ్రేట్ చేసేవాణ్ణి కాదు! ఎవరైనా మనల్ని ప్రేమతో పిలిస్తే తప్పకుండా వెళ్ళాలి! మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలి ! అంతేగానీ - ఇలా చీప్‌గా మాట్లాడకు ! అసహ్యంగా వుంటుంది - నువ్వు అసలు ఇకముందు ఎవరికీ ఎలాంటి ప్రెజెంటేషన్స్ ఇవ్వకు ! ఎవర్నుండీ ఏమీ తీసుకోకు! అప్పుడే నువ్వూ వాళ్ళూ అందరూ బాగుపడ్తారు!

మాణిక్యాంబ : (విమల అత్తగారు ప్రవేశిస్తూ) అలా చెప్పరా మీ ఆవిడకి ! అవిడ కెప్పుడూ ఎవరికి ఏ ప్రెజెంటేషన్ ఇవ్వాలా - దాన్ని తిరిగి ఎలా ఏ రూపంలో - అంతకన్నా పెద్దది రాబట్టు కోవాలా - ఇదే యావ! కనీసం కొత్త వాళ్ళో నైనా బుద్ధిగా వుండమను - సుఖపడ్తారు!

(తెర)

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*
***(27-12-1990)***





(అది హాలు ! ఒక పక్కన మంచంలో గోపీ నిద్రపోతూ వుంటాడు! మరో పక్కన కుర్చీలో కూర్చుని - రజని నవల చదువుతూ వుంటుంది!)

సునంద : (అప్పుడే వంటింట్లోంచి వస్తూ) గోపీ! - గోపీ మై డాళింగ్ ! ఇంకా ఎంతసేపులే ! త్వరగా లేచి, ముఖమదీ కడుక్కో నాన్నా !

గోపి : (ఇంకా ముడుచుకుని పడుకుంటూ) అబ్బ !

నన్ను నిద్రపోనీ మమ్మీ! రోజూ ఉదయమే అయిదింటికి లేస్తామా - సెలవుల్లో కూడా నిద్ర పోనీకపోతే ఎలా ?

సునంద : (విసుక్కుంటూ) ఏం సెలవులో ఏమోరా! మీకు సెలవులిచ్చారంటే చాలు - నా ప్రాణం మీదకు వస్తుంది ! ఏదీ టైం ప్రకారం జరగదు కదా ! లే నాన్నా ! మీ డాడీ నువ్వింకా నిద్రపోతున్నావని తెలిస్తే కోప్పడ్తారు! లే తండ్రీ! మా బుజ్జివి కదా ! మా బంగారు కొండవి కదా !

గోపి : అబ్బ మమ్మీ! ప్లీజ్ మమ్మీ ! నీకు దణ్ణం పెడ్తా మమ్మీ ! (అంటూ నిండా దుప్పటి కప్పుకుని మరీ ముసుగెట్టుకుంటాడు!)

సునంద : (వంటింట్లోకి వెళ్ళి అక్కడినుండి హాల్లోకి విన్పించేట్టు కేకేసన్తూ) రజనీ! ఏం చేస్తున్నావమ్మా! వచ్చి వంటింట్లో సాయం చేస్తే తప్పా? రజనీ - రజనీ ఎక్కడున్నావ్ ? ఇలా రా ఒకసారి !

రజని : (నవల చదువుతూ ఉన్న చోటునుండి కదల కుండానే) ఆ... ఆ వస్తున్నాను మమ్మీ !

(రజని అక్కడినుండి కదలకుండా కాళ్లూపు కుంటూ నవల చదువుతూ కూర్చుంటుంది!)

సునంద : (లోపలినుండి మళ్ళీ పిలుస్తూ) రజనీ! ఎన్ని సార్లు పిలవాలమ్మా నిన్ను ? వంటింట్లోకొచ్చి

నాకు సాయం చేద్దురా ! పొద్దున్నించీ వంట పనితో అలసిపోయాను !? త్వరగా రా తల్లీ !

రజనీ : వెయిట్ మమ్మీ, ఈ నవల ఎంత ఇంటరెస్టింగా వుందో తెలుసా ? ఒక్క అరగంట ఆగు మమ్మీ! ఇది చదివేసి వస్తా ! ఒట్టు!
(ఇంతలో సునంద ఆడబిడ్డ పిల్లలు రవీ... బుజ్జీ..... సునందా వాళ్లింట్లో సెలవులు గడుపుదామని... పెట్టేబేడాతో వస్తారు ! వాళ్ళను చూసి!)

రజనీ : హాయ్ రవీ ! హాయ్ బుజ్జీ ! మమ్మీ... గుడ్ న్యూస్! ఎవరొచ్చారో తెలుసా !? అత్తయ్య పిల్లలు రవీ... బుజ్జీ - మనింటికొచ్చేశారు.

సునంద : (బయటకు వచ్చి) ఏరా ! ప్రయాణం బాగా జరిగిందా ? అమ్మా వాళ్ళంతా బాగానే ఉన్నారా? మీరిద్దరే వచ్చారా ? తాతయ్యేరీ ?

రవి : వచ్చారు ఆంటీ ! రిక్షావాళ్ళకి డబ్బులిస్తున్నారు!

సునంద : సరేలే ! ట్రెయిన్లో దుమ్ము కొట్టుకుపోయినట్టు న్నారు. వెళ్ళి స్నానమదీ చేసిరండి ? ఈ లోగా మీ అందరికీ బ్రేక్ ఫాస్ట్ సిద్ధంగా వుంచుతాను!
(సునంద వంటింట్లోకి వెళ్ళిపోతుంది)

తాతయ్య : (ప్రవేశిస్తూ) రవీ - నువ్వు ట్రెయిన్‌లో పళ్ళు తోము కోలేదు కదూ ! నిజంగా నువ్వెంత సోమరిపోతు విరా ! మీ అంకుల్ బాత్రూమ్‌లో వున్నట్టున్నారు! నువ్వింకా పళ్ళు తోముకో

లేదని తెలిస్తే 'బ్యాడ్ బాయ్' అంటారు !

రవి : సరేలే వెళ్తున్నాను ! రజనక్కా - పేస్ట్ వుంటే ఇస్తావు? (రజని నవల చదువుతూ విన్పించు కోదు)

రవి : రజనక్కా పేస్ట్ ! పేస్ట్ ! దంతక్షయాన్నించీ.... రక్షించే కాల్గేట్....

బుజ్జి : నోటి.... దుర్వాసనా.... ఆపే కాల్గేట్ !

తాతయ్య : అబ్బ ఆపండ్రా మీ అడ్వర్టయిజ్‌మెంట్ల సుత్తి! అమ్మాయ్ రజనీ- కాల్గేటో - గీల్గెటో - అదేదో వీడి మొహాన పడేద్దూ! లేకపోతే అడ్వర్టయిజ్ మెంట్ల భాగోతం విప్పి మనల్ని పీల్చి పిప్పి చేస్తాడు.

(అంటూ బెడ్‌రూంలోకి వెళ్ళిపోతాడు అదే సమయంలో నానీ స్కిప్పింగ్ రోప్‌తో ఆడు కుంటూ - ఆ హాల్లోకి వస్తుంది! ఆ రోప్ వెళ్ళి రజని మెడకు చుట్టుకుంటుంది. రజని కెవ్వు మంటుంది, విషయం గమనించి:)

రజని : (కోపంగా) ఏయ్ - నానీ - ఏమిటీ న్యూసెన్స్! ఇదేమైనా ఇల్లా ప్లే గ్రౌండా ? వెళ్ళి బయట ఆడుకో !

నాని : నువ్వయితే ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లో పుస్తకాలు చదువుకోవచ్చు గానీ - నేను మాత్రం ఇంట్లో ఆడకూడదు! నువ్వెళ్ళి వంటింట్లో అమ్మకి సాయం చేయకూడదూ

మాతో పోట్లాడే బదులు!

రజని : నా యిష్టం ! నేనేమైనా చేస్తాను ! నువ్వెరివీ నాకు నీతులు చెప్పడానికి... ? వేలెడంత లేవు... నన్నే ఎదిరిస్తావా ?

(రజని నానీని రెండంటిస్తుంది)

నాని : (రాగం అందుకుంటూ) మమ్మీ.... రజనీ కొట్టిందీ... ఈ...ఈ...ఈ...

సునంద : (వంటింట్లోంచి వస్తూ) అబ్బబ్బ ! మీకూ మీ రాగాలకీ ఒక దణ్ణంగానీ - నోర్మూయ్యండే, మీకు పుణ్యం వుంటుంది !

(ఇంకా మంచంమీద పడుకుని నిద్రపోతోన్న గోపీని చూసి:)

ఒరేయ్ గోపీ, నువ్వింకా నిద్రపోతూనే వున్నావా? లే ! లేచి చూడూ - మనింటికి ఎవరొచ్చారో ? (అంటూ వంటింట్లోకి వెళ్ళి పోతుంది)

గోపి : (బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకుని మళ్ళీ మంచంమీద కూర్చుని..)

**స్కూలు లేదూ....**

**స్వేచ్ఛలేదూ..... ఎంజాయ్ చేసే దారిలేదూ....**

**సెలవులన్నీ చప్పగుంటే... మజాయే... లేదూ... అయ్యో.....**

**మజాయే... లేదూ...**

(దేవదాసు భుజమ్మీద శాలువా వేసుకున్నట్టు - భుజమ్మీద దుప్పటి
వేసుకుని-దేవదాసు లెవల్లో - 'చెలియలేదు - చెలిమిలేదూ' పాట స్టయిల్లో పాడ్తూ వుంటాడు)

రజని : షటప్ ! వెధవ నిద్ర.... వెధవ పాటలు ! నీ బోడి పాటలు కట్టిపెడ్తే సంతోషిస్తాను ! అసలే ఈ నవల క్లైమాక్స్ యమ సస్పెన్స్ ! విషయం అర్థంగాక ఛస్తుంటే - మధ్యలో నీ పాటలేమిటీ?

గోపి : నా నోరు ! నా పాట ! నా ఇష్టం ! నువ్వెవరూ నా జోలికి రావడానికి?

(బుజ్జీ నానీ బ్రష్ చేసుకొచ్చి వంటింట్లో వున్న వాళ్ళందరికీ విన్పించేలా)

బుజ్జి : ఆంటీ, నేను బ్రష్ చేసుకున్నాను ! నాకు బోర్న్‌విటా కావాలి !

నాని : మమ్మీ నాకు బోర్న్‌విటా వద్దు. హార్లిక్స్ కావాలి.

బుజ్జి : బోడి హార్లిక్స్ !

నాని : బోడి బోర్న్‌విటా !

బుజ్జి : నా బోర్న్‌విటా బోడిదా ?

నాని : నా హార్లిక్స్ బోడిదా ?

(ఇద్దరూ పోట్లాడుకుంటూ వుంటారు, బుజ్జీ నానీని రెండు తగిలిస్తుంది)

నాని : యూ.... గెటౌట్ (నానీ బుజ్జీని తోస్తుంది ! బుజ్జి కింది పడిపోయి ఏడుస్తుంది. బుజ్జి నానీ జుట్టుపట్టి లాగుతుంది. ఇద్దరూ ఒకరికన్నా మరొకరు గొంతులు పెంచి ఆరున్నొక్క రాగాలు అందుకుంటారు)

సునంద : (వంటింట్లోంచి వస్తూ) ఆగండి ! ఆగండి ! ఏమిటా గోలా ? నా చెవులు పగిలిపోతున్నాయి!

బుజ్జి : ఆంటీ, ఇది నన్ను కొడ్తోంది ! చూడూ - నా చేతుల మీద ఎలా రక్కిందో! పిశాచి !

నాని : ఇది రాక్షసి మమ్మీ ! చూడు నా జుత్తుని ఎలా పీకిందో ?

సునంద : (స్వగతంగా) ఏం పిల్లలో ఏమో ? ప్రతీదానికి పోట్లాడ్తూ వుంటారు. (పిల్లల్తో) ఇదిగో పిల్లలూ మీరిలా అయిందానికీ కానిదానికీ అల్లరి చేశారంటే - మిమ్మల్నీ గదిలో వేసి తాళం వేస్తాను!

(పిల్లలు ఆమె చెప్పేది విన్పించుకునే దశలో వుండరు!)

నాని : మమ్మీ హార్లిక్స్ !

బుజ్జి : ఆంటీ - బోర్నవిటా !

సునంద : (నెత్తి కొట్టుకుంటూ) రజనీ, నాతో వచ్చి హార్లిక్స్, బోర్నవిటా తీసుకొని ఈ పిల్లలకివ్వు. నాకు వంటింట్లో తాలింపు మాడ్తోంది!

రజని : అలాగే మమ్మీ.

(రజని సునందతో కలిసి వంటింట్లోకి వెళ్ళి హార్లిక్స్, బోర్న్‌విటా కప్పులతో తిరిగి వచ్చి ఎవరిక్కావలసింది వాళ్ళకిచ్చేసి- మళ్ళీ తన కుర్చీలో కూర్చుని నవల చదువుతూ వుంటుంది. ఈలోగా రవి కూడా బ్రష్ చేసుకుని వచ్చి - కుర్చీలో కూర్చుని - టీవీ పెట్టుకుంటాడు)

రంగమ్మ : (రూం ఊడుస్తూ అక్కడికీ వచ్చి) అమ్మాయిలూ, మీరంతా కాస్త బయటికి వెళ్ళారంటే - ఈ గదిలో దుమ్ము దులిపి చిమ్మేస్తాను!

రవి : నో, మేం వెళ్ళం! మేం టీవీ చూడాలి. అసలే ఈ రోజు టీవీలో మంచి ప్రోగ్రామ్స్ వున్నాయి! తర్వాత వూడుద్దువుగానీ - కాస్త పక్కకు తప్పుకో తల్లీ - టీవీ కన్పించట్లేదు!

రంగమ్మ : అది కాదు బాబూ ! ఈ గదిలో బూజు దులపక రెండు వారాలవుతోంది ! అయ్యగారీ బూజులు చూశారంటే నన్ను ఉద్యోగం లోంచి పీకేస్తారు.

రజని : దులపకుండా ఈ రెండు వారాలూ ఆగేవు కదా! ఇంకో రెండు గంటలు ఆగలేవూ ? ఇదిగో - ఆనక - మేము చిమ్మేస్తాం గానీ - మమ్మల్ని అట్టే విసిగించకు ! అసలే టీవీలో మంచి ప్రోగ్రామ్స్ మిస్సవుతున్నాం- నీతో మాటలు పెంచి!

రంగమ్మ : నీకేమమ్మా నువ్వలాగే చెప్తావ్! మీ టీవీ సంగతి నాకు తెలీదుగానీ మీరంతా లేచి బయటికి వెళ్తారా... నన్నిట్టాగే వూడ్చేయ మంటారా?

నాని : ఊడ్చేయ్ రంగమ్మా ! అప్పటికిగాని మా అక్క స్నానానికి లేవదు! జిడ్డు ముఖమదీ వేసుకుని - ఎంత షోగ్గా టీవీ చూస్తుందో ?

(రంగమ్మ ఆ హాల్లో కూర్చున్న వాళ్ళెవర్నీ కేర్ చేయకుండా - ఆ హాల్ని వూడుస్తూ వుంటుంది! ఆ దుమ్ముకి బుజ్జికి తుమ్ము లొస్తూ వుంటాయ్)

రవి : ఆపూ.... ఆపూ... ఏయ్ తుమ్ముల రాక్షసీ - నీ తుమ్ములు ఆపు ! లేకపోతే నీ తుమ్ముల తుఫాన్కి మేం కొట్టుకుపోతాం !

బుజ్జి : హాచ్ ! హాచ్ !

రవి : ఏమిటా హాచ్ హాచ్ ! బయటికి వెళ్ళి తుమ్ముకోరాదూ ? మమ్మల్నిలా చంపకపోతే!

బుజ్జి : తుమ్ముకోవడానిక్కూడా స్వేచ్ఛలేని బ్రతుకు - ఏం బ్రతుకో ఏమో- హాచ్ ! అసలు నీతో ఈ ఊరికి రాకుండా వుండాల్సింది- హాచ్! పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకన పెట్టుకున్నట్టు... హాచ్ !

రవి : ఏయ్ మాటలు జాగ్రత్తగా రానీ ! ఇంటికి వెళ్ళనీ... నువ్విక్కడ నాతో, నానీతో ఎలా

పోట్లాడిందీ చెప్తాను మమ్మీతో!

బుజ్జి : ఒరేయ్... హాచ్ హాచ్! చెల్లాయినన్న కనికరం కూడా లేని పాపిష్టివాడా- హాచ్ ! - దుష్టుడా - హాచ్ ! దుర్మార్గుడా - హాచ్ !

రజని : ఏమిటే ఈ తిట్లు ఎక్కడ నేర్చావ్ ?

బుజ్జి : అదికాదక్కా ! ఈ దుమ్ముమవల్ల తుమ్ములొస్తున్నాయ్ ! నేనేం చేయనూ ? హాచ్ అసలే వీడి భయానికి - వీడో చండశాసనుడని- రెండు తుమ్ములాపుకున్నాను ! హాచ్ ఇంకెన్ని ఆపుకోనూ? హాచ్!

రవి : చూడక్కా ! దీనికసలే డస్ట్ ఎలర్జీ ! పనిమనిషి వచ్చి రూం వూడుస్తూంటే - మర్యాదగా వెళ్ళాలా? ఊహుఁ టీవీ చూస్తూ కూర్చుంది! చూడూ... ఇప్పుడెంత కష్టమో ?

బుజ్జి : నా బదులు నిన్నేం తుమ్మమని చెప్పలేదే ? హాచ్! నువ్వెందుకు జోక్యం కల్గించుకుంటావ్ - హాచ్!

రవి : అసలు నీతో మాట్లాడడమే బుద్ధి తక్కువ ! తుమ్ముకో - ఇష్టమున్నన్ని తుమ్ములు తుమ్ముకో! అదిగో ఆ టేబుల్‌మీద పేపర్ వుంది చూడూ- అది కూడా ఎగిరిపోయేదాకా తుమ్ముకో!

(నేలమీద నానీ కూర్చుని - ఇంట్లోని మ్యాగజైన్స్ అన్నీ చింపి పోగులు పెడ్తూ ఆడుకుంటూ

వుంటుంది! గోపీ బాల్‌తో ఆడుకుంటూ హాల్లోకి వచ్చి:)

గోపి : రవీ ! నేను బాల్ ఎంత బాగా ఆడ్తానో తెలుసా? నా శక్తి నీకు తెలీదు ! చూడూ - ఒకే ఒక బాల్ దెబ్బతో - ఇదిగో నీ నెత్తిమీద వున్న బల్బ్‌ని చూడూ ఎలా పగలగొడ్తానో...?

బామ్మ : (అప్పుడే వంటింట్లోంచి బయటికి వచ్చి గోపీ చెయ్యి పట్టుకుని) ఎన్నిసార్లు చెప్పాలి గోపీ? మీరు ఇంట్లో బాల్ ఆట ఆడుకోవద్దని! పైగా బాల్‌తో బల్బ్‌ని పగలగొడ్తానంటావా ?వెళ్ళి బయట ఆడుకో! (బామ్మ గోపీ రెక్క పుచ్చుకుని బయటికి లాక్కెళ్తూ వుంటుంది, గోపీ గింజుకుంటూ:)

గోపి : బామ్మా ! అన్యాయం బామ్మా ! బయట ఆడుకుంటామంటే ఎండ వుందంటావు ? ఇంట్లో ఆడుకుంటామంటే వొద్దంటావు ! అటు ఇంట్లో ఆడుకోనీరూ, ఇటు బయటా ఆడుకోనీరు ! ఇదెక్కడి న్యాయం!? ఈ అన్యాయం నేను సహించలేను ! ఒరేయ్ రవీ- చూస్తావేరా... మనం స్ట్రయిక్ చేద్దాం! పెద్దల అన్యాయం నశించాలి! పిల్లలకి స్వేచ్ఛ నివ్వాలి! బుజ్జీ నానీ! కమాన్, మీరూ అరవండి ఊఁ కమాన్ !

బుజ్జి,నాని : పెద్దల అన్యాయం నశించాలి ! పిల్లలకి స్వేచ్ఛనివ్వాలి ! పెద్దల అన్యాయం నశించాలి!

పిల్లలకి స్వేచ్ఛ నివ్వాలి !

రాజారావు : (స్నానం ముగించి అప్పుడే హాల్లోకి వస్తూ) భేష్! స్లోగన్స్ బాగున్నాయిరా! నేను కూడా జాయిన్ అవనా మీ స్ట్రయిక్‌లో!

గోపి : మీరెందుకు డాడీ ! ఇది పిల్లలకే పరిమితం !

రాజారావు : ఒరేయ్, ప్లీజ్.... నన్నుకూడా మీలో కలుపు కోండిరా! నాకు సెలవులున్నా - యింతే! మీ మమ్మీ నన్ను సెలవుల్లో కూడా రెస్ట్ తీసు కోనీదు! పొద్దున్నే లేవాలంటుంది. టైం ప్రకారం తినాలంటుంది! ఒకటేమిటీ - సవాలక్ష!! నాకూ మీలాగే స్వేచ్ఛ లేదు ! నన్నూ జాయిన్ చేసుకోండిరా !

నాని : అంతా ఉత్తదే ! ఒరేయ్ అన్నయ్యా, డాడీ అన్నీ అబద్ధాలు చెప్తున్నారు గానీ డాడీని మన జట్టులో జాయిన్ చేసుకోవద్దు!

రాజారావు : అంతేనా ? అయితే నేను మీ దగ్గర ఎందుకూ? మమ్మీ దగ్గరికే వెళ్తాను ! మమ్మీ జట్టే వుంటాను!

(రాజారావు వంటింట్లోకి వెళ్ళిపోగానే - గోపీ తాతయ్య చేతివూత కర్ర మైక్‌లా తన నోటి ముందు పెట్టుకుని:)

గోపి : సోదర సోదరీమణులారా మన విలువైన హాలీడేస్‌లో మొదటిరోజు మనకు నీరసంగా - నిస్సారంగా గడిచిపోయింది ! హాలిడేస్ అన్నీ

ఇలాగే వుండేట్టయితే - మనం స్ట్రైక్ చేయాలి!

తాతయ్య : (ప్రవేశిస్తూ) భలే భలే ! వీధుల్లోనే అను కున్నాను... ఏకంగా ఇంట్లోకే వచ్చేశాయ్ స్ట్రైకులు ! ఊఁ గోపీ, నీ ఉపన్యాసం బావుంది! క్యారీ ఆన్ !

గోపి : సోదర సోదరీమణులారా రేపటినుండి మన పేరెంట్స్ మనకి స్వేచ్ఛనిచ్చారో సరి ! లేక పోతే....

తాతయ్య : ఊఁ లేకపోతే...

గోపి : నిరాహారదీక్ష చేస్తాం ! మా హక్కులు సాధించు కుంటాం !

తాతయ్య : అబ్బో నిరాహారదీక్షే ! బావుంది బావుంది ! అప్పుడెప్పుడో నలభయ్యేళ్ళ కిందట స్వాతం త్ర్యం కోసం చేశాను నిరాహారదీక్ష ! మళ్ళీ నా వంశోద్ధారకులు మిమ్మల్ని... ఇన్నాళ్ళకి ఇలా చూస్తున్నాను!

(కాసేపు వాసన పీలుస్తున్నట్టు నటించి) ఏమిటిది ఏదో వాసన కమ్మగా వస్తోన్నట్లుందే! ఓహో వంటింట్లో మీ మమ్మీ చేగోడీలూ, పకోడీలూ చేస్తోన్నట్టుంది!

గోపి : (ఊత కర్ర మైకుని ఒక్కుదుటున కిందపడేసి:) అవునా!? ఒరే రవీ, పదరా వంటింటి మీదకు దండెత్తుదాం !

(గోపీ వంటింట్లోకి పరుగెడ్తాడు! రవి కూడా

అతన్ని ఫాలో అవుతూంటే తాతయ్య అతడి రెక్క పట్టుకుని ఆపి:)

తాతయ్య : ఏరా రవీ, ఎక్కడికి వెళ్తున్నావ్ ? నువ్వు స్నానం చేయలేదుకదా, ముందు స్నానం చేసిరా!

రవి : ఇదిగో వెళ్తున్నాను తాతయ్యా! (వెళ్తూ వెళ్తూ తలను సబ్బుతో రుద్దుకుంటున్నట్లు ప్రిటెండ్ చేస్తూ) లైఫ్‌బాయ్! లైఫ్‌బాయ్ ఎక్కడ వుందో ఆరోగ్యం అక్కడవుందీ....

తాతయ్య : ఏం అడ్వర్టయిజ్‌మెంట్లో ఏమిటో ? టీవీలోనే భరించలేక చస్తున్నామంటే - వీళ్ళు ఇంట్లో కూడా మొదలెట్టారు !

బామ్మ : (ప్రవేశించి తాతయ్యతో) ఏమండీ, ఈ కత్తెర సరిగా పనిచేయట్లేదు! దీనికి పదును పెట్టించుకు వస్తారా?

నాని : ఏదీ కత్తెర ? అది బాగానేవుంది బామ్మా.

(బామ్మ చేతుల్లోంచి ఆ కత్తెర లాక్కుని టేబుల్ దగ్గరికివెళ్ళి:)
చూడూ ఇదెంత బాగా కట్ చేస్తుందో!?

(అంటూ టేబుల్ క్లాత్‌ని కట్ చేస్తుంది)

బామ్మ : అయ్యో అయ్యో ! అదేమిటే !? అంత పనిచేసావ్ ? నిన్ననే ఆ టేబుల్ క్లాత్ కొన్నది మీ మమ్మీ! అప్పుడేదాని పని పట్టించావ్! బంగారం లాంటి టేబుల్ క్లాత్ కత్తిరించడానికి - మనస్సెలా ఒప్పిందే !?

బుజ్జి : చూడు బామ్మా! నానీ కాగితాలన్నీ చింపి ఎలా పోగులు పెట్టిందో. పైగా ఫ్లోర్ మీదంతా హార్లిక్స్ ఒలకపోసింది! కాళ్ళకి అంతా గమ్‌లా ఎలా అంటుకుంటోందో....!?

రజని : నువ్వేం తక్కువ తిన్నావనీ - దానిమీద చాడీలు చెప్తున్నావ్! డబ్బాలూ దువ్వెనలూ గ్లాసులూ పుస్తకాలూ అన్నీ ఇంటినిండా చిందరవందరగా ఎలా పడేసావో ?

బామ్మ : చాల్లే ! అందరికన్నా పెద్దదానివి! మరి నువ్వేం చేస్తున్నట్టు? వాళ్ళతో సమానంగా వాదులాడు కోకపోతే - లేచి, ఆ సామాన్లవీ సర్దొచ్చుగా! లే - సర్దు !

రజని : (నీరసంగా అయిష్టంగా) లేస్తున్నాను బామ్మా!

బామ్మ : చూడూ వాళ్ళందరినీ తీసుకొని డైనింగ్ హాల్‌కి రా, పదకొండవుతోంది. ఇంకా బ్రేక్ ఫాస్టయినా చేయలేదు.

రజని : అలాగే బామ్మా!
(నానీ కింద కూర్చుని గాలిపటంతో ఆడు కుంటూ వుంటుంది! బుజ్జీ రివ్వున వచ్చి ఏదో పొర బాటున తగిలినట్టు కావాలని కాళ్ళతో తన్ని గాలిపటాన్ని చింపేస్తుంది!)

నాని : (ఏడుస్తూ) చూడు తాతయ్యా! బుజ్జీ నా గాలిపటం చింపేసింది. నాకింకో గాలిపటం కావాలీ... ఈ..... ఈ.... ఈ......

బుజ్జి : తాతయ్యా, నువ్వు నానీకి గాలిపటం కొనిచ్చావంటే - నాక్కూడా ఇంకో గాలిపటం కొనివ్వాలి!

నాని : నీకెందుకు? వీల్లేదు తాతయ్యా! బుజ్జికేం కొనివ్వొద్దు! అది కావాలని నా గాలిపటం చింపేసింది. నాకే కొనివ్వాలి!

బుజ్జి : నాక్కూడా కొనివ్వాలి!

తాతయ్య : ఇద్దరికీ కొనిస్తాలేరా - గొడవపడకండి!

నాని : ఇద్దరికీ వద్దు తాతయ్యా, నాకే కొనివ్వాలి! బుజ్జిక్కూడా కొనిచ్చారంటే నాకు రెండు కొనివ్వాలి!

బామ్మ : వీళ్లు ఇటు స్నానం చేయలేదు. అటు తల దువ్వుకోలేదు. ఇంటికి ఎవరైనా గెస్ట్లు వస్తే ఏమనుకుంటారు. ఏం పాడు పిల్లలో ఏమో!? (తాతయ్యని చూసి) మీరూ వున్నారు ఎందుకు? వాళ్ళను అదుపులో పెట్టరు సరి కదా,వాళ్ళతో పాటు ఆడుకోమంటే ఎంచక్కా గోళీకాయలు కూడా ఆడ్తారు!

తాతయ్య : (బామ్మ వంక కన్నుగీటి) చూడూ... వీళ్లనిప్పుడు ఎలా రెడీ చేస్తానో (పిల్లలవంక తిరిగి) చూడండి పిల్లలూ, నేనిపుడు జూకి వెళ్తున్నాను మీలో ఎవరు తొందరగా తయారైతే వాళ్ళని తీసుకెళ్తా! ఊఁ క్విక్.

నాని : తాతయ్యా, జూ కి నేనొస్తాను తాతయ్యా!

(అప్పుడే వంటింట్లోంచి వచ్చిన సునందతో) మమ్మీ, నాకు తల దువ్వు మమ్మీ!

బుజ్జి : (పరుగున వెళ్ళి దువ్వెన తీసుకొచ్చి సునంద కందిస్తూ) ముందు నాకు దువ్వు ఆంటీ!

నాని : ఏంకాదు ! ముందు నాకే దువ్వాలి!

రవి : మీ ఇద్దరికీ కాదు. ముందు నాకు దువ్వండి ఆంటీ!

రజని : ఊహూ నాకు....

సునంద : ఓకే ! మీరంతా ముందు క్యూలో నించోండి! మీ హైట్ ప్రకారంగా తల దువ్వుతాను! అందరికన్నా చిన్న నానీ ముందు, తర్వాత బుజ్జి, ఆ తర్వాత గోపీ, రవీ, రజనీ - ఓకేనా!

(అందరు పోలోమని సునంద చెప్పినట్టు క్యూలో నించుంటారు. ఇంతలో బయట నుండి 'ఐస్క్రీం ఐస్క్రీం' అని కేకలు విని పిస్తాయి. నానీ క్యూలోంచి జారుకుంటూ:)

నాని : తాతయ్యా నాకు ఐస్క్రీం !

బుజ్జీ : నాకూ ఐస్క్రీం !

నాని : నాకు స్టార్ ఐస్క్రీం !

బుజ్జి : నాకు మిల్క్ ఐస్క్రీం !

తాతయ్య : (వాళ్ళ అటెన్షన్ డైవర్ట్ చేయడానికి) ఇదిగో పిల్లలూ మీకు నేను ఎన్ని బెలూన్స్ కొనుక్కొచ్చానో ! ఎర్రదీ, పచ్చదీ, బ్లూది -

మీకు ఏదీ కావాలి ?

బుజ్జి : నాకు ఎఱ్ఱదీ !

నాని : నాకూ ఎఱ్ఱదే !

బుజ్జీ : నాకూ ఎఱ్ఱ బెలూనే కావాలి !

తాతయ్య : అరే బాబా ! ఇక్కడ ఎఱ్ఱబెలూన్ ఒక్కటే కదా వుంది! అందుకని ఈ ఎఱ్ఱబెలూన్ అందరికన్నా చిన్నది - నానీ వుందికదా - దానికిస్తాను.

బుజ్జీ : ఊఊ... నాక్కూడా ఎఱ్ఱదే కావాలి.

సునంద : (విసుక్కుంటూ) ఏం సెలవులో ఏమిటో ? నా ప్రాణాలు తోడేస్తున్నారు! అసలు వీళ్ళని అని ఏం లాభం? వీళ్ళ స్కూల్ వాళ్ళని అనాలి... చీటికీ మాటికీ సెలవులు ఎందు కిస్తారో! వీళ్ళకి అసలు సెలవులే వుండకపోతే ఎంత బావుణ్ణు!

బామ్మ : అది కాదమ్మా సునందా, మనకున్న ఒకరిద్దరు పిల్లల అల్లర్నే ఒకటి రెండు రోజులు భరించ లేకుండా వున్నాం కదా ! మరి క్లాసులో మన పిల్లల్లాంటి పిల్లల్ని రోజూ టీచర్లు ఎలా భరిస్తు న్నారో ఒక్కసారైనా ఆలోచించామా ?

గోపి : అయినా, మమ్మీ... నాకు తెలీక అడుగు తాను... మేము స్కూల్‌కి వెళ్లినన్ని రోజులూ మీకు సెలవులేకదా! ఎంచక్కా ఇంట్లో రెస్టు తీసుకుంటారు కదా ! ఇన్నాళ్లూ మేం బుద్ధిగా

చదువుకోలేదా ? మాకు వుండేవే వారం రోజుల సెలవులు! ఈ సెలవుల్లో కూడా అల్లరి వద్దంటే ఎలా మమ్మీ ?

రజని : యురేకా! ఇప్పుడు అర్థమైంది. అసలు ఈ సెలవులు మీకూ కాదు... మాకూ కాదు మమ్మీ... మమ్మల్ని భరిస్తోన్న మా టీచర్స్‌కి ! కదూ తాతయ్యా !?

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*

***(22-11-1990)***

# ఇన్విజిలేషన్



(విద్యార్థులు రెండు వరుసల్లో - టెంత్‌క్లాస్ ఎగ్జామ్స్ రాస్తూ వుంటారు. ఒక్కో వరుసలో ఐదుగురు చొప్పున మొత్తం ఆ హాల్లో పది మంది విద్యార్థులు ఉంటారు. ఒక వరుసలో రాముూ - అతడి ముందు రవీ, గోపీ, సురేష్, జాన్ వుంటారు. రెండో వరుసలో చివర ఆనంద్- అతడిముందు  అబ్దుల్, నిర్మల్, చేతన్, కరీమ్  వుంటారు! ఆ రెండు వరుసల మధ్య - గోపాలరావు మాష్టారు ఇన్విజిలేషన్

చేస్తూ వుంటారు.)

రవి : సార్ ! అడిషనల్ పేపర్ !

(గోపాల్‌రావు అడిషనల్ పేపర్ అందించి - ఆ హాల్లో అటూ ఇటూ పచార్లు చేస్తూ వుంటారు ! ఆయన వెనక్కి వెళ్ళగానే - ముందు వాళ్ళూ - ముందుకీ వెళ్ళగానే వెనక వాళ్ళూ - చేతి సైగలతో, గుసగుసల్తో - రక రకాల విన్యాసాలతో మాట్లాడుకుంటూ వుంటారు)

గోపాలరావు : (ఉన్నట్టుండి వెనక్కి తిరిగి) ఏమిటా గుస గుసలు? సరిగ్గా కూర్చోండి!

(ఆ మాటవిని - స్టూడెంట్స్ కాస్త సర్దు క్కూర్చుంటారు ! కాని - రామూకి జవాబులు రాయటం కష్టంగా వుంటుంది ! అస్తమానం తనముందున్న రవి పేపర్లోకి తొంగి చూస్తూ వుంటాడు)

గోపాలరావు : సరిగ్గా కూర్చుని తిన్నగా రాయలేవూ ?

రామూ : చూసి రాస్తేనే పాసవుతానన్న నమ్మకం లేదు సార్! ఇక చూడకుండా రాస్తే ఏం పాసవు తానూ?

గోపాలరావు : మైండ్ యువర్ ఓన్ బిజినెస్ !

(రవి ముందు కూర్చున్న గోపీ పరిస్థితి అలాగే వుంటుంది ! అతడు మెల్లిగా తన షూ లోంచి

స్లిప్ తీసి తన తొడల మధ్య పెట్టుకుని కాపీ రాస్తూ వుంటాడు. రెండో వరుసలో అందరికన్నా ముందు కూర్చున్న కరీమ్ కాలర్ మడతల్లోంచి స్లిప్ తీసి - కాపీ రాస్తూ వుంటాడు.)

గోపాలరావు : మీ దగ్గర స్లిప్స్ వుంటే - మర్యాదగా ఇప్పుడే ఇచ్చేయండి ! ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చిందంటే మీకే కష్టం !

(ఇంతలో ఎవరో స్లిప్‌ని చిన్న రాయికి కట్టి - అది సురేష్‌కి అందేలా మీదకి విసిరేస్తారు! సురేష్ అటూ ఇటూ కలయచూసి - ఇన్విజిలేటర్ చూడనపుడు దాన్ని గబుక్కున చేజిక్కించుకుని ప్యాడ్ కింద పెట్టుకుని... మధ్య మధ్య ప్యాడ్ ఎత్తి ఆ స్లిప్ చూసి కాపీ చేస్తూ పరీక్ష రాస్తూ వుంటాడు. అది గోపాల రావు కంటబడి:)

గోపాలరావు : ఏయ్ ! ఏమిటదీ ? ఇటివ్వూ ! (అంటూ సురేష్ రాస్తూన్న స్లిప్ తీసుకుంటాడు) చూడూ, ఇది లాస్ట్ వార్నింగ్ ! మళ్ళీ నువ్విలా రాస్తూ కన్పించావో నేనిక ఊరుకోను !

సురేష్ : మీ పిల్లల్లాంటివాళ్ళం సార్ !? కాస్త కనికరించండి సార్ ! ఇంత స్ట్రిక్ట్ అయితే ఎలాసార్ ! కాస్త దయచూపండి సార్ !

గోపాలరావు : సైలెన్స్ ! ఇంకా మాట్లాడావంటే పేపర్ లాగేసుకుంటాను, జాగ్రత్త!

నిర్మల్ : చేతన్, రెండో ప్రశ్నకు జవాబు చెప్పరా ? (అతడి ముందు కూర్చున్న చేతన్ మాట్లాడడు!)

నిర్మల్ : ఒరే చేతన్, నీకు సినిమా చూపిస్తాన్రా! చెప్పరా, రెండో ప్రశ్నకి సమాధానం!
(చేతన్ అప్పటికీ మాట్లాడడు)

నిర్మల్ : చెప్పవు కదా ! సరే - నువ్వు బయటికి రారా - నీ సంగతి చూసుకుంటాం!

కరీమ్ : వాడు తనో పెద్ద క్లెవర్‌నని బాగా గర్వంరా !

గోపాలరావు : అబ్బబ్బ ! ఏమ్మాట్లాడ్తూంటారోయ్ అస్తమానం! సరిగ్గా కూర్చుని పరీక్ష రాయండి !

అబ్దుల్ : (మాస్టార్ పైకి తిరగబడ్తూ) అరే చుప్ బైఠో ! జబ్ సే చిల్లారే ! (స్లీవ్స్ పైకి మడుచుకుంటూ) క్యా సమ్‌జే హమ్ లోగోంకో!?
(అదే సమయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ జీప్ సౌండ్ హాల్లోకి వినిపిస్తుంది. బయట కాపీలు అందించడానికి వెయిట్ చేస్తోన్న పిల్లల ఈలలూ - కేకలూ... ఓ...ఓ... అరుపులూ... హాల్లోకి వినిపిస్తాయి ! ఎక్కడి వాళ్ళక్కడ కాపీ రాస్తోన్న పిల్లలు వాళ్ళ దగ్గర వున్న చిట్టీలు - అటూ ఇటూ విసిరేస్తారు. సూపరింటెండెంట్‌తో పాటు లోపలికి వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఒక్కొక్కర్నే చూస్తూ వుంటాడు! సురేష్‌ని లేపితే అతడి దగ్గర ఏమీ దొరకదు !

గోపీనీ లేపేసరికి అతడు- తన తొడల మధ్య వున్న చిట్టీని అతి నేర్పుగా తీసుకుని గబుక్కున నోట్లో వేసుకుంటాడు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి అది గమనించి:)

ఫ్లైయింగ్ స్క్వాడ్
అధికారి : ఏమిటదీ ! ఊసెయ్ !
(గోపీ భయంతో గబగబా మింగేయడానికి అవస్థలు పడ్తూ వుంటాడు...

ఫ్లైయింగ్ స్క్వాడ్
అధికారి : ఏయ్ మిస్టర్ ! ఏమిటదీ ? ఏం తింటున్నావ్?

గోపి : ఏ... ఏ.... ఏమీ లేదుసార్ ! చాక్లెట్! (అంటూ జేబులోంచి ఒక చాక్లెట్ తీసి చూపిస్తాడు)

ఫ్లైయింగ్ స్క్వాడ్
అధికారి : చాక్లెట్ తినడానికి ఇది ఇల్లా - పరీక్ష హాలా!? సిట్ రైట్!
(ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి రాము దగ్గరికి వెళ్ళగానే - అంతవరకూ కర్చీప్ కింద పెట్టుకుని కాపీ రాస్తోన్న రామూ ఆ స్లిప్‌ని గబుక్కున టక్ చేసిన తన షర్ట్ లోపల దూర్చేస్తాడు)

ఫ్లైయింగ్ స్క్వాడ్
అధికారి : ఏమిటదీ ? - ఆ స్లిప్ బయటికి తీసేయ్ - ఊఁ కమాన్ తీసేయ్.
(రామూ సిగ్గుపడ్తూ - మెలికలు తిరిగిపోతూ వుంటాడు. ఇన్విజిలేటర్ రామూ టక్ లాగేయ

గానే ఒక్కసారిగా చిట్టీలన్నీ కిందపడ్తాయి)

ఫ్లైయింగ్ స్క్వాడ్ : ఇన్విజిలేటర్ ! ఇతడి దగ్గర చిట్టీలు దొరికాయి! అతడు పరీక్ష రాయకుండా అతడి పేపర్ తీసుకోండి !

రాము : సార్ ! సార్ ! తప్పయిందిసార్ ! ఇంకోసారిలా చేయనుసార్! ఈ ఒక్కసారికి క్షమించండి సార్!

ఫ్లైయింగ్ స్క్వాడ్ : ఛీఫ్ సూపరింటెండెంట్ ! పదండి ! ఆ అబ్బాయిని తీసుకుని ఆఫీస్‌కి పదండి - అతణ్ణి డిబార్ చేయాలి!

రామూ : సార్ ! ప్లీజ్ సార్ !

ఫ్లైయింగ్ స్క్వాడ్ : షటప్ !

(ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ రామూతో సహా ఆ హాల్లోంచి వెళ్ళిపోతాడు)

గోపాలరావు : నేను ముందే చెప్పాను, విన్నారా ? వచ్చిందేదో రాయండీ.... కాపీ కొట్టొద్దూ అంటే - ఒక్కరైనా విన్నారా అసలు? ఇప్పుడు చూడండి రామూ ఎలా డిబార్ అయ్యాడో!?

గోపి : (మాస్టారు మాటల్ని లక్ష్యపెట్టకుండా)... అరేయ్! ఫ్లయింగ్ స్క్వాడ్ వెళ్ళిపోయారు ! మనమిక నిశ్చింతంగా కాపీ రాసుకోవచ్చు !

సురేష్ : ఇదిగో ఈ చిట్టీ తీసుకో ! ఇది ఆరో ప్రశ్నకి జవాబు!

గోపాలరావు : మళ్ళీ మొదలైందా ? - ఏమిటా చిట్టీ ? ఇటివ్వు!

సురేష్ : నేనివ్వను సార్ !

గోపాలరావు : అరేబాబా ! ఫ్లైయింగ్ స్క్వాడ్ వాళ్ళు ఇంకా ఇక్కడే వున్నారు ! వాళ్ళు ఏ నిముషంలోనైనా మళ్ళీ రావచ్చు !

సురేష్ : వస్తే రానీండి ! నేను మాత్రం ఛస్తే ఇవ్వను !

కరీం : సర్ ! చిన్న రిక్వెస్ట్ ! మీలాంటి వాళ్ళకి ఇలాంటి చెడు విషయాలు నచ్చవ్‌గానీ - మీరీ హాలు బయట నించుంటే బావుంటుందేమో?

సురేష్ : సార్ ! నాది మరో రిక్వెస్ట్ ! అంతకన్నా మీరు.... అదిగో - ఆ డోర్ దగ్గర నిలబడి - ఫ్లైయింగ్ స్క్వాడ్ వాళ్ళు వస్తున్నారో లేదో చూసి చెప్తే ఇంకా సంతోషిస్తాం !

గోపాలరావు : వాడ్డూయు మీన్ ! నేనున్నదిక్కడ మిమ్మల్ని వాచ్ చేయడానికా లేక ఫ్లైయింగ్ స్క్వాడ్‌నా? హౌ డేర్ యు ఆర్ !

రవి : సర్ అడిషనల్ పేపర్ !

(గోపాలరావు అడిషనల్ పేపర్ రవికి అందిస్తాడు. అదే సమయంలో ప్యూన్ మంచి నీళ్ళు అందించే నెపంతో లోపలికి వచ్చి, గోపాలరావు చూడకుండా - జాన్‌కి చిట్టీ అందించి వెళ్ళిపోతాడు - కరీం దుబాయి

పోవాలనుకుంటాడు. అతడికి ఎస్సెస్సీ క్వాలిఫికేషన్ వుంటేనే మంచి జాబ్‌దొరకుతుంది - అందుకు అతడు ఇన్విజిలేటర్‌ని బతిమాల్తూ వుంటాడు.)

కరీం : ఆప్‌కా పైర్ పడ్తూం, ముజే నకల్ లిఖ్‌నే దేవో సార్ ?

గోపాలరావు : నో టాకింగ్ ప్లీజ్ !

కరీం : అగర్ మై పాస్ హువాతో మై మస్కట్ జావూంగా! వహా ముజే అచ్చీ నౌకరీ మిలేగా సార్ !

గోపాలరావ్ : ఐసే డోంటాక్ !

(ప్రమోషన్ కొరకై జాన్ పరీక్ష రాసన్తూ వుంటాడు)

జాన్ : నేను ఈ పరీక్ష పాసైతే నాకు ప్రమోషన్ వస్తుంది సార్ ! మీరు దయచూపకపోతే ఎలా సార్ ! మీరు కొంచెం చూసీ చూడనట్టు వుండాలి సార్! మిమ్మల్ని ఎవరూ ఏమీ అనకుండా - మీ మీదికి ఏమీ రాకుండా మేం చూసుకుంటాంసార్ !

గోపాలరావు : సైలెన్స్ ప్లీజ్ !

జాన్ : ఏంటిసార్ !' పే... ద్ద' స్ట్రిక్ట్ చేస్తున్నారు ! మీరు కాపీ కొట్టకుండానే పాసయ్యారా ?

గోపాలరావు : నాకా ఖర్మేం పట్టలేదు !

జాన్ : ఆ... అందరూ.... అవసరం తీరాక... ఇలాగే చెప్తారు ! హెఁ ఎవరికి తెలియదనీ !

కరీం : హమ్‌కో మర్యాదాసే లిఖ్ నే దేతే యా నహీ?

గోపాలరావు : నహీఁతో.... ?

(కరీం గోపాలరావుని కొట్టడానికి చెయ్యెత్తిన సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి:)

ఫ్లైయింగ్ స్క్వాడ్ : ఏయ్ - ఏమిటీ దౌర్జన్యం ! ఏదీ - నీ పేపర్ ఇటివ్వు ! పద - ఆఫీస్ రూంకి !

(ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తనతోపాటు కరీంని లాక్కెళ్తూ వుంటాడు)

కరీం : సర్ సర్ ! ముజ్ సే గల్తీ హువా ! మాఫ్ కరో సార్!

ఫ్లైయింగ్ స్క్వాడ్ : షటప్ ! నథింగ్ డూయింగ్ ! కమాన్ !

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక -*

***(15-11-1990)***

# స్కూల్ డే

అందరికీ వంకలు పెట్టే ఆకతాయికి సరైన గుణపాఠం !



మదన్ : అబ్బ ! ఈ చీఫ్‌గెస్ట్ రావడమే రెండు గంట ల్లేటు! ఇప్పుడు అరగంట నుండి స్పీచ్ దంచేస్తున్నాడు! ఈయన స్పీచ్ వినే ఓపిక ఎవరికుంటుంది ?

రాజా : మనలాంటి స్టూడెంట్స్ వచ్చేదే ఈ డ్రామాలూ, డ్యాన్సులూ చూడటానికి ! ఈ ఉపన్యాసాలు ఎవడిగ్గావాలీ ?

(ఉపన్యాసం భరించలేనట్టుగా... స్టూడెంట్స్ రకరకాల పోజులతో విసుగ్గా వుంటారు.. అర క్షణం గడిచాక....)

సోమూ : ఒరేయ్... ఈలలూ... విజిల్స్‌తో చీఫ్‌గెస్ట్‌ని హడలగొడ్దామా ?

వెంకట్ : రెడీ.... వన్... టూ.... త్రీ !

(స్టూడెంట్స్ ఈలలతో గోలచేస్తారు)

మదన్ : (నీరసంగా) ఇంకా చీఫ్‌గెస్ట్ దిగిపోవడం లేదే మిత్రా ?

రాజూ : ఈయనెవరో గట్టి పిండంలా వున్నాడు ! ఇంకాస్త అల్లరి చేద్దామా?

సోమూ : చేద్దాం ! చేద్దాం !

మదన్, రాజూ, సోమూ, వెంకట్ : ఓ...ఓ...ఓ...! ఓ...ఓ...ఓ..!

(అలా 'ఓ' రాగాన్ని అర నిమిషం పొడిగిస్తారు! అది కూడా పనిచేయకపోవడంతో కంటిన్యుయస్‌గా ఆగకుండా చప్పట్లు కొడతారు)

మదన్ : (స్టేజీ వంక చూసి, ఉన్నట్టుండి.... సంతోషంగా) అమ్మయ్య ! దిగిపోతున్నాడ్రా చీఫ్‌గెస్ట్! (కాసేపు నిశ్శబ్దం ! ప్రేక్షకులంతా స్టేజివంక దీక్షగా చూస్తూ వుంటారు. ఉన్నట్టుండి తెర వెనుకనుండి... చిన్న అనౌన్స్‌మెంట్:
'ప్రేక్షక మహాశయులకి నమస్కారం ! ఒక అయిదు నిమిషాల్లో కల్చరల్ ప్రోగ్రాం మొదలౌతుంది !')

మదన్ : అరేయ్.... అరేయ్.... కల్చరల్ ప్రోగ్రాం స్టార్ట్ కాబోతోందిరా !
(సంతోషంతో ఒకర్నొకరు కొట్టుకుంటూ - వీపులు చరుచు కుంటూ - కుర్చీలపై మోతలు మోగిస్తూ వుంటారు)

సోమూ : (కళ్ళప్పగించి చూస్తూ) ఆ అమ్మాయి డాన్స్ ఫర్వాలేదు కదూ !

వెంకట్ : పోన్లే పాపం ! చప్పట్లు కొడ్దాం ! పొంగిపోతుంది! తనేదో బాగా చేసిందనుకుని మురిసిపోతుంది!

(తెరవెనుక నుండి అనౌన్స్‌మెంట్: 'ఇప్పుడు ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ ! చిన్నపిల్లల డ్యాన్స్')

మదన్ : ఒరేయ్... స్టేజీపైకి ఇంకో పాప వచ్చింది. యల్కేజీ పాప కాబోలు! ముద్దుగా... బొద్దుగా వుంది ! ఏం పెట్టి పోషిస్తున్నారోగానీ !

రాజూ : అబ్బ ! ఆ పాప అంత లావుగా వుంది - కదా! ఆ పాప డాన్స్ చేస్తుందంటావా ?

సోమూ : అదిగో - అలా అన్నావో లేదో... పాపం, బెదిరి వెనక్కిపోతోందిరా!

వెంకట్ : తెర పక్కన - ఆ చేతులు ఎవరివీ ?

మదన్ : వాళ్ళ టీచర్‌విరా ! ఆ పాపని స్టేజీ మీదికి తోస్తోంది!

రాజూ : అసలే ఆ పాప బెదిరిపోతూంటే ఈ టీచర్ హడావిడేమిట్రా ?

సోమూ : చూడబోతే... ఆ పాప బదులు... ఈవిడగాని డాన్స్ చేయదు కదా !

(మళ్ళీ అనౌన్స్‌మెంట్ : 'నౌ ఇంగ్లీష్ ప్లేలెట్!')

మదన్ : అబ్బ ! ఇంగ్లీష్ నాటిక ! ఇదో బోర్ ! ఈ ఇంగ్లీష్‌మీడియం వాళ్ళకేం పనివుండదు !

రాజా : అసలిది ఎవరికి అర్థమవుతుంది ? 'పే...ద్ద' వాళ్ళకే ఇంగ్లీష్ వచ్చని పోజులు కాకపోతే!

సోమూ : ఒరేయ్.... నాదో అనుమానం ! ఇంతకీ ఈ ఇంగ్లీష్ డైలాగ్స్ ఈ పిల్లలవేనా ? లేక వెనుక నుండి ఎవరైనా మాట్లాడుతున్నారా ?

వెంకట్ : అరేయ్... ఈ ఇంగ్లీష్ డ్రామాలప్పుడు మనం కాస్త కునుకుతీయవచ్చు! ఏమంటార్రా ?

రాజూ, సోమూ: (బుర్రలూపుతూ) అంతే.. అంతే!

(కుర్చీలపై రిలాక్స్‌డ్‌గా కొందరూ, చూడటం ఇష్టంలేనట్టుగా మరికొందరూ చేరగిలపడ్తారు! అంతలో తెర వెనుకనుండి మళ్ళీ అనౌన్స్‌మెంట్: "ఇక కొద్ది నిమిషాల్లో డిస్కో... డాన్స్!")

మదన్ : (చెంగున కుర్చీపైకి గెంతి) అదిగో ! డిస్కో డాన్స్‌ట్రా!

రాజూ, సోమూ, వెంకట్ : (ఒక్కుదుటున లేచి) అవునా !?

(విజిల్స్ వేసి - ఎగిరి గంతేస్తారు ! రాజూ కుర్చీ ఎక్కి నోరప్పగించి చూస్తూ వుంటాడు ! సోమూ మునివేళ్ళపై ఎగిరెగిరి, కళ్ళప్పగించి

చూస్తూ వుంటాడు ! వెంకట్ ఆ ఇద్దరి తలల్నీ ఎడం చేస్తూ - వాళ్ళ తలల మధ్య నుండి చూస్తూ వుంటాడు)

మదన్ : డిస్కో డాన్స్ బ్రహ్మాండంగా వుందిరా !

రాజూ : డ్రెస్ కన్నా లైటింగ్ బ్రహ్మాండంగా వుందిరా!

సోమూ : లైటింగ్ కన్నా స్టెప్స్ అమోఘంరా !

వెంకట్ : స్టెప్స్‌కన్నా పాట బావుందిరా !

(ఇంతలో 'సతీష్' అనే మరో స్టూడెంట్ అక్కడికి వచ్చి - వాళ్ళ కి స్టేజీ కన్పించకుండా అడ్డంగా నిలబడి ప్రోగ్రాం చూస్తూ వుంటాడు!)

మదన్ : (సతీష్‌ని చూసి) హలో సత్తిగా ! నువ్వొ వొచ్చావ్ - ఈ స్కూల్‌డే కల్చరల్ ప్రోగ్రాంకి ? నీకెన్నిసార్లు చెప్పాల్రా ? ఎక్కడికైనా వెళ్ళేముందు కడుపు నిండా మెక్కిరావొద్దనీ! దూరం నాయనా దూరం! నీ బొజ్జ తగిలి నాలాంటి బక్క ప్రాణాలు కింద పడగలవు!

(తెర వెనుకనుండి మళ్ళీ అనౌన్స్‌మెంట్: 'ఇప్పుడు పికాక్ డాన్స్')

వెంకట్ : ఒరేయ్ సోమూ, అరేయ్ రాజూ.... సత్తిగా- అటు చూడండ్రా ! నెమిలిడాన్స్ ఎంత బావుందో!? ఆ మ్యూజిక్.... సింప్లీ సూపర్బ్! ఇంతకీ నెమిలిగా వేసింది ఎవరై వుంటారంటావ్? ఆ టెంత్ క్లాస్ పద్మజై వుంటుంది కదూ ! అబ్బే - కాదులావుంది !

బహుశ: ఆ రెండు జళ్ళ చంద్రకాంతై వుంటుంది!

సోమూ : కాదురా ! ఈ అమ్మాయెవరో ఈ స్కూల్‌కి కొత్త గా వచ్చినట్టుంది!

మదన్ : ఒరేయ్ సత్తిగా ! ఇలా రారా !
(సతీష్ దగ్గరికి వస్తాడు. అతడి బొజ్జ నిమురుతూ:)

మదన్ : ఒరేయ్, ఆ డ్యాన్స్ చూస్తూంటే ఆ డ్యాన్స్ కనుగుణంగా... లయబద్ధంగా డ్రమ్ము వాయించాలన్పిస్తోంది ! నువ్వేమీ అనుకోక పోతే బ్రదర్.. ఓ పావుగంట పాటు నీ బొజ్జ అరువిద్దూ!

సోమూ : అరెరే... నెమిలి డాన్స్ అయిపోయిందే ! ఛ-వెధవ! (సతీష్‌ని చూస్తూ) నేనసలే పొట్టి వాణ్ణి! గున్నేనుగులా నా ముందు నించున్నావ్! నీ బొజ్జ అడ్డం వచ్చి నేను డాన్సే చూళ్ళేక పోయా ! వన్స్‌మోర్ ! ఏయ్ పిల్లా ! వన్స్‌మోర్!

మదన్ : (వాచీ చూసుకుంటూ) ఒరేయ్.... నెమిలి డాన్స్ అయిపోయి పావుగంటయింది! ఇంకో ఐటమ్ జాడేలేదు ! చూడబోతే వీళ్ళు వాళ్ళ ప్రోగ్రాంని ఇప్పుడు సెట్ చేసుకుంటున్నారో ఏమోరా ?

రాజూ : అంతే అయివుంటుంది !

(తెర వెనుక నుండి: 'ఇప్పుడు జానపద నృత్యం')

| | | |
|---|---|---|
| సోమూ | : | ఈ అమ్మాయి ఇందాక క్లాసికల్ డాన్స్‌లో వుందీ... మళ్ళీ ఈ ఫోక్‌డాన్స్‌లో దూరిందీ! |
| వెంకట్ | : | బహుశః ప్రిన్సిపాల్ కూతురై వుంటుంది! |
| మదన్ | : | అంతే అంతే ! లేకపోతే ఒక్క పిల్లకే రెండు ఛాన్స్‌లేమిటీ ? |
| రాజూ | : | ఒరేయ్ 'బుగ్గే కందిపోయిందిలే' - ఈ పాట ఎవరు పాడుతున్నారో గానీ పాటకీ - డాన్స్‌కీ బొత్తిగా సంబంధం లేదురా - |
| సోమూ | : | అయ్యో ఖర్మ ! ఒక్క పాటకీ - డాన్స్‌కీ ఏమిటీ? మ్యూజిక్కీ, స్టెప్స్‌కీ అసలే సంబంధం లేదు! |
| వెంకట్ | : | పాడ్తోంది ఎవరోగానీ కీచుగొంతు పెట్టుకుని మహాధైర్యంగా పాడ్తోందిరా ! |
| మదన్ | : | పాట సంగతి అలా పోనిండీ గానీ - ఆ పాపకి పాపం కొప్పూడి పోతోందిరా ! కొప్పూడిపోతోంది! |
| రాజూ | : | అసలు ఇప్పుడు 'బుగ్గే కందిపోయిందిలే' అని పాడేకన్నా 'కొప్పే ఊడిపోయిందిలే' అని పాడ్తే బావుండేది కదరా ! |
| | | (అందరూ నవ్వుతారు, తెర వెనుకనుండి మళ్ళీ అనౌన్స్‌మెంట్: 'ఇహ కొద్ది క్షణాల్లో గ్రూప్ డాన్స్') |
| రాజూ | : | బాప్ రే - ఈ గ్రూప్ డాన్స్ - డాన్సా ? డ్రిల్లా? |
| సోమూ | : | కరెక్ట్‌గా చెప్పావు రాజూ ! దీన్ని నేర్పింది డ్రిల్ |

టీచర్ సునంద ! ఈ బోడి డాన్స్ చూడటానికి మా అక్కయ్యని బొట్టుపెట్టి మరీ పిలిచింది!

(మళ్ళీ అనౌన్స్‌మెంట్: 'ఇప్పుడు లాస్ట్ ఐటమ్- 'స్కూల్‌డే'! - తెలుగు నాటిక !')

మదన్ : అరేయ్ - ఈ నాటికలో హీరో వేషం వేసిన లలితని చూశావ్ కదా ! ఆమె వేసుకున్న ఆ చారల షర్ట్ ఎవర్దనుకున్నావ్ ? నాదిరా - నాది!

రాజూ : కొయ్ రా కొయ్ ! నీ డ్రెస్సులేమిటో నాకు తెలీదా - నువ్వు చెప్పగానే నమ్మడానికి ?

మదన్ : నిజం రా ! అది నాదే ! లలిత అడిగిందని - ఆమె కోసం ఒకటి కొత్తది కొని కుట్టించేశాను!

రాజూ : (అనుమానంగా) మొన్న అయిదు రూపాయలు అవసరానికి అడిగితే లేదన్నావ్? కొత్త డ్రెస్ కుట్టించడానికి నీకు డబ్బెక్కడిదిరా?

మదన్ : లలిత అడగడం - నేను కాదనడమేమిటని టెక్ట్స్‌బుక్స్ అమ్మేశాన్రా!

వెంకట్ : ఎంతయినా నువ్వు త్యాగశీలివి గురూ ! గత సంవత్సరం గర్ల్స్ స్కూల్లో చదివే గిరిజ - స్కూల్ డే కొరకు నన్ను అడిగిందని- మా అక్కయ్య పాత పట్టుచీర తీసికెళ్ళి ఇచ్చాను ! ఇక అంతే! ఆ తర్వాత ఆమె మళ్ళీ కన్పిస్తే ఒట్టు!

సోమూ : నేనూ అంతేరా ! ఒకసారి మా పక్కింటి మీనాక్షి పట్టుచీర అడిగిందని మా అమ్మ వొద్దంటున్నా విన్పించుకోకుండా నేనూ ఇచ్చాను ! దానికి

ఎన్ని రంగులు పూశారో తెలుసా ? అది అసలే తన పెళ్ళిచీరని మా అమ్మ ఎన్ని చిందులు తొక్కిందో? ఇక నీ షర్ట్ కూడా.... గోవిందో...

వెంకట్,రాజూ : గోవిందా !

మదన్ : నోర్మూయ్యండిరా ! అదిగో - ఆ తెలుగు నాటికలో హీరోయిన్ చూడండిరా - చప్పిడి ముక్కూ - పీచు జుట్టూ !

రాజూ : ఏంట్రా ? ఏం కూశావ్ ? ఆమె ఎవరను కున్నావ్ రా ! నా చెల్లెల్లా చెల్లెలు! (మదన్ని నాల్గు అంటించి) ఇంకోసారి మా చెల్లెల్ని ఏమన్నా అన్నావో - ఎముకలు విరిచేస్తాను జాగ్రత్త!

వినోద్ : (ప్రవేశిస్తూ) ఇంతసేపూ అందరికీ వంకలు బెట్టావ్? ఇప్పుడు నీ చెల్లెల్ని అంటే నీకంత పౌరుషం దేనికీ ? మిగతా ఆడపిల్లలు నీ చెల్లెల్లాంటివాళ్ళు కారా ? అరగంట నుండీ మీ కామెంట్స్ వినలేక ఛస్తున్నాను ! ఒక్కటైనా మమ్మల్ని సరిగ్గా చూడనిచ్చారా ?
(వినోద్ని చూసి మిగతా వాళ్ళు తోకముడు స్తారు! వినోద్ దెబ్బలకి తట్టుకోలేక రాజూ కుయ్యో మొర్రో అంటూ వుండగా... తెర)

*-'ఆంధ్రభూమి' మంత్లీ - 1989*

# బస్టాండ్

ప్రయాణ పదనిసల్లో తొక్కిసలాటల రుసరుసలు..



(తెరతీయగానే.... బస్సొకటి కన్పిస్తుంది)

పాప : మమ్మీ ! మన హైదరాబాద్ బస్ ఎప్పుడొస్తుంది?

విమల : వొస్తుందమ్మా ! పది నిమిషాల్లో ! (జిలేబీలు అమ్మే అబ్బాయి అటువైపు వస్తాడు, అవి చూసిన పాపకి నోరూర్తుంది)

పాప : (జిలేబీల వంకే చూస్తూ) మమ్మీ! నాకు ఆకలవుతోంది నాకు జిలేబీలు కావాలి! నాకు జిలేబీలు కొనివ్వు !

విమల : ఛ ! వాటినిండా ఈగలు ! అవి ఎలా ముసుర్తు

న్నాయో ? వొద్దు పాపా !

| | | |
|---|---|---|
| పాప | : | నాకు ఆవే కావాలీ.... ఈ...ఈ...ఈ.. (రాగం అందుకుంటుంది) |
| విమల | : | నువ్వు నా మాట ఎప్పుడు వింటావనీ (విసుగ్గా) అందుకే నిన్ను తీసుకుని నాకు ఎక్కడికీ వెళ్లాలన్పించదు ! |
| పాప | : | (కాళ్లు టపటపా నేలకేసి కొడ్తూ) నాకు జిలేబీలు కావాలి ? (విమల విసుగ్గా... ఇబ్బందిగా... వెళ్లి జిలేబీలు కొనిస్తుంది ! పాప అవన్నీ తిని...) |
| పాప | : | మమ్మీ ! నేను టాయ్‌లెట్‌కి వెళ్తాను ! |
| విమల | : | అబ్బ, నీతో అన్నీ చీకాకే ! ఇక్కడ టాయ్‌లెట్స్ చాలా అసహ్యంగా వుంటాయ్ ! లోపలికి ఎలా వెళ్తావ్ ? అదిగో అలా బయటికి.... వెళ్లి రా ! |
| పాప | : | అబ్బ, నేను బయటకి వెళ్లను మమ్మీ ! నాకు సిగ్గేస్తుంది ! అందరూ చూస్తారు ! బాత్‌రూంలోకే వెళ్తాను ! |
| విమల | : | (విసుగ్గా) చెప్పానుగా! అందులో కాలు బెట్టలేమనీ.... |
| పాప | : | అబ్బ.... మమ్మీ.... (అసహనంగా) ప్లీజ్.... నాకు అర్జంట్ మమ్మీ ! |
| విమల | : | అసలు నిన్నని ఏం లాభం !? తప్పునాది ! నీకు జిలేబీలు కొనివ్వకుండా వుండాల్సింది!... సరేలే... వెళ్లు ! |

పాప : (లోపలికి వెళ్లబోతూ) అబ్బ ! (ముక్కు మూసుకుంటూ) ఇక్కడ కంపు వాసన మమ్మీ!

(విమల గుడ్లురుమి చూస్తూ వుంటుంది)

పాప : మమ్మీ ! ఈ బాత్‌రూం డోర్ దగ్గరే ఎవరో -'పాటీ'కి వెళ్లారు ! లోపలకి ఎలా వెళ్ళనూ ?

(అంటూ పాప తెర లోపలికి వెళ్ళి కెవ్వు మంటుంది!)

విమల : (కంగారుగా) ఏమిటమ్మా ఏమైంది ?

(తెరపక్కనుండి)

పాప : జారిపడ్డాను మమ్మీ !

విమల : (తెర పక్కనుండి పాపను తీసుకొచ్చి) ఏ దిక్కు మాలిన వెధవో అరటితొక్క పడేశాడు! ఎన్ని దెబ్బలు తగిలాయో.... ఏమో! బట్టలన్నీ పాడైపోయాయి ! డబ్బు తీసుకునైనా - ఈ టాయ్‌లెట్స్ శుభ్రంగా వుంచితే ప్రయాణీకు లకు ఎంత సుఖం!?

(అంటూ ఆ పాప బట్టలు విప్పి వేరే దుస్తులు వేస్తూ వుంటుంది)

స్వీపర్ : (ఫ్లోర్ వూడుస్తూ) ఈ పెట్టే బేడా ఎవర్దీ ! జరపండి! జరపండి!

విమల : కాస్త ఆగు నాయినా ! వస్తున్నాను. (విమల పెట్టె తీస్తూ వుంటుంది. మరోపక్క స్వీపర్ ఆమె కాళ్ళమీదే వూడుస్తూ వుంటాడు. విమల ఆ పెట్టె తీసి ఇటు పెట్టేలోగా - అక్కడా

- మళ్లీ స్వీపర్ ప్రత్యక్షమై....)

స్వీపర్ : సామాను తీయండి ! సామాను తీయండి!

(అదే సమయంలో ఒక ముస్లిం వనిత బురఖాతో వచ్చి విమల భుజం తట్టి, బస్ చూపిస్తూ....)

ఫాతిమా : అజీ, ఏ బస్ కిదర్ జా రహీ హై ?

(విమల విన్పించుకోదు ! ఈలోగా విమల భర్త రంగారావు పరిగెత్తుకొని వచ్చి)

రంగారావు : అయ్యో ఏమిటిది విమలా ? హైదరాబాద్ బస్ ఎప్పుడో వచ్చి ఆగింది ! నువ్వు చూసుకోలేదు ! పాపని తీసుకొని పద ! నేను సీట్ కోసం అడుగతా... (బస్ కిటికిలోంచి కన్పిస్తోన్న వ్యక్తిని చూసి కర్చీఫ్ ఇచ్చి) ఏమండీ ఈ కర్చీఫ్ వేసి అక్కడ సీట్ పెట్టండి ! మా ఫ్యామ్లీ వుంది !

ఫాతిమా : (బస్ డోర్ దగ్గర వున్న విమలని చూసి) ఆజీ, జర బోలోన ఏ బస్ కిదర్ జా రహీహై ?)

(బస్ కిటికీలోంచి తొంగి చూస్తోన్న వ్యక్తి ఫాతిమాని చూడకుండా పాన్ వూసేస్తాడు! అది ఆమె మీద పడ్తుంది. ఆమె అగ్గిమీద గుగ్గిలమై...)

ఫాతిమా : దిఖ్ రా నహీహై ? పాన్ మేరే వూపర్ తూక్ దియే ? దేఖో మై క్యా కరూంగీ ?

కిటికీలోంచి

చూస్తోన్న వ్యక్తి : ఏ చుప్ బైఠో ! మై తూక్ రహాతా! తూహీ కిటికీకే పాస్ ఆయా! అవుర్ లడ్ రహీ హై క్యా? అరేజావ్ ! జావ్ ! క్యా బోల్ రహీ?

(ఈలోగా బస్ డోర్ దగ్గర ప్రయాణీకులు గుమిగూడ్తారు, బస్‌లోంచి - చివరకు ఒక ప్రయాణికురాలు - ఆ కిక్కిరిసిన మూకను తోసుకుంటూ వూడిపోయిన జుత్తుతో దిగుతుంది)

ఆ స్త్రీ భర్త : ఇగో - గిందుకే అన్నా ! బస్‌ల ఆకర్కి యెప్పుడూ దిగద్దనీ ! ఆకర్కి దిగితే - వాళ్ళంతా నిన్ను గిట్లనే తోసుకుంట, తోసుకుంట ఎక్కుతరనీ - నేను గది ముందుగాల్నే జెప్పిన!- విన్నావ్ ?

గుడ్డి బిచ్చగాడు: (పాట పాడ్తూ) ఆదినూ - అంతటా - ఒక్కడే - దేముడూ, ముంచకురా నాయనా ! ప్రేమించుమురా నాయనా!

(ఏదో గుర్తొచ్చినట్లు పాట ఆపి) ఆ... హైదరాబాద్! హైదరాబాద్!! హైదరాబాద్ బస్ వచ్చింది!

కాలేజీ కుర్రవాడు: (మరో కుర్రవాడితో) ఒరేయ్... హైదరాబాద్ బస్‌లో ఇద్దరు కాలేజీ అమ్మాయిలు ఎక్కబోతున్నారు ! వెళ్లి 'ఢీ' కొట్టేదా ?

మరో కుర్రవాడు: నీ ముఖం ! నీకంత ధైర్యం కూడానా ?

కాలేజీ

కురవ్రాడు : నువ్వలా గుడ్లప్పగించి చూస్తూ వుండు ! చూడూ, నేనేం జేస్తానో?

(ఏదో బస్ ఎక్కే హడావిడిలో వున్నట్టు వెళ్లి వాళ్లిద్దర్నీ తోసుకుంటూ వెళ్తాడు ! ఒకామె చెప్పులు తీసేసరికి 'సారీ మేడమ్' అని తప్పుకుంటాడు)

బిచ్చగాడు : (చిన్న పిల్లవాడు): ఒక పది పైసలు ఇవ్వమ్మా! అన్నం తిని మూడు రోజులైంది ! నీకు పుణ్యం వుంటుంది.

విమల : (విసుగ్గా) అరే, అడ్డులేవయ్యా ! అవతల నాకు బస్ వచ్చింది.

బిచ్చగాడు : (ఆమెని కదలనీకుండా చేతుల్తో ఆమె కాళ్లు పట్టుకొని సాష్టాంగా అడ్డం పడి, మాటి మాటికీ ఆమె పాదాలను తలతో తాకుతూ) ఒక పది పైసలు ఇవ్వమ్మా ! చచ్చి నీ కడుపున పుడ్తా!

విమల : అరే, చెప్తోంది నీక్కాదూ ? నా కాళ్లు విడువ్ ముందర !

బిచ్చగాడు : ఒక పది పైసలే గదమ్మా ! ధర్మం చెయ్ తల్లీ, నీకు పుణ్యం వుంటుంది.
(విమల సణుక్కొంటూ గొణుక్కుంటూ పర్స్ లోంచి రూపాయి తీసి అతడి చేతిలో పెడ్తుంది)

ప్రయాణికుడు : కండక్టర్ సాబ్ ! సిల్లరియ్యి నాకు రూపాయి రావాలే !

కండక్టర్ : మీ దగ్గర రూపాయివుంటే ఇవ్వండి ! నేను రెండ్రూపాయలిస్తా!

ప్రయాణికుడు : నా తాన సిల్లర్లేదు ! జల్దియ్యి ! అగో మా కరీంనగర్ బస్ పోతాంది !

కండక్టర్ : అయితే నన్నేం జేయమంటవ్ ? చిల్లర్లేదని చెప్పానుగా ! ఉంటే రూపాయి ఇచ్చి, రెండ్రూపాయలు తీసుకెళ్లు !

మిరపకాయ బజ్జీలు

అమ్మే వ్యక్తి : మిరపకాయ బజ్జీ, మిరప కాయ బజ్జీసార్ ! మిరపకాయ బజ్జీ కొనుక్కోండి సార్, చిల్లరిస్తాను !

ప్రయాణికుడు : నీ సిల్లర కోసం సూత్తుంటే నాకు మావూరి బస్ ఎల్లిపోతది! రాత్రి యింకో బస్సైనా లేదు! ఇయ్యాల్లేచి ఎవురి ముఖం సూత్తి నో ఏమో? కండక్టర్ నౌఖరీ ఎంత ఫాయిదా? దినాం గిసుంటి రూపాయలు ఓ పదొచ్చినా సాలు! సిన్నప్పుడు మా అయ్య సదువుకోరా అంటే వింటిని గాదు!

కండక్టర్ : అవునవునూ... నువ్విచ్చే రూపాయిల్తో నేను బంగ్లాలు కడ్తున్నా! చిల్లర్లేకుండా రావడం గాక - నోటికొచ్చినట్టు కూయడం మీకు బాగా అలవాటైపోయింది.

(ఇంతలో ఓ హడావిడీ, అయోమయం - ఆగమయ్య తన సూట్‌కేస్ బదులుగా విమల సూట్‌కేస్ తీసుకెళ్తూ ఉంటాడు)

విమల : ఏమండీ.... ఏమండోయ్.... అది నా సూట్‌కేస్!

ఆగమయ్య : ఓ... మీదా ? నేను చూళ్లేదు ! సారీ ! (అంటూ ఆ సూట్‌కేస్ ఆమె కిచ్చేసి తన సూట్‌కేస్ తీసుకుని పెద్దపెద్ద అంగల్తో వెళ్ళి పోతాడు)

కాలేజీ అమ్మాయి: (బస్ ఎక్కుతూ) చూడు మిస్టర్ ! లేడీస్ కన్పించడం లేదా ? ముందు లేడీస్‌ని ఎక్కనీండి!

కాలేజీ కుర్రవాడు: సమాన హక్కులూ, సమాన హక్కులూ అని గోలెట్టారు కదా! బస్‌లో మీకు ప్రత్యేకం ఎందుకూ ? మాతోపాటు సమానంగా ఎక్కండి! సమానంగా నించోండి!

విమల : నిజమే బాబూ ! చూడమ్మాయ్ ! ఆ కాలేజీ కుర్రవాడు అసలే పచ్చి బాలింత ! మనతో పాటు సమానంగా ఎక్కలేడు ! కాస్త మనమే పక్కకు తొలిగిపోవాలి !

(విమల మాటలకి కాలేజీ అమ్మాయిలు నవ్వుకుని పక్కకి తొలిగి దారిస్తారు ! ఇంతలో ఆగమయ్య చేతిలో గొడుగు పట్టుకొని కాలేజీ కుర్రవాడి వెనకాల ఎక్కడానికి ప్రయత్నిస్తాడు)

విమల : ఆ గొడుగు జాగ్రత్త నాయినా ! ఉల్టా పట్టుకో! లేకపోతే మా కంట్లో గుచ్చుకుంటుంది.

కాలేజీ అమ్మాయిలు: (ఆగమయ్యని చూసి) ఓహో మీకు కూడా తొందరున్నట్టుందే! సరిసరి ! ఈయన

ప్రెగ్నెంట్‌లా వున్నాడు! పక్కకి జరిగి దారివ్వవే! ఏంటీ బాబూ ! తమరికిప్పుడు తొమ్మిది నెలల నుకుంటా ! మా అందర్తో సమానంగా ఎలా ఎక్కుతావ్! ఏమండీ, మీరంతా కాస్త అటూ ఇటూ తప్పుకోండి! ఆయన అసలే వుత్త మనిషి కాదు !

(అతడు కాలేజీ అమ్మాయి వంక కోపంగా చూస్తూ... బస్ ఎక్కుతూనే వుంటాడు అందర్నీ తోసుకుంటూ తోసుకుంటూ)

కాలేజీ
అమ్మాయిలు: ఆ... ఆ.... ఎక్కు... ఎక్కు ! పదిలం... పదిలం! అమ్మయ్య ఎక్కావా తండ్రీ !? సంతోషం!

రంగారావు : (గంపల్తో బస్ ఎక్కుతోన్న పల్లెటూరి అమ్మాయిని చూసి) ఏయ్ గంపలమ్మీ ! బస్‌లో ఎక్కడానికి మనుషులకే చోటులేక ఛస్తుంటే మధ్యలో నీ గంపలేమిటీ ?

విమల : (రంగారావుతో) ఏమండీ, మన లగేజీ బస్‌పైన ఎక్కించారా?

రంగారావు : ఆ.... ఎక్కించాను !

కూలీ : సాబ్ ! సామాన్ ఊపర్ డాల్దియా ! పైసా దేవ్!

(రంగారావు డబ్బులిస్తాడు ! ఇచ్చిన డబ్బు ఎగా దిగా చూసి) క్యా ? ఏక్ రూప్యా !? దో రూప్యా దేవో !)

రంగారావు : అదేంటయ్యా 'ఒక రూపాయి కూలి' అని అక్కడ రాసి వుందిగా!

కూలి : ఓ జమానాకా బాత్ హై ! కల్ కే థామ్ అజ్ హై క్యా? నికాలో నికాలో, పైసా నికాలో !

రంగారావు : నహీతో... ?

కూలి : అన్వర్ ! (బస్ టాప్ పైకి చూస్తూ) ఓ సామాన్ నీచే పేక్ దో.

రంగారావు : బాబ్బాబూ ! నీకు పుణ్యం వుంటుంది! ఉండనీ, రెండు రూపాయలకేం ఖర్మం ! మూడిస్తాను ! అసలే బస్‌కి టైమైపోతూంది! (డబ్బుకోసం రంగారావు తన జేబులు తడుముకుంటూ వుండగా బస్ స్టార్టవుతుంది. రంగారావు యింకా ఎక్కడు ! బస్ కదలిన శబ్దం! బస్‌లోంచి...)

పాప : డాడీ... డాడీ !

విమల : ఏమండీ... మీరు త్వరగా బస్ ఎక్కండీ !

పాప : డాడీ.... డాడీ ! (ఏడుస్తుంది)

రంగారావు : పాపా ! ఏడ్వకమ్మా ఎక్కుతున్నాను ! (బస్ డోర్ మీద బాదుతూ) డ్రైవర్ బస్సాపండి !

(బస్‌డోర్ మొదటి మెట్టుపై ఒక పాదం పెట్టి... ఇతడి రెండో పాదం గాల్లో వేళ్లాడ్తూవుండగా... తెర)

-'ఆంధ్రభూమి'
మంత్లీ - 1989

# బివేరాఫ్ మైక్స్



(అది బెడ్‌రూమ్ ! ఒక మంచంలో బామ్మా, మరో మంచంలో పిల్లలిద్దరూ నిద్రపోతూ వుంటారు. అలారం సౌండ్‌కి బామ్మ కళ్లు నులుముకుని లేచి - అలారం పీక నొక్కి- పిల్లల దగ్గరికి వెళ్తుంది)

బామ్మ : సునీల్ ! విజయ్ ! ఒరేయ్ లేవండ్రా ! ఐదయింది ! ఇంకా నిద్రపోతున్నారా ? మీరీ రోజు పరీక్షలు రాయాలి కదా.... మరిచి పోయారా? లేవండి లేవండి !

సునీల్ : (ఒక్కుదుటున లేచి) ఒక్క నిముషం బామ్మా (లేచి పక్కనే వున్న బాత్రూమ్‌లోకి వెళ్లి... బ్రష్ చేసుకుని - పుస్తకంలో తల దూరుస్తాడు.)

బామ్మ : విజయ్ ! నువ్వింకా ఎంతసేపు నిద్ర పోతావురా? లేలే!

విజయ్ : లేస్తున్నా బామ్మా !

(బద్దకంగా లేచి... బాత్రూమ్‌లోంచి బ్రష్ తెచ్చుకుని బెడ్ రూంలోనే పళ్ళు తోముకుంటూ వుంటాడు.. ఇంతలో ఎక్కడి నుండో... 'కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే'... శ్లోకం విన్పిస్తుంది. ఆ పాటకి అనుగుణంగా తల తిప్పుతూ బ్రష్ చేసుకుంటూ వుంటాడు.. కాసేపయ్యాక 'వినుడి వినుడి రామాయణ గాధా వినుడీ మనసారా')

సునీల్ : (విజయ్‌ని చూస్తూ) ఆపు, ఆపు ! పాటకి నీ డ్యాన్స్ అమోఘం గానీ వెళ్లి ముఖమదీ కడుక్కో, టైమైపోతోంది! మనం చదవాల్సింది ఎంతోవుంది!

(ఇంతలో - 'ఘనా ఘన సుందరా... కరుణారస మందిరా' మరో పాట)

సునీల్ : ఏం రికార్డులో ఏమో బామ్మా ! ప్రొద్దున్నే ఈ రికార్డుల గోలతో మాకు ఇటు చదువు ఒంట బట్టట్లేదు !

విజయ్ : 'పే...ద్ద' సౌండ్‌తో ప్రతిరోజూ... ఈ అరిగి పోయిన రికార్డుల్ని పెట్టిందే పెడుత్తూ... పిచ్చెక్కిస్తున్నారు బామ్మా!

(ఇంతలో పనిమనిషి పదేళ్ల అమ్మాయి... వూడుస్తూ ఆ గదిలోకి వస్తుంది - ఎక్కడి నుండో మళ్ళీ మరో పాట 'రంభహో.. హో' పాట విని - వూడుస్తోన్న చీపురుకట్ట పక్కన పడేసి - ఆ పాటకి అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ వుంటుంది)

సునీల్ : వాటిజ్దిస్ ? ఈ పాటల్తోనే ఛస్తూంటే నీ డ్యాన్సులొకటి ! వెళ్లు వెళ్లు ! ఎవరు బామ్మా - రికార్డులు పెడ్తోంది ?

బామ్మ : ఈ వారం రోజులూ వినాయక చవితి ఉత్స వాలు కదా నాన్నా! ఇక ఈ రోజు నుండీ - ప్రతిరోజూ యింతే !

విజయ్ : అవునవునూ... మనకిష్టమున్నాలేకున్నా - మనం విని తీరాల్సిందే!

సునీల్ : అమ్మో - దేవుడో - ఇక నేను పరీక్షలకెలా ప్రిపేర్ కావాల్రో వినాయకుడో ?

బామ్మ : నీకేం నాయనా ! నువ్వు పగటి పూటంతా - ఎంచక్కా స్కూల్లో వుంటావ్ ! మేమైతే రాత్రింబవళ్లూ యింట్లోనే ఛస్తాంగదా మేమేమైపోవాలీ... మా బాధ ఎవర్తో చెప్పు కోవాలీ?

సునీల్ : నిజమే బామ్మా ! నాకు నిన్ను చూస్తే నిజంగానే జాలేస్తోంది!

సునంద : (వంటింట్లోంచి పిలుస్తూ) సునీల్, విజయ్,

వచ్చి కాఫీ తాగి వెళ్లండి.

సునీల్, విజయ్ : వస్తున్నాం మమ్మీ !

(పిల్లలిద్దరూ వంటింట్లోకి వెళ్లిపోతారు, ఇంతలో గీత - సునీల్ వాళ్ళ చెల్లెలు - ఆగదిలోకి 'బామ్మా' అని పిలుస్తూ వచ్చేస్తుంది!- మళ్లీ మరోపాట - 'మేరే అంగనేమే - తుమారా క్యా కామ్ హై' గీత ఆ పాటకి అనుగుణంగా స్టెప్స్ వేస్తూంటే - పని అమ్మాయి వచ్చి)

పని అమ్మాయి: అమితాబచ్చన్ స్టెప్పులు అట్ల వుండయ్ ! ఇగో - గిట్లుంటయ్!

(పని అమ్మాయి స్టెప్స్ చూపిస్తూ వుంటే గీత డాన్స్ చేస్తూ వుంటుంది! ఇంతలో సునీల్ వచ్చి, ఆ దృశ్యం చూసి గీత చెవులు మెలేసి...)

సునీల్ : యూ ఫూల్ ! ఇంకో నాల్గయిదు గంటల్లో మనం సెకండ్ యూనిట్ టెస్ట్ రాయాల్సి వుంది! డ్యాన్స్ చేస్తూ కూర్చున్నావా? ఉండు.... డాడీకి చెప్పి నీ పని పడ్తా ! డాడీ... డాడీ ! (గీత పరుగున వెళ్లి - తన చేతుల్తో అతడి నోరు గట్టిగా మూసేస్తుంది)

విజయ్ : ఒరేయ్ ! నువ్వు ఎంజాయ్ చేయవ్ ! మమ్మల్నీ ఎంజాయ్ చేయనీవ్ ! నువ్వా పుస్తకాల పురుగువి! నీక్కావలసింది పుస్తకాలు !

పుస్తకాలు ! పుస్తకాలు! - నీకు పుస్తకాల్ని తినడం- మమ్మల్ని తినడం తప్ప మరోటి తెలీదు! మా ఖర్మ!

సునీల్ : షటప్ ! మాటలు జాగ్రత్తగా రానీ, నన్ను అనడానికి నువ్వెవరివి ?

(ఇంతలో *'రావోయి మా ఇంటికి మాటున్నది మంచి మాటున్నది'* పాట! గుడ్డతో నేల తుడుస్తోన్న పని అమ్మాయి- లేచి మళ్ళీ స్టెప్స్ వేస్తూ వుంటుంది ! అప్పుడే సునీల్ వాళ్ల తాతయ్య- ఆ గదిలోకి రావడంతో.. ఆ పనిపిల్ల పిల్లిపిల్లలా అయిపోయి తన పని తాను చేసుకుంటూ వుంటుంది)

తాతయ్య : ఒరేయ్ ! ప్రాంతీయ వార్తలు వచ్చే టైమవుతోంది! కాస్త రేడియోలో న్యూస్ పెడ్తారా !

(తాతయ్య రేడియో ఆన్ చేస్తాడు ! ఇంతలో - వీధిలోంచి ఏదో అనౌన్స్‌మెంట్ విన్పిస్తూ వుంటుంది)

" నేడే చూడండి ! మీ అభిమాన సినిమా థియేటర్ 'కిషోర్'లో కమల్ హాసన్, రాధిక నటించిన అత్యుత్తమ సాంఘిక చిత్రం స్వాతిముత్యం ! ఆలసించిన ఆశాభంగం ! నేడే చూడండి! స్వాతిముత్యం ! స్వాతి ముత్యం !! స్వాతిముత్యం !!!")

విజయ్ : ఓహ్! స్వాతిముత్యం ! ఎంత మంచి పిక్చర్

తాతయ్యా! మామయ్య వాళ్లింటికి హైదరాబాద్ వెళ్లినపుడు రెండుసార్లు చూశాను! ముఖ్యంగా ఆ పాట ! 'సువ్వీ - సువ్వీ - సువ్వాలమ్మా సీతాలమ్మా !' కమల్ హాసన్ యాక్షన్ - ఓహ్! సూపర్బ్! సువ్వీ... సువ్వీ....

(విజయ్ ఆ పాట పాడ్తూ - డాన్స్ చేస్తూ వుంటాడు)

తాతయ్య : విజ్జూ - ఒరేయ్ - కాసేపు నోర్మూసుకోలేవూ? నన్ను కాస్త రేడియో విననీ తండ్రీ !

(ఇంతలో పెళ్లి పందింట్లోంచి పెళ్ళి మంత్రాలు - 'మాంగల్యం తంతునానేనా - మమ జీవన హేతునాం !' కాస్సేపటికి - 'ఈ జీవన తరంగాలలో - ఆ దేవుని చదరంగంలో - ఎవరికి ఎవరూ సొంతమూ !')

తాతయ్య : భేష్ ! బావుంది ! ఓ వైపు మాంగల్యం తంతు నానే - మరో వైపు ఈ జీవన తరంగాలలో.... (మళ్ళీ పెళ్లి పందింట్లోంచి కట్నాల చదివింపులు)

ఇప్పుడు గుర్రం గుండయ్య పెళ్ళి కుమార్తెకి ప్రేమతో ఇస్తోన్న కానుక ఇరవై రూపాయలు! పెళ్లికొడుకు మేనత్త ! పేరేమిటన్నారూ? ఓహో - కొబ్బరికాయల కాంతమ్మ - ఏ వూరన్నారూ? కొల్లూరా? ఆ - కొబ్బరికాయల కాంతమ్మ కొల్లూరు వారు పెళ్ళికుమారుడికి ప్రేమతో ఇస్తోన్న కానుక టీవీ సెట్ ! ఆ - ఎవరయ్యా

మీరూ ? బెల్లం భద్రయ్య ! భలేవారే ! అలా పక్కకి దాక్కుంటారేం ? ఇలా రండి - ఎవరికీ కానుకా ? పెళ్ళికుమార్తెకా ? ఆ - బెల్లం భద్రయ్య పెళ్ళి కుమార్తెకి ప్రేమతో రాస్తోన్న కానుక స్టీల్ స్పూనూ!)

విజయ్ : అమ్మయ్య ! కరెంట్ పోయింది ! ఇప్పుడిక రికార్డుల గొడవా మంత్రాల గోలా ఏదీ వుండదు! రాళ్ల వాన కురిసి వెలిసినట్టుంది!

(ఇంతలో వెహికిల్స్ హారన్ సౌండ్స్... పిపీమ్! పపామ్!)

సునీల్ : ఒరేయ్ విజయ్ - మళ్ళీ ఏమిట్రా ఈ పిపీమ్! పపామ్‌లు !

విజయ్ : ఆ - ఏముందీ ? పోలింగ్ దగ్గర పడిందిగా ! ఎన్నికల ప్రచారం! ఎవరో సినీ యాక్టర్ వస్తున్నాట్ట! ప్రచారం చేయడానికి ! పల్లెటూరి జనమంతా మనూరికి లారీల్లో, ట్రాక్టర్లలో వస్తున్నారు!

(బయటనుండి నినాదాలు: ఓట్‌ఫర్ పి.పి.రెడ్డి, ఓట్‌ఫర్ పి.పి.రెడ్డి, మళ్ళీ మరో గ్రూప్ నినాదాలు: ఓట్‌ఫర్ కే.కే. రావు, ఓట్‌ఫర్ కే.కే.రావు)

సునీల్ : (జుత్తు పీక్కుని, పుస్తకాలు గిరాటేసి) ఛ ! ఈ రికార్డ్స్, అడ్వర్టయిజ్‌మెంట్స్, అనౌన్స్ మెంట్స్, స్లోగన్స్‌తో - నాకు పిచ్చెక్కి పోతుంది.

విజయ్ : డాడీకి చెప్పి, మన రూం సౌండ్ ప్రూఫ్ చేయించు కుంటే...?

సునీల్ : నీ ముఖం ! మన దగ్గర అన్ని డబ్బులెక్కడివీ?

గీత : ఒరేయ్ అన్నయ్యా ! నేనో ఐడియా చెప్పనా?

విజయ్ : బాబ్బాబూ ! అదేదో చెప్పి, మమ్మీ గండంలోంచి గట్టెక్కించి పుణ్యం కట్టుకోవే !

గీత : ఆ ఏమీలేదూ ! మనమందరం వినాయకుడి దగ్గరికి వెళ్లి...

విజయ్ : ఊఁ... వెళ్లి....

గీత : ఆయన్నో వరం అడుగుదాం!

విజయ్ : ఏం అడుగుదాం!

గీత : భారతదేశంలో ఇకముందు పుట్టబోయే వాళ్లం దర్నీ చెవిటివాళ్లుగా పుట్టించమనీ ! అప్పుడు ఎవరికీ ఏ శబ్దాలూ విన్పించవ్... ఎలావుందిరా మన ఐడియా ?

విజయ్ : నీ ముఖంలాగే వుంది ! నోర్మూయ్ !

(తెర) 1988

★★★

# పవర్ కట్



(ఇంట్లో వాళ్లందరూ డైనింగ్ టేబుల్ దగ్గర ఉంటారు ! టేబుల్ మీద అన్ని పదార్థాలూ సర్వ్ చేయబడి వుంటాయి ! ఇంటి యజమానురాలు అనిత రెండేళ్ళ పాపాయిని టేబుల్ మీద కూర్చోబెట్టి...గోరుముద్దలు తినిపిస్తూ వుంటుంది)

జీవన్ : (టేబుల్ మీద పెట్టిన వంట పాత్రల మూతలు తీసి వాసన చూస్తూ:) ఓహ్! ఈ రోజు చేపకూర! హాయ్ హాయ్! నాకు నోరురూతోంది! డాడీ ఎప్పుడొస్తారో... మన మంతా కలిసి ఎప్పుడు భోంచేస్తామో ఏమో ?

ప్రీతి : (ముక్కు మూసుకుంటూ)అబ్బ ! చేపకంపు! జీవన్... నువ్వు నా పక్కన కూర్చోకు ! దూరం దూరం !

జీవన్ : చూడు మమ్మీ - నాకిష్టమైన కూరని ప్రీతి ఎలా అసహ్యించుకుంటోందో ?

ప్రీతి : జీవహింస మహాపాపం తెలుసా ?

జీవన్ : చాల్లే ! అతిగా వాగావంటే నిన్ను కూడా కరా కరా నమిలి మింగేస్తా ! నా కిష్టమైంది నేను తింటున్నాను ! నువ్వెందుకు ముఖం చిట్లిస్తావ్? మరి నువ్వూ... రోజూ - స్వీట్లూ, లడ్డూలు తింటూ లడ్డూలా పూరుతున్నావ్ కదా ! నేనెప్పుడైనా వెక్కిరించానా ?

ప్రీతి : అవున్రా అన్నయ్యా ! లడ్డూలంటే గుర్తొచ్చిందీ నీ ప్లేట్లో వున్న లడ్డూ నాకిచ్చెయ్‌రా... నా వంతు చేపకూర నీకిచ్చేస్తాగానీ!

జీవన్ : అబ్బ - ఆశ - దోశ - అప్పడం - వడ ! నేనేమీ యివ్వను! నాకు లడ్డూలూ కావాలీ.. చేపకూరా కావాలీ !

ప్రీతి : స్వార్థపరుడా ! నీ ముఖం నాకిక చూపించకు!

అయినా నిన్ను బతిమాలేదేమిటి ? నేను మమ్మీనే అడుగుతా ! మమ్మీ నాకింకో లడ్డూ ఇవ్వు మమ్మీ !

అనిత : లడ్డూలన్నీ పొద్దున్నే తినేశారుగా ! అన్నీ అయిపోయాయమ్మా! అందుకే తలా ఒకటి ప్లేట్లో పెట్టాను ! డాడీకీ మాత్రం రెండు దాచి వుంచాను !

జీవన్ : (విసుక్కుంటూ) ఈ డాడీ ఎప్పుడూ యింతే ! ఇంకా రాలా ! నాకు బ్రహ్మాండంగా ఆకలవుతోంది ! మాకు అన్నం పెట్టు మమ్మీ!

అనిత : ఒక్క అయిదు నిముషాలు ఆగునాన్నా ! ముందీ పాపాయి తిననీ ! అది ఇప్పటికే నిద్రలో తూలుతోంది !
(పాపాయి ఓ వైపు నిద్రపోతూనే మరోవంక అన్నం తింటూ వుంటుంది)

ప్రీతి : మమ్మీ.... ప్లీజ్ ! కావాలంటే నువ్వు డాడీకోసం వెయిట్ చెయ్యి! మేం మాత్రం తినేస్తాం !
(పిల్లలిద్దరూ తిండికి ఉపక్రమిస్తారు ! ఒక రెండు ముద్దలు నోట్లో పెట్టుకుంటారో లేదో - ఉన్నట్టుండి కరెంట్ పోతుంది! పిల్లలంతా ఒక్కసారిగా 'ఆ' అని అల్లరిచేస్తారు !)
తెర వెనుక నుండి అనౌన్స్ మెంట్:
నాటికలో ఇప్పుడు పవర్ పోయింది! అయినా ప్రేక్షకులు బెంబేలు పడక్కర్లేదు ! స్టేజీమీద లైట్లు వెలిగిస్తాం ! పాత్రధారులంతా ఇక

లైట్‌లేనట్టు... మన ముందు నటిస్తారిప్పుడు!

జీవన్ : (తడుముకుంటూ) అంతా చీకటి ! నాకేది ఎక్కడుందో కన్పించడంలేదు ! మమ్మీ.... నువ్వెక్కడున్నావ్ !?

పాపాయి : (రాగంతీస్తూ) మమ్మీ... నాకు ములక్కాడ కావాలీ... ఈ... ఈ....

అనిత : చీకట్లో తినకూడదమ్మా - ప్లేట్లో ఏం పడ్డా కన్పించదు! లైట్లు రానీ ! వచ్చాక పెడ్తాను !

పాపాయి : (ఆవెం మాటలు విన్పించుకోకుండా) ఊ...ఊ.. నాకు ములక్కాడ కావాలీ... ముల క్కాడే కావాలీ... ఈ... ఈ....

అనిత : (విసుక్కుంటూ) సర్లే... నువ్వెప్పుడు వింటా వనీ....

(అనిత ఆ చీకట్లో ప్లేట్లో అటూ ఇటూ తడిమి - ఎలాగో ములక్కాడ సంపాదించి, అది తీసి పాపాయి నోటికి అందించ డానికి ప్రయత్నిస్తూ వుంటుంది!)

పాపాయి : (తల వెనక్కి జరుపుతూ) ఆగు మమ్మీ ! నువ్వు నా నోట్లో... కాదు... ముక్కులో పెడ్తున్నావ్ ములక్కాడ ! నాకు ములక్కాడ వొద్దు.... ఏమీ వొద్దుగానీ..నన్ను బజ్జోపెట్టు... నాకు నిద్దరొస్తోంది!

అనిత : సరేపద !

(పాపాయిని భుజమ్మీదేసుకుని... తడుము

కుంటూ - తడుముకుంటూ వెళ్లి.... డైనింగ్ టేబుల్‌కి పక్కనే వున్న మంచం మీద పడు కోబెడ్తుంది అనిత)

జీవన్ : వెధవ కరెంట్! పనేం లేనట్టు ఇప్పుడే పోవాలా? అసలే ఫిష్ కర్రీ ! ఈ చీకట్లో ఎలా తినేదీ ? పోనీ... ఇలాగే తిందామంటే ఈ చేపముళ్లు గొంతులో ఎక్కడ గుచ్చుకుంటాయో ఏమో! మమ్మీ- ప్లీజ్ ! ఇలా వచ్చి.... ఓ సారి ఈ చేప ముళ్లు తీసి ఇవ్వవా ?

అనిత : నేనేం చేయను నాన్నా ! నాక్కూడా ఈ చీకట్లో ఏం కన్పిస్తుంది చెప్పూ ? కాస్సేపు ఆగు... లైట్లు వస్తాయి !

(ఈ లోగా ప్రీతి తనకిష్టమైన లడ్డూని ఆ చీకట్లో, జీవన్ ప్లేట్ లోంచి... తన ప్లేట్లో వేసుకొని, లైట్లు వచ్చేలోగా తినేయాలని... ఆదరా బాదరగా తింటూ వుంటుంది)

అనిత : అత్తయ్యా ! కాస్త క్యాండిలూ, అగ్గిపెట్టె తెచ్చిస్తారా? వంటింట్లో కుడి పక్కనున్న అల్మారా పై సొరగులో వుంది!

బామ్మ : సరే ! సరే ! కానీ... ఒరేయ్ కుర్ర కుంకలూ... మీలో ఎవరూ కూర్చున్న చోటునుండి కదలకండర్రా ! నేనీలోగా వంటింట్లోకి వెళ్లి క్యాండిల్స్ తెస్తాను !

(బామ్మ కాండిల్స్ తేవడానికి వెళ్తూ వుంటుంది! దార్లోవున్న చేర్ కన్పించక దాన్ని తన్నేసి - తనూ

తూలి కిందపడి - 'అబ్బా' అని నడుం పట్టుకుని లేవడానికి ప్రయత్నిస్తూ వుంటుంది)

అనిత : (కంగారుగా) ఏమైంది అత్తయ్యా ! ఎందుకలా అరిచారు ?

బామ్మ : కుర్చీ తగిలి కిందిపడి పోయానమ్మా ! ఏమిటో... భారీకాయం కదా! లేవలేక పోతున్నాను !

(బామ్మ లేవడానికి ప్రయత్నిస్తూ వుంటుంది! ఆమెకు సాధ్యం కాదు!)

అనిత : ఆగండి అత్తయ్యా ! నేనొస్తున్నాను !

బామ్మ : వొద్దొద్దు ఆ పని చేయకండి ! మీరెవరూ అక్కడి నుండి కదలకండి ! మీరు.... దేనికో గుద్దుకుని కిందపడిపోతారు !

(బయట నుండి ఇంటి యజమాని రామారావు పిలుపులు)

రామారావు : అనితా ! అనితా !

అనిత : జీవన్ ! వెళ్లి తలుపులు తియ్! మీ డాడీ వచ్చారు!

(జీవన్ తడుముకుంటూ తలుపులు తీయడానికి వెళ్తాడు! కాని తలుపులు ఎక్కడున్నాయో అర్థం కాదు)

రామారావు : అనితా ! ఏం చేస్తున్నారు ? తలుపులు తీయండి!

(జీవన్ వెళ్లి తలుపులు తీస్తాడు. రామారావు లోపలికి వస్తాడు)

రామారావు : చూడండ్రా మీకోసం నేనేం తెచ్చానో ? కాని... ప్ఛ్! ఈ చీకట్లో మీరెక్కడున్నారో కన్పించట్లేదు!

ప్రీతి : మేమంతా డైనింగ్ టేబుల్ దగ్గరున్నాం డాడీ! మమ్మీ కూడా మా వద్దే వుంది ! మా దగ్గరకి రండి !

రామారావు : కాస్సేపాగండ్రా ! బట్టలు మార్చుకొస్తాను !

(రామారావు బట్టల స్టాండ్ దగ్గరికి తడుము కుంటూ వెళ్లి... లుంగీ అనుకుని... ఆ స్టాండ్ మీదే వున్న అనిత గద్వాల్ చీర కట్టుకుని వస్తాడు)

రామారావు : అబ్బ, చాలా ఉక్కగా వుందర్రా !

ప్రీతి : (తన చేతి మీద చరుచుకుని) అబ్బ ! దోమలు ఎలా కుట్టి చంపుతున్నాయో ?

బామ్మ : అయ్యో ! మన పాపాయికి అసలే దోమల అలర్జీ కదూ! ఒరేయ్ జీవన్ ! కాస్త ఫ్యాన్ వేయరా... ఆ రాక్షసి లేచిందంటే ఒక పట్టాన నిద్రపోదు !

ప్రీతి : అయ్యో... పిచ్చిబామ్మా ! అసలు పవరే లేకపోతే వాడు ఫ్యాన్ ఎలా వేస్తాడూ ?

బామ్మ : అవును కదా ! నా మతి మండా ! ఆ విషయమే మరిచిపోయా!

| | | |
|---|---|---|
| రామారావు | : | జీవన్, ప్రీతీ ఎక్కడున్నార్రా ?కాస్త కిటికీ తలుపులు తెరుస్తారా? గాలి లోపలికి వచ్చి.... కాస్తైనా చల్లగా వుంటుంది ! |
| జీవన్ | : | సరే డాడీ ! |
| | | (జీవన్ వెళ్తూ వెళ్తూ ప్రీతి కాళ్ల తొక్కేస్తాడు ! ప్రీతి కెవ్వుమని అరిచి జీవన్ చెంపమీద ఒక్కటి అంటించి) |
| ప్రీతి | : | యూ ఇడియెట్ ! సరిగ్గా నడ్వలేవూ ? చూడూ నా కాళ్లు ఎలా పచ్చడయి పోయాయో ? ఏవీ నీ డర్టీ స్లిప్పర్స్ ? |
| | | (ప్రీతి విసురుగా ఆ స్లిప్పర్స్ లాక్కుని... విసిరి కొడ్తుంది! అవి వెళ్లి బామ్మ ముఖాన్ని ముద్దెట్టు కుంటాయ్ ! ఏ పురుగో - పుట్రో పడిందనుకుని బామ్మ కెవ్వుమంటుంది) |
| అనిత | : | ఏమైంది అత్తయ్యా ? |
| బామ్మ | : | ఏమీ లేదమ్మా - ఏ బల్లో... పిల్లో మీద దూకినట్టుంటేనూ.... |
| జీవన్ | : | డాడీ ! నేను మీరు చెప్పినట్టే కిటికీ రెక్క తెరిచాను! |
| రామారావు | : | అమ్మయ్య ! కాస్త చల్లగాలి వొస్తూ.... ప్రాణా నికి హాయిగా వుందిరా ! |
| | | (ఇంతలో ఫోన్ రింగవుతుంది) |
| రామారావు | : | జీవన్ ! వెళ్లి ఆ ఫోన్ అందుకుని... ఎవరు |

మాట్లాడుతున్నారో కనుక్కో !

ప్రీతి : డాడీ... నేను మాట్లాడ్తా ఫోన్లో !

జీవన్ : నువ్వు చిన్న పిల్లవి ! నీకేం తెలుసు ఫోన్లో ఎలా మాట్లాడాలో!? నేనే మాట్లాడ్తా !

ప్రీతి : కాదు... నేను !

(జీవన్‌కి కోపం వచ్చి, ప్రీతి జడ వెనక్కి గుంజి... ముందుకు వెళ్లబోతాడు ! ప్రీతికి ఒళ్లుమండి జీవన్ జుట్టు పట్టుకుంటుంది! ఇద్దరూ పోట్లాడు కోవడంతో అనిత ఇద్దర్నీ చెరోటి అంటిస్తుంది! ఫోన్ ఇంకా అలాగే మోగుతూ వుండటంతో రామారావు తడుముకుంటూ వెళ్లి - మంచమ్మీద కూర్చుని పక్కనే వున్న టీపాయ్‌మీది ఫోన్ రిసీవర్ అందుకుంటాడు! అదే మంచంలో నిద్రపోతోన్న పాపాయి.... రామారావు బరువుకి కెవ్వుమంటుంది ! తను వెళ్లి ఆ మంచంలో ఆ పాపాయి మీదే కూర్చున్నానని గ్రహించి... ఒక్కుదుటున లేస్తాడు)

రామారావు : అయ్యో పాపా ! నీ మీదే కూర్చున్నానా తల్లీ ! చీకట్లో నేను చూళ్లేదమ్మా ! సారీ ! ఏడ్వకు తల్లీ... నీకు దణ్ణం పెడ్తాగా!

(భుజమ్మీద పాపాయిని వేసుకుని... కాస్త అటూ ఇటూ తిప్పి, రిసీవర్ పట్టుకుని...)

రామారావు : హలో... ఎవరు మాట్లాడుతున్నారు ? ఓహ్

శంకర్! ఏమిటీ సంగతి ? ఏమిటీ... ఈ రోజంతా కరెంట్ వుండదా ? బాప్‌రే! మా యింట్లో క్యాండిల్స్ కూడా వున్నట్టు లేవు ! బజార్‌కి వెళ్లి కొనుక్కొద్దామన్నా - ఏదీ ఏ షాపూ తెరిచి వున్నట్టు లేదు ! అన్నీ మూసేశారు !

ప్రీతి : అయ్యో... ఈ రోజు కరెంట్ రాదా డాడీ ! తొమ్మిది గంటలకి టీవీలో మంచి సీరియల్ వుంది !

బామ్మ : (క్యాండిల్ వెలిగించి తీసుకొస్తూ) ఏరా రామూ! పిల్లలంతా ఆకలిగా వున్నారు ! నీ కోసమే ఇంతసేపూ ఆగారు ! తొందరగా చేతులు కడుక్కుని రా భోంచేద్దాం ! ఇదో.. ఈ చిన్న క్యాండిల్ ముక్క దొరికింది ! ఇది కరిగి పోయేలోగా... భోజనాలు కానిచ్చేయాలి !

రామారావు : ఇదిగో - ఒక్క నిమిషంలో వొస్తాను !

(చేతులు కడుక్కోవడానికి వాష్‌బేసిన్ దగ్గరికి వెళ్లి. ట్యాప్ ఆన్ చేస్తాడు ! నీళ్ళు రావు!)

రామారావు : అయ్యో ! ట్యాంక్‌లో వాటర్ కూడా అయి పోయినట్టుందే! అగ్నికి ఆజ్యం తోడయినట్టు.... ఇప్పుడీ కరెంట్ సమస్యకి తోడు - నీళ్ల సమస్యకూడా ఒకటి ! ఖర్మ !

(రామారావు తన మీద వున్న షర్ట్ తీసి - స్టాండ్ మీదున్న లాల్చీని... ఆ చీకట్లో తిరగేసి వేసుకుంటాడు)

జీవన్ : ఈ రోజు కరెంట్ వుండదట ! ఎంత అదృష్టం! చదివే పనిలేదు! ఈ రోజంతా కరెంట్ రాకపోతే ఎంత బావుణ్ణు! కదూ ప్రీతీ ?

(పిల్లలిద్దరూ... రిలాక్స్‌డ్ చేర్లో కూర్చుని... కొండంత సంతోషంతో కాళ్లూపుకుంటూ వుండగా.. ఉన్నట్టుండి కరెంట్ వొస్తుంది)

ప్రీతి : (రామారావుని చూసి వచ్చే నవ్వునాపుకుంటూ) అయ్యో డాడీ! మీరు ఏ లుంగీ కట్టుకున్నారో తెలుసా ? అమ్మ గద్వాల్ చీర! అరెరె... లాల్చీ కూడా తిరగేసి ఎలా వేసుకున్నారో.... చూడండోచ్ !

(రామారావు తన లుంగీవంకా, లాల్చీవంకా - ముసి ముసిగా నవ్వుతోన్న తన భార్యవంకా - మార్చి మార్చి చూస్తూ వుండగా....తెర)

*రచనా కాలం: 1988*

★★★

# ట్యూషన్స్



| | | |
|---|---|---|
| గోపి | : | ఒరేయ్ ! స్కూల్ అయిపోగానే నాకు ఇంటికి వెళ్ళాలంటేనే భయంగా వుందిరా ! |
| రాము | : | ఎందుకురా ? |
| గోపి | : | ఇంట్లో అయితే మా మమ్మీ పొద్దస్తమానం చదువూ, చదువూ అని ఒకటే గోలెడ్తూ వుంటుంది! |

రాము : ఒరేయ్ ! నువ్వీ బెడద తప్పించుకోవడానికి నేనో ఉపాయం చెప్పనా?

గోపి : ఏమిటదీ ?

రాము : మీ డాడీని అడిగి ట్యూషన్ పెట్టించుకో !

గోపి : ట్యూషన్ మాస్టర్ కూడా చదవమని మన ప్రాణాలు తోడేస్తాడు కదరా ! అప్పుడు మనకేం సుఖం !?

రాము : ఒరే పిచ్చి సన్నాసీ ! మన రాజారావ్ సార్ లేడూ! ఆయన దగ్గరికి నేను ట్యూషన్‌కి వెళ్తున్నాను ! ఆయన ఏమైనా చదువు చెప్తాడను కుంటున్నావా ? వాళ్ల పింకీ లేదూ దాన్ని ఎత్తుకోమంటాడు ! ఆ పాప కూడా ఎర్రగా బుర్రగా ముద్దొస్తూ వుంటుంది ! అక్కడున్నంత సేపూ ఎంతో హాయిగా ఆడుకుంటూ వుంటాను! మా అమ్మావాళ్లేమో నేనేదో చదువుకుంటూవున్నా ననుకుంటారు!

సునీల్ : అబ్బబ్బ రోజూ హోం వర్క్ చేయలేక ఛస్తున్నాను! పక్కింటి నానిగాడికి - వాళ్ళ ట్యూషన్ మాస్టరే ఎంచక్కా హోంవర్క్ చేసిస్తార్ట! ఎంత హాయి ! నేనూ వాడిలాగే ట్యూషన్‌కి వెళ్లాననుకో నాక్కూడా చేసి పెడ్తారుగా ! మా డాడీని అడుగుతా నాక్కూడా ట్యూషన్ పెట్టించమనీ!

వెంకట్ : ఒరేయ్ ! ట్యూషన్లు అంటే గుర్తొచ్చింది !

సత్యనారాయణ మాస్టర్ లేడూ... ఈ మధ్య ఆయన దగ్గరికి ట్యూషన్‌కి వెళ్తున్నాను ! ఎప్పుడు చూసినా మన క్లాసులో ఆయన ఆవులిస్తూ, నిద్రపోతూ వున్నట్టు వుంటారు కదా... ఇంట్లో ఎంత బాగా పాఠాలు చెప్తారో తెలుసా?

గోపి : స్కూల్లో పాఠాలు బాగా చెప్తే, ఆయన దగ్గరికి ఎవరొస్తారు ! అందుకే ఆయన - కావాలనే - స్కూల్లో సరిగ్గా చెప్పరట!

సునీల్ : మీ రాజారావ్ మాస్టర్ కన్నా - ఈ సత్య నారాయణ మాస్టర్ ఇంకా నయం కదరా! స్కూల్లో చెప్పకున్నా - డబ్బుల్దీసుకుని - కనీసం ఇంట్లోనైనా పాఠాలు చెప్తారంటున్నావ్!

రాము : అవునవునూ - మన రాజారామ్ మాస్టరైతే పిల్లల్ని వాళ్ళ మానాన వాళ్లని వదిలేసి - ఎంచక్కా ఏ పేపరో, టీవో చూస్తూ కూర్చుం టార్ట!

సునీల్ : ఒకసారి మా డాడీ ట్యూషన్ కోసమని హెచ్చెం గారిని కలవడానికి స్కూల్‌కొస్తే, ఆయన్ని మధ్యలోనే పట్టేసుకొని 'రండి ! రండి! ట్యూషన్ నేను చెప్తా, నేను చెప్తా'నంటూ ముగ్గురు మాస్టార్లు ఆయన్ని వుక్కిరిబిక్కిరి చేశార్ట!

గోపి : పాపం ! ఎరక్కపోయి ఇరుక్కుపోయి వుంటాడు మీ నాన్న!

సునీల్ : అవున్రా ! ఎవర్ని కాదంటే - ఎవరికోపమొస్తుందోనని - వాళ్ళ ముగ్గుర్నీ వదిలించుకునేసరికి తలప్రాణం తోక్కి వచ్చిందట!

గీత : వీళ్లందరి సంగతి ఏమోగానీ - లతా, నేనయితే వచ్చే ఫస్ట్ నుండి ట్యూషన్‌కి వెళ్దామనుకుంటున్నాను !

లత : నువ్వు క్లాస్‌లో ఫస్ట్ వస్తుంటావ్ కదా ! నీకెందుకూ ట్యూషన్?

గీత : అదికాదే ! ఇన్నాళ్లూ నాకు ఫస్ట్‌రాంక్ వచ్చిందా? ఇప్పుడు సెకండ్ రాంక్ వస్తోంది ! ఇన్ని రోజులూ ఏ నాల్గో అయిదో ర్యాంక్ వచ్చిన అనిత ఈ మధ్య వినోద్ సార్ దగ్గరికి ట్యూషన్‌కి వెళ్తోంది కదా- ఆమెకిప్పుడు ఫస్ట్‌ర్యాంక్ వస్తోంది ! ఇక నాకు జన్మలో ఫస్ట్‌ర్యాంక్ రాదు !

లత : అనిత ఇప్పుడు బాగా చదువుతోందేమో ! అందుకే ఫస్ట్‌ర్యాంక్ వస్తోందేమో ! ఆ కోణంలో నువ్వెందుకు ఆలోచించవ్ !?

గీత : అదీ అనుకున్నాను ! కానీ... ఇద్దరం ఒకే సమాధానం రాస్తే, నాకు తక్కువ మార్కులిచ్చారు. అనితకి ఎక్కువ మార్కులు వేశారు! మొన్న మా నాన్న కంప్లయింట్ చేస్తే హెచ్‌ఎంగారు మా యిద్దరి పేపర్లనీ స్క్రూటినీ చేయించారు. వినోద్ మాస్టర్ నా పేపర్‌ని స్ట్రిక్ట్‌గా దిద్ది - అనిత పేపర్లు లిబరల్‌గా దిద్ది, ఎక్కువ

మార్కులు వేశారని తేలిందట!

లత : నువ్వన్నదీ నిజమే ! మొన్నేం జరిగిందో తెలుసా? క్వార్టర్లీ ఎగ్జామినేషన్స్‌లో సునీత నా పక్కనే కూర్చుని సైన్స్ పరీక్ష రాసింది!

గీత : అవునవునూ - ఆ రెండు జెళ్ల సునీత కదూ ! ఎగ్జామినేషన్ హాల్లో రెండున్నర గంటలు గోళ్లు గిల్లుకుంటూ - దిక్కులు చూస్తూ కూర్చుంది! బెల్ అయిపోయాక - బ్లాంక్ పేపరిచ్చి బయటికి వెళ్లిపోయింది - అంతే ! ఆ తర్వాత ఏం జరిగిందీ నాకు తెలీదు !

లత : ఇంకేం జరగాలీ!? - తీరా పేపర్స్ ఇచ్చాక చూస్తే... ఆమె రాసిన పేపర్లో అన్నింటికీ జవాబులు కన్పించాయి. అదెలా జరిగిందని దబాయించి అడిగితే - వాళ్ళ ట్యూషన్ మాస్టరే ఆ సైన్స్ సబ్జెక్ట్ టీచరట ! ఇంటికి వెళ్లాక ఆ బండిల్ తీయించి - ఆ పిల్లతో సమాధానాలన్నీ రాయించార్ట !

గీత : ఇంకా అంతేనా ? కొంతమంది మాస్టార్లున్నారూ! డౌట్స్ క్లియర్ చేస్తామనే వంకతో వచ్చి అబ్జెక్టివ్ టైప్‌కి ఆన్సర్లన్నీ పక్కవాడికి విన్పించనంత నెమ్మదిగా తమ ట్యూషన్ పిల్లలకి చెప్పేసి - వెళ్లిపోతారట!

లత : నీకింకో తమాషా చెప్పనా - మన క్లాస్‌మెట్ రవీ వాళ్ల ట్యూషన్ మాస్టర్ - అబ్జెక్టివ్ టైప్‌కి సమాధానాలన్నీ ఓ స్లిప్ మీదే రాసేసీ - దాన్ని

వాళ్ళ ట్యూషన్ పిల్లలకి ఇచ్చి వెళ్లిపోతూ వుంటాడు.

గీత : ఇంకో విషయం నీకు తెలీదేమో ! కవితా వాళ్ల ట్యూషన్ మాస్టరైతే పరీక్షల్లో సమాధానాలు అన్నీ పెన్సిల్‌తో రాయమంటారట-ఇంటికి వెళ్లాక రబ్బర్‌తో తుడిచి - మళ్ళీ రాయవచ్చునీ!

రాము : ఒరేయ్ గోపీ - మొన్నేం జరిగిందో తెలుసా ! హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ అప్పుడు - నా ముందు వరుసలో కూర్చుని సురేష్ - సతీష్ ఇద్దరూ కాపీ రాస్తున్నారు ! ఇన్విజిలేటర్‌గా వినోద్ సారు వచ్చారు ! సతీషేమో వినోద్ మాస్టారు దగ్గరికి ట్యూషన్‌కి వెళ్తున్నాడు. సురేషేమో రాజారావు దగ్గరికి ట్యూషన్‌కి వెళ్తున్నారు. ఇద్దరూ కాపీ చేస్తున్నప్పుడు ఇద్దర్నీ పట్టివ్వాలి కదా! కాని వినోద్ మాస్టర్ సతీష్‌ని చూసీ చూడనట్టుగా వదిలేసి - సురేష్‌ని పట్టించాడు.

వెంకట్ : ఓహో ! ట్యూషన్‌కి వెళ్తే - ఎంచక్కా ఏ అడ్డంకీ లేకుండా కాపీ రాసుకోవచ్చన్నమాట !

సుజాత : ఏయ్ విజయా ! లెక్కల్లో నీకెప్పుడూ సున్నాలే వస్తుంటాయ్ కదే ! ఈ సారి పన్నెండు మార్కులు ఎలా వచ్చాయ్ నీకూ? ఏదీ, నీ పేపర్ చూడనీ!

(విజయ తన పేపర్ ఇస్తుంది.)

గీత : అరే - నువ్వు ఏ లెక్కకీ స్టెప్ రాయకుండా

అన్నింటికీ - కరెక్ట్‌గా 'ఆన్సర్లు' మాత్రం ఎలా రాయగలిగావ్ !?

విజయ : ఏం చేయనే! పరీక్ష హాల్లో పిల్లలందరి ముందూ ఆన్సర్లు చెప్తే బావుండదనీ - నిన్నరాత్రే మా ట్యూషన్ మాస్టర్ పేపర్ అవుట్ చేశాడు! అది చాలదన్నట్టు ప్రతి లెక్కనూ నాతో ఒకటికి పదిసార్లు చేయించారు !

సుజాత : మరి - పేపర్ అవుటయి - అన్ని లెక్కలూ నీతో చేయిస్తే - నూటికి నూరు రావాలి కదా మార్కులు !

సుజాత : ఏం చేయనే ! పరీక్ష హాల్లో ఒక్కలెక్కా గుర్తుకు రాలేదు ! గుర్తొచ్చిన ఆన్సర్లు మాత్రం రాసేశాను!

రాము : మా డాడీ నెలకి యాభై రూపాయల ఫీజు ఇస్తారు ట్యూషన్ మాస్టర్‌కి! ఆయన దగ్గరికి 'ముప్పై మంది' పిల్లలొస్తున్నారు ట్యూషన్‌కి!

గోవింద్ : అబ్బ ! ముప్పై మందే ! ట్యూషన్ల పేరిట ఆయనకి ఆ లెక్కన నెలకు పదిహేను వందలొస్తున్నాయన్నమాట ! స్కూల్లో జీతం పదిహేను వందలు! మొత్తం నెలకి మూడు వేల రూపాయల జీతం! ఎంత అదృష్టం !

రాము : ఇంకా అంతేనా ? మా మమ్మీ అయితే మా ఇంట్లో కాసే కూరగాయల్ని పంపిస్తూ వుంటుంది! ఏ పిండి వంటలు వండుకున్నా

- అన్నీ టిఫిన్ క్యారియర్లో పెట్టి, నాతోనే ట్యూషన్ మాస్టర్‌కి పంపిస్తూ వుంటుంది.

వెంకట్ : మా డాడీ అయితే దుబాయ్ నుండి మా బాబాయి పంపిన స్ప్రే బాటిల్స్, పెన్నులూ, వాచీలూ అవీ యివీ పంపిస్తూ వుంటారు ! అప్పుడప్పుడు డిన్నర్‌కి కూడా పిలుస్తూ వుంటారు.

గోపి : ఈ గురుదక్షిణలన్నీ చూస్తూంటే - నాకూ గురువునై పోవాలనుంది రా !

రాము : స్కూల్లో ఆరుగంటలు కష్టపడి పనిచేస్తే - పదిహేను వందల రూపాయలు ! ఇంట్లో ఒక గంట ట్యూషన్ చెప్తే - పదిహేను వందల రూపాయలు... ఇంకా బహుమతులూ... గురుదక్షిణలూ....

గోపి : ఇదేదో లాభసాటి వ్యాపారం లాగుందిరా !

రాము : మనం పెద్దయ్యాక - ఏ స్కూల్లోనూ జాయిన్ కాకుండా ఒక్కో బ్యాచ్‌కి ఒక్కో గంట చొప్పున ఆరు బ్యాచ్‌లకి ట్యూషన్స్ చెప్దామా?

గోపి : అవునవునూ - ఎంచక్కా నెలకి తొమ్మిది వేల రూపాయలు సంపాదించుకోవచ్చు !

గోవింద్ : అరే - పిచ్చి సన్నాసీ - ఏ స్కూల్లోనూ - మనం పని చేయకపోతే - మన దగ్గరికి ట్యూషన్లకి వచ్చే వెర్రి వెంగళప్పలు ఎవరుంటార్రా!

రాము : అవునూ - అదీ నిజమే ! ఫలానా స్కూల్లో

పని చేస్తున్నామంటేనే కదా - మన దగ్గరికి పోలోమని ట్యూషన్ల కొస్తారు !

గోపి : అందుకని పేరున్న స్కూల్లో వుద్యోగం వచ్చే దాకా కాళ్లావేళ్లా పడాలి! కాళ్లరిగేట్టు తిరగాలి!

రాము : ఎలాగోలా ఉద్యోగం సంపాదించుకొని - కాస్త నిలదొకుకున్న తర్వాత... ట్యూషన్లు మొద లెట్టాలి! అలా ఒక్కరొక్కరే ముప్పైమంది పిల్లల్ని పోగేసుకోవాలి !

గోపి : ఇంకా - వస్తున్నారనుకుంటే - ఓ మంచి ముహూర్తం చూసుకొని ఏదో ఓ వంకతో మేనేజ్‌మెంట్‌తో దెబ్బలాడి - రిజైన్ చేసి పారేసి - ఏకంగా ఓ స్కూల్‌నే స్టార్ట్ చేయాలి! ఎలా వుందిరా మన ఐడియా ?

రాము : నీ ముఖంలాగే వుంది గానీ - నాకో విషయం మరీ విచిత్రంగా వుందిరా !

గోపి : ఏమిట్రా అదీ !?

రాము : మన రాజారావు మాస్టర్ గంటలో ముప్పై మందికి ట్యూషన్ చెప్తాడు కదా !

గోపి : అవునూ... అయితే ఏంటట !?

రాము : ఆ ముప్పై మందిలో మూడు వేర్వేరు క్లాసుల వాళ్లున్నారు కదా !

గోపి : ఉన్నారూ... ఉంటే నీకేం ?

రాము : ఒక్కో క్లాస్‌కి ఆరు సబ్జెక్ట్స్ వుంటాయి కదా !

గోపి : (విసుగ్గా) ఉంటాయి..... లేవని ఎవరన్నారు? సరిగ్గా చెప్పి ఏడ్వక- ఏమిట్రా ఈ సణుగుడూ?

రాము : మూడు ఇంటూ ఆరు మొత్తం పద్దెనిమిది సబ్జెక్ట్స్...

గోపి : ఊ.... పద్ధెనిమిది సబ్జెక్స్....

రాము : పద్ధెనిమిది సబ్జెక్స్.... ఆ ముప్పై మందికి 60 నిముషాల్లో చెప్తాడంటే- ఒక్కో సబ్జక్ట్ కొరకు ఒక్కో విద్యార్థికి ఆయన ఎంత టైం కేటాయిస్తున్నాడంటావ్?

గోపి : (ఆలోచిస్తున్నట్టు నటించి) ఓష్.... హీ... హీ... నాకామాత్రం లెక్కతెలీదా ? ఒక్క సబ్జక్ట్ని మూడు క్షణాల్లో చెప్పేసేయాలి!

రాము : అంత తొందరగా - ఆ సబ్జెక్ట్ని అర్థం చేసుకునే ఆ పిల్లలు నిజంగా ఎంత మేధావులో ?

గోవింద్ : పూర్ చిల్డ్రన్ ! ఐ పిటీ దెమ్ !

రాజేష్ : అంత టైం లేకే కదా - ఆయన పరీక్ష హాల్లో పిల్లలకి జవాబులు చెప్తూ వుంటాడు ! ఎవరూ చూట్టం లేదనుకుంటే - తనే జవాబులు కూడా రాసేస్తూ వుంటాడు!

గోవింద్ : కంచే చేను మేసినట్టు - ట్యూషన్ల పేరుతో మన టీచర్లే ఇలాంటి అవక తవకలకి పాల్పడ్తే మనల్ని రక్షించేదెవర్రా ?

రాజేష్ : అవున్రా ! ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు కాబట్టి మనమే ఈ ట్యూషన్లకి గుడ్బై

కొట్టి - కష్టపడి చదువుకుందాం!

గోవింద్ : ఒకవేళ క్లాసులో మన మాస్టార్లు చెప్పింది అర్థం కాకపోతే....

వెంకట్ : ఒకటికి పదిసార్లు చెప్పమందాం !

రాజేష్ : అప్పటికీ.... అర్థం కాకపోతే, హెచ్చెంకి చెప్పి ఆ సబ్జెక్ట్ టీచర్‌ని మార్చమందాం !

గోవింద్ : అంతేగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ మనలో ఎవరూ ట్యూషన్లకి వెళ్ళవద్దు !

రాజేష్ : అవున్రా ! మనకి ఏ ప్రయోజనమూ కల్గించని ఈ ట్యూషన్లకోసం- మన పేరెంట్స్ అంత ఖర్చు పెట్టడం కూడా మియర్ వేస్ట్!

(తెర)

1988

★★★

# పాఠకుల స్పందన....

# పాఠకుల స్పందన....

★ మీరు పిల్లలని ఉద్దేశించి నాటికలు రాశారు కానీ, కొన్ని పాత్రల్లో పెద్దవాళ్ళు అధికంగా కనిపించారు.

- నాటిక అన్న తర్వాత అన్ని వయస్సుల పాత్రలూ వుంటాయి! తండ్రి పాత్రలూ, తాత పాత్రలూ, అమ్మమ్మ పాత్రలూ, బంధువుల పాత్రలూ కుటుంబంలో అంతర్భాగం కాబట్టి - పిల్లల నాటికల్లో ఆయా సన్నివేశాల్లో కథా పరంగా పెద్దల పాత్రలు కూడా దర్శనమిస్తాయి!

★ పిల్లలకోసం మీరు రచించిన నాటికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం! 'ఎజుకేటెడ్ ఇల్లిటరేట్' చాలా బావుంది!

- డా॥ బి. మురళీకృష్ణ, బెల్లంపల్లి.

హాలిడే:

★ అమృతలత గారి 'హాలిడే' నాటిక నాకు ఎంతో బావుంది. ఇలాంటి నాటికలు ఇంకా ప్రచురించాల్సిందిగా కోరుకుంటు న్నాం.

- ఇ. వెంకటేశ్వర రావు, విజయవాడ.

ఇన్విజిలేషన్:

★ మీ ఇన్విజిలేషన్ నాటిక చదివాం. వియార్ వెరీమచ్ డిలైటెడ్! దాన్ని ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేసుకొని మేము మా 'టాలెంట్స్‌డే' నాడు ప్రదర్శించబోతున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం.

- యం. కృష్ణారావు, గడ్డిఅన్నారం, హైదరాబాద్.

★ మీరు రాసిన 'ఇన్విజిలేషన్' నాటికను మా స్కూల్‌డే నాడు ప్రదర్శించాం. విద్యార్థుల తల్లిదండ్రులూ, ప్రేక్షకుల నుండి ఒకటే ప్రశంసల వర్షం.

- జి. గోవర్ధన్ రెడ్డి, చేగుంట.

- ఆ క్రెడిట్ నాకే కాదు, ఆ నాటికని అంత బాగా రక్తి కట్టించిన ఆ చిన్నారులకి కూడా దక్కుతుంది!

-అమృతలత

★ మీ ఇన్విజిలేషన్ నాటిక చదివాను. నాదో డౌట్ ! అసలు విద్యార్థులు పరీక్షల్లో ఎందుకు కాపీ చేయవలసి వస్తోంది ?

- ఆలంపల్లి, కల్యాణ్ కుమార్, నల్గొండ.

- *చదవడానికి కష్టపడే విద్యార్థులకి... వాళ్ళ స్కూల్స్‌లో పాఠాలే చెప్పరాని 'ఇన్ఎఫిషియంట్' టీచర్స్ దొరకడం - పండు ఒలిచి నోట్లో పెట్టేలా పాఠాలు చెప్పగలిగే 'ఎఫిషియంట్' టీచర్స్ కి వాళ్ళ స్కూల్స్‌లో.... చదవడానికి ఇష్టపడని విద్యార్థులు దొరకడం మూలంగా ఈ రోజుల్లో కాపీయింగ్ సంస్కృతి ప్రబలిపోతోంది.*

*-అమృతలత*

★ మీ 'ఇన్విజిలేషన్' బావుంది. హాస్యనాటికగా ప్రదర్శించడానికి ఫర్వాలేదు ! కానీ ఈ నాటిక పాఠశాలల్లో విద్యార్థులచే వేయిస్తే విద్యార్థులు చెడిపోవడమే కాకుండా అసలు కాపీ చేయడమంటే ఏమిటో తెలియని విద్యార్థులక్కూడా స్లిప్స్ ఎక్కడెక్కడ దాచుకోవాలో తెలిసేటట్లుగా వుంది.

- కె. వినోద్, ఖమ్మం.

- *ఈ రోజుల్లో ఇన్విజిలేషన్ అనేది టీచర్స్‌కి ఎలా కత్తిమీద సాములాంటిది అయిపోయిందో తెలియజెప్పడమే ఈ నాటిక ముఖ్యోద్దేశ్యం ! పోతే... విద్యార్థులు స్లిప్స్ ఎక్కడెక్కడ దాచిపెట్టుకునేదీ టీచర్స్‌కీ, ఫ్లైయింగ్ అధికార్లకీ తెలీదనుకుని... పప్పులో కాలేసి... ఎలా డిబార్ అవుతారో... ఆ నాటికలో చూపించడం జరిగింది!*

*-అమృతలత*

★ గత ఆరు సంవత్సరాలనుండి టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారిగా పనిచేస్తోన్న నాకు మీ కథ చదువుతూంటే ఎగ్జామినేషన్ హాల్లో వున్నట్లే అనిపించి - నేను డిబార్ చేసిన వందలాది మంది కాపీరాయుళ్ళు నా కళ్ళ ముందు మెదిలారు. పాఠశాలల్లో నాటికలు వేయడానికి వీలుగా పాఠకులకు నాటికలు అందజేయడానికి ప్రయత్నం చేస్తోన్న మీకు అభినందనలు !

- డి. సేనాపతి, కరీంనగర్.

★ కాపీ చేయడం వల్ల కలిగే అనర్థాలను ఇంకా వివరంగా చెప్పి-

విద్యార్థుల్లో కాపీ చేయడం ఒక చెడ్డ అలవాటని, అది తగదని వివరించి వుంటే బావుండేది.

- ఎల్. ప్రణయ్ కుమార్ రెడ్డి, ఆరోతరగతి, బోధన్.

- *చూడు బాబూ ! నువ్వు చదువుతోంది ఆరో తరగతి. కాపీ చేయడం ఒక చెడ్డ అలవాటని నీకే తెలిసినపుడు ఆ నాటికలో టెంత్ పరీక్షలు రాసే వాళ్ళకి తెలీదని మనం అనుకోనక్కరలేదు! నువ్వు చెప్పినట్టు కాపీ చేయకూడదని పొడుగాటి డైలాగ్స్ విద్యార్థులకి టీచర్స్‌తో చెప్పించవచ్చు! కానీ నాటికలో అది ఎగ్జామినేషన్ హాల్! ఎంతో విలువైన ఆ సమయంలో టీచర్స్ చేత డైలాగ్స్ చెప్పిస్తూ కూర్చుంటే - ప్రశాంతంగా పరీక్ష రాయాలనుకునే విద్యార్థులకి డిస్టర్బెన్స్ కదా... ఆలోచించు*

-అమృతలత

★ కొంతమంది కాపీ చేసే విద్యార్థులు... ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వచ్చినపుడు తాము రాస్తోన్న స్లిప్స్‌ని... కొంతమంది బుద్ధిగా పరీక్షరాసుకునే విద్యార్థులమీదికి విసరడం - అది తెలియని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వాళ్ళనికూడా డిబార్ చేయడం చూపిస్తే... ఎగ్జామినేషన్ హాల్లో అమాయకులు ఎలా బలి అయ్యేవాళ్లో ఇంకా వివరంగా తెలిసేది!

- ఎ. అనూరాధ, హైదరాబాద్.

- *మొదట్లో నేనూ అలాగే రాయాలని అనుకున్నాను ! కానీ... అప్పుడు కాపీ చేసేవాళ్ళనీ - చేయకుండా బుద్ధిగా రాసే విద్యార్థుల్ని ఒకే గాటన గట్టి - ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు డిబార్ చేస్తారుకదా అనే ప్రెజుడిస్ విద్యార్థులు పెంచుకుంటే... ఈ నాటిక ముఖ్యోద్దేశ్యమే దెబ్బతింటుందని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను.*

-అమృతలత

★ కాపీ చేయనివ్వని టీచర్స్‌పై పరీక్ష అయిపోయాక విద్యార్థులు ఎలా రివెంజ్ తీసుకునేదీ చూపించివుంటే - ఇంకా సమగ్రంగా ఉండి ఉండేదేమో ?

- సాయిప్రసాద్, కర్నూల్.

- ఇది ఏకాంకిక ! పరీక్షహాల్ తప్ప మరో సీన్ చూపించలేం! అదే ఏ సినిమానో- టీవీనో - అయితే మీరు చెప్పినట్టు ఎన్నయినా చూపించవచ్చు.

-అమృతలత

★ ఎంత సేపూ పిల్లల్ని చదువులపరుగులో ముందు నిలబెడ్దామన్నా తపన తప్ప, వారి బాల్యాన్నీ, అభిరుచుల్నీ పట్టించుకోని ఈ రోజుల్లో పిల్లల మనస్తత్వాలపై నాటికలు రాయాలని మీరు అనుకోవడం నిజంగా అభినందించదగ్గ విషయం.

- తమ్మిశెట్టి ఇందిరారావు, విజయవాడ.

★ మీ మొదటి 'ముఖాముఖి'లో మొదటి జవాబుకి మొదటి ప్రశ్న నాదే ఉండాలని ఎంతగా ఆశపడ్డానో ! నాది వెరీ వెరీ బ్యాడ్‌లక్! ఇంతమంచి నాటికలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

- ఎస్. వేణుగోపాల్ శంకర్అమ్మె, ఆసిఫాబాద్.

★ మీరు ప్రతివారం ఆంధ్రభూమిలో రాస్తోన్న చిన్నపిల్లల నాటికలు ఎంతో బావుంటున్నాయి.

- ఆర్. శ్రీనివాస్, మంచిర్యాల, కె. రమ, నందిగామ.

★ మీ నాటికలు సింప్లీ సూపర్బ్ ! వియార్ ప్రౌడాఫ్‌యూ !

- కాట్రగడ్డ వెంకట్రావు, పామర్రు, ఎస్.ఎస్. రావు, పాలేరు, బాబూరావు, సాలాగ్రంపురం.

★ పిల్లలకోసం అమృతలత గారు అందిస్తోన్న నాటికలు నిజంగా అమృతగుళికల్లా ఉన్నాయి.

- శ్రీశ్రీ, సంగారెడ్డి.

★ మీరు రాస్తోన్న నాటికలన్నింటినీ ఒక పుస్తకంగా అచ్చేయిస్తే.... మా స్కూల్ లైబ్రరీకి ఆ పుస్తకాన్ని కొనుక్కుంటాం! దయచేసి ఆ ప్రయత్నాన్ని చేపడ్తారని భావిస్తున్నాం.

- అరుణ్ కుమార్, సీతానగరం, లాల్‌ప్రసాద్, బయ్యారం, నాగార్జున విద్యాలయం ప్రధానోపాధ్యాయులు, వాలపర్ల, ఎ. సురేష్ కుమార్, కొయ్యలగూడెం, కె.సుబ్బారావు, సత్తుపల్లి, యం. పిచ్చయ్య, కావలి.